వేదాంగాలు

# ఆంధ్ర వ్యాకరణ సర్వస్వతత్త్వము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శారదాకాంచిక; షష్ఠకింకిణి.

# ఆంధ్రవ్యాకరణసర్వస్వతత్త్వము

కీ. శే. శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి ప్రణీతము

(శుక్లసంవత్సర భారతిలో మొదట ప్రకటితము.)

వేదము — వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్సు
4. మల్లికేశ్వరస్వామిగుడిసందు, లింగిసెట్టివీథి,
జి. టి. మదరాసు.

1950.

*All Rights Reserved.* రూ 1-0-0.

# అవతారిక

ఆంధ్రవ్యాకరణసర్వస్వ మను పేర ఆంధ్రప్రపంచమునకు విక్రమసింహాపురంబున ఇప్పుడు కనుపట్టిన చెట్టకు శాంతిచేయ వలసి వచ్చినది. గ్రంథకర్తకు అప్రియము గావించుట మదీప్సితము గాదు. ఆంధ్రవిద్యార్థిలోకమునకును, తన్మూలముగా ఆంధ్రభాషాదేవతకును ఇంత మొగ్గు గలిగించు వ్రాంత ఇంత మట్టుకు మఱియొకటి లేనందున దీని యీవిమర్శచేత ఆంధ్రభాషాదేవతను సేవించుచున్నాఁడను.

ఈ వ్యాకరణము క్రమము తెలియకయు, ఆవశ్యకానావశ్యక వివేచనంబును, సాధ్వసాధు భేదజ్ఞానంబును లేకయు, పూర్వవ్యాకర్తల బుద్ధిప్రభావమును గననేరకయు, గ్రంథ సంకలనము జేసినట్టిది. 'సర్వస్వ' నామముచే నీపొత్తము అష్టాధ్యాయివంటిదని భ్రమగలుగుచున్నది; ఇందు హలంతప్రకరణమును సర్వనామప్రకరణమును ఇట్టివి ఎన్నియో లేవు. అట్టి దీనిని సర్వస్వమనుట వట్టి యాడంబరము. దీనికి ఇంగ్లీషునం బెట్టినపేరు ఇంతకన్న ఉచితముగా నున్నది. ఏలయన, ఇందు మౌళికవిషయములకు ఇంచుకంత దిక్ప్రదర్శనము కలదు. ఇట్లు పరస్పరవిపరీతార్థములైన పేర్లు రెండుభాషలయం దిడుకొనుట పటమున ఒక ప్రక్కను సింగము నరునిం జీల్చుచున్నట్లును, రెండవ ప్రక్కను నరుఁడు సింగమును మడియించు చున్నట్లును, చిత్రించిన చమత్కారముం దలఁపించుచున్నది. ఈ సర్వస్వ

పాణినీయసూత్రము. ఈసూత్రమునం జెప్పిన విషయము తెలియక పదశబ్దార్థ మెట్లు తెలియును? మూఁడవతరగతి బాలునికి పాణినీయ శాస్త్రపాండిత్య మెట్లలవడును? ప్రథమ సూత్రమందే సుబంత మన నేమో, తిజ త మన నేమో తెలియవలసియున్నది. 'ఉపయోగించు' ఈపదమునకు బదులుగా ప్రాయికముగా 'ప్రయోగించు' అనియేని, 'ఆడు' అనియేని, 'వాడు' అనియేని వ్యవహరింతురు.

మఱియు నిట ఆంధ్రభాష యనఁగా ఆంధ్రదేశమువారాడుభాష యని వివరణ మున్నది. ఇచట అడుగఁదగిన దొకటి కలదు ఏమన, భాషవలన దేశమునకుం బేరువచ్చినదా? దేశమువలన భాషకుం బేరువచ్చినదా? ఆంధ్రభాష యన నేమో తెలియకముందే ఆంధ్రదేశమన నేమో 3 వ తరగతి బాలునికిం దెలియునా? ఇందును తెలిసియున్నదానిని తెలియని దానిచేత వివరించుటగా నున్నది. ఈ చిన్నిపొత్తము ఆంధ్రబాలురం గూర్చినదే గావున 'మనము వాడుమాటలు ఆంధ్రభాష' యనినం జాలును. బాలురకును సులువుగా తెలియును. మఱియు, ఆంధ్రదేశమువారాడు భాషయుఁటగదా ఆంధ్రము! వారు ఇంగ్లీషు, అఱవము, కన్నడము భాషింపరా?

౨. 'భాషయందలి పదములను నిర్దోషముగ సవరింప నుపయోగించు గ్రంథము వ్యాకరణము.' అని ద్వితీయ సూత్రము. పదములు భాషయందలివి గాక యునుండునా? 'భాషయందలి'. అని నిర్దేశించుట వ్యర్థము. 'నిర్దోషముగ సవ

రించుట' అని యున్నది. సదోషముగా సవరించుటయుం గలదా? సవరించుట యనఁగా నిర్దోషము సేయుట గాదా? వ్యాకరణము సవరించుటకు మాత్రమా? వ్యవహరించుటకుఁ గాదా? ఇది లేనిచో అసాధుత ఎక్కడిది? ఇట్లు సేయుట దొంగిలింపించి శిక్షించుటగా నున్నది. వ్యాకరణము చదువని వాఁడో, చదివియు గ్రామ్యము వచించువాఁడో భాషించు నెడల తదీయశ్రోత వ్యాకరణము చదివినవాఁడు, వ్యాకరణము వానికడనే నేర్చినవాఁడే అయినను, వానిపదములను దిద్ది అనువదించుచుండవలయునా? లేక, వానితప్పులు దిద్దక వానికి తానుజెప్పు నుత్తరాదికములో నిర్దోషముగా వ్యవహరింపవలయునా? మఱి-అభిప్రాయము తెలియవలయునే గాని భాష యెట్లున్న నేమి అని సమయముచేసికొన్నచో దోషమనునదియే యుండదు. అంతట ఈశాస్త్రమే అక్కఱలేదు. అట్లుండఁగా ఈశాస్త్రము దోషకల్పనకా ఏర్పడుట? సవరించుకొననిచో ఏమిచెట్టు? నరకమేని, ఆకారణమునే పురస్కరించుకొని తన్నివారణార్థము వ్యాకరణమని ప్రయోజనము వచింపవలయును. దోషత్వజ్ఞానము లేక సవరణకై యుద్యమము ఎక్కడిది? కావున ఈ నిర్వచనముచే ఈశాస్త్రము అప్రస్తుతమును, అప్రయోజకమును ఐనది. భాష్యకారులవారు 'రక్షోహాగమలఘ్వ సందేహములు శబ్దానుశాసనమునకుం బ్రయోజనము' అని యనుశాసించినారు. మఱియు నిర్దోష సంస్కారము పదములకేగాని వాక్యములకు వలదా? వాక్య

గతపదముల క్రమము వ్యత్యాసపడినచో దానిని దిద్దవలదా? పదముల సవరణచే వాక్యములసవరణ ఏర్పడ మేని వర్ణముల సంస్కారముచే పదముల సంస్కారము సిద్ధింపదా? వర్ణ సంస్కారమే చాలదా?

3. "సంస్కృతప్రాకృత పదములును ఆంధ్రమునం జేరు చున్నవి. కావున ఆ రెండు భాషలనుంగూర్చి ముందుగఁ దెలియనగు." అని వాక్యము. ఈ క్రమము పెండ్లికి బజంత్రీలును వత్తురు గావున పిల్లను కుదుర్చుకొనకముందే బజంత్రీలకు చాఁపలు సంపాదించుటగానున్నది. ఇందువలన ఏయే భాషలపదములు ఆంధ్రమునం జేరునో ఆయాభాషలంగూర్చి ముందుగఁ దెలుఁగనగునని యొక న్యాయ ముప్పతిల్లుచున్నది. దానింబట్టి, యీవ్యాకరణమును బఠింపంగోరు బాలురకు ఇంగ్లీషు, హిందీ, అఱవము, కన్నడము లోనగు భాషలను గూర్చియు ముందుగానే తెలుపవలదా? మఱి తెలుపమి యేల? ఇందు సంస్కృతప్రాకృత పదములు చేరుట వానింగూర్చి ముందు చెప్పుటకు కారణము కానేకాదు. అట్టికారణము వలయునేని వానికి ఇది పెల్లుగా వికృతియగుట కారణమని జెప్పుట కొంత యొప్పును. ఇదియునుంగాక ఆరెంటి తత్త్వమును ముందు చెప్ప నక్కఱలేనేలేదు. ఆంధ్రస్వరూపమునే ముందు చెప్పవచ్చును. ఆ ప్రకృతులను ఆనుషంగికముగా అనంతరము వలసినయట్లు చెప్పవచ్చును. నిశ్చయముగా వాని స్వరూపమును ముందుగాఁ జెప్పుట విద్యార్థులకు పీడాకరము.

మఱియు 'ఆంధ్రభాషయందలి పదములలో సంస్కృతప్రాకృత పదములు చేరుచున్నవి' అని సర్వస్వవాక్యము. పదములలో పదములు చేరుట యననేమి? "పినాకినిలో" అనుచో "పినా (సం) రామస్య (లేక ప్రా. రామస్స)కినిలో"="పిరామస్య(లేక-రామస్స)నాకినిలో" అను నిట్టి ప్రకారంబులం బదములోఁ బదము చొచ్చుటయా? లేక "పినాకినిలో రామస్య (లేక రామస్స) మూట మునిఁగిపోయినది" అను తీరున ఈపదముల చెంత ఆపదములు వచ్చుటయా? లేక "రామస్య(లేక రామస్స) అనెను" అను ప్రకారమున అనుధాతుయోగ మొంది ప్రయోగింపఁబడుటయా? ఆపక్షమున సకల భాషల పదములును సకల భాషలయందును అనుకృతివశంబున ప్రయోగముం బొందును. కావున సకల భాషలనుం జెప్పక సంస్కృత ప్రాకృతములను మాత్రము చెప్పుట యేమి? అనుకృతియు నిచ్చట వివక్షిత స్థానము గాదు. కావున "ఆంధ్రశబ్దము లెన్నియో సంస్కృత ప్రాకృత శబ్దములకు వైకృతములు" అన్నచో వివక్షితార్థము సుబోధ మగును.

మఱియు, "పినాకినిలో రామస్య (లేక రామస్స) మూట" ఇత్యాది వాక్యములో "పినాకినిలో" అను పదము ఈసూత్రము ప్రకారము సంస్కృతప్రాకృత పదములుకాని యాంధ్రమా, లేక అదియే సూత్రోద్దిష్టమయిన సంస్కృత పదమా? ఇట సూత్రమందు ఆంధ్రభాష యనఁగా తత్సమ తద్భవ దేశ్యగ్రామ్యాత్మకమైన తెలుఁగు భాషయా? ఒండె

తత్సమతద్భవ భిన్నమైన తెలుంగా? అనఁగా దేశ్యగ్రామ్యా త్మకమైన తెలుంగా కాక దేశ్యముమాత్రమా? గ్రామ్యము మాత్రమా? స్పష్టముగా వ్యాకర్తగారు చెప్పలేదు.

౮. "సర్వస్వ"మని సంజ్ఞితమైన యీవ్యాకరణములో అచ్చులు, హల్లులు ఇత్యాది సంజ్ఞలు ఏల కలిగెనో తెలియ కయేయున్నది. 'సర్వస్వ' మన 'లేశ'మని తలంచిరా? మఱి "వర్ణములు ౫౦" అనిసూత్రము. ఏవి అవి? ఎక్కడ దాఁగి యున్నవి? "అచ్చులు ౧౬" అఁట. ఏవీ అవి? ఏల యీదాఁప రికము? బాలురకు తెలియఁగూడదా? ఇదా పూర్వవైయా కరణులకుం దెలియని క్రమము? "హల్లులు ౩౮" అని సూత్రము. ఏవో అవి? ఏమి చిత్రక్రమ మిది! ఎట్టకేలకు మరల అచ్చులకు 'అ, ఇ, ఉ, ఋ, ఌ' అని యొక పంక్తి. ఇందు ౧౬ టికిని ౫టిని ఇప్పటికి చెప్పినారు. తదితరములను ౧౧ టిని ఎప్పుడో వెల్లడింతురు!

౫. "అచ్చులు స్వతంత్రోచ్చారణ గలవర్ణములు" అని సూత్రము. దానికి వృత్తిగా "స్వతంత్రోచ్చారణ యనఁగా తమయంతట పలుకఁదగినవి." అని యొక యనన్వితవాక్యము కలదు. 'ఉచ్చార్యము'లన పలుకఁదగినవి గాని 'ఉచ్చారణ' మన పలుకఁదగినవి కావు. 'ఉచ్చారణ'యనం బలుకుట. పదు నాఱు అచ్చులకును ఇందువలన స్వతంత్రోచ్చారణ చెప్పఁబడి నది. ఆపదునాఱింటికిని వీరిలెక్క—హ్రస్వములు ౫, దీర్ఘ ములు ౯, అనుస్వార విసర్గములు ౨ అని-అనుస్వారవిసర్గ

ములు అచ్చులగునేని, అవి స్వతంత్రోచ్చారణగలవి యగునా? అవి హ్రస్వములా దీర్ఘములా? ఆభేదము వీనికి లేదేని "అచ్చులు స్వతంత్రోచ్చారణ గలవర్ణములు : హ్రస్వములు, దీర్ఘములు అని. రెండువిధములు" అని అచ్చులకెల్ల ఆభేదములను చెప్పుట సరిగాదు. ఈరెండును స్వతంత్రోచ్చారణ కలవియే యని వాదమేని, వీనిని 'అం' 'అః' అని అకారపూర్వముగా నిర్దేశింప నేల? 'స్వతంత్రోచ్చారణ' యనఁగా మనుష్యులతో పనిలేకయే వాగింద్రియముతో పనిలేకయే శబ్దించుచుండుటయా?

౬. "రెండుమూఁడు హ్రస్వములు కూడి ఒకదీర్ఘమగును." ద్విత్వాచ్చులు, త్రిత్వాచ్చులు అగుననుటయా? ద్విత్వహల్లులవలెనా? ఆపక్షమున వేఱువేఱుగా చెప్పనేల? క్క, గ్గ ఇత్యాది వేఱువేఱుగా హల్లులలో చెప్పినారా? చెప్పవలయునా? మఱచినారా? వేఱువేఱుగా నున్న స్వరములు కూడినప్పుడు నడుమయడాగమాదికము రావలదా? అ+అ='అయ' కాదా? సంధిప్రకరణము ౨, 3 సూత్రముల యుదాహరణంబులందుంబోలె—(హరి+అతడు=హరియతఁడు; మా+అమ్మ = మాయమ్మ)–ఇటనుం గావలదా? 'మేనయత్త'వలె అత్తవలదా? ఏల యత్తదు? "అఆఇఈ ఇత్యాది వర్ణసమామ్నాయోపదేశములో యడాగమాదికము రాలేదేమి?" అని యాక్షేపింతురు గావలయు. అచటకూడుట లేదు గావున రాలేదు. మఱి ౧౧ వ సూత్రములో కంఠ్యవర్ణపరిగణనములో 'ఆ'ను పఠింపనేల? అకారము చాలదా?

మఱియు, ఈప్రక్రియంబట్టి గోడ + ఉన్నది = గోడో న్నది, చెట్టు+ఉన్నది = చెట్టూన్నది, గోడ + అయినది = గోడాయినది, హరి+ఇతఁడు = హరీతఁడు అని యేర్పడవలదా? రెండుమూఁడు హ్రస్వములు గూడి దీర్ఘ మగునఁటగదా. . అట్లగుటలో ఆహ్రస్వములక్రమము ప్రయోజకమా, కాదా? అ+ఇ=ఏ కాదా? ఇ+అ=ఏ అగునా? కాదని సూత్రమునకు అర్థ మెట్లు కలుగును? కూడికమాత్రమే ప్రయోజకము గాదు, క్రమముకూడ చేరవలసియున్నది. ఈధోరణిలో 'ఇ+అ' కూడ 'ఏ''అగును. ''దీర్ఘాంతములగు సంస్కృతపద ములు తత్సమంబున హ్రస్వాంతము లగును.'' అని శబ్దప్రక రణములోని ౧౯ వ సూత్రము. దీనింబట్టి రామా, హరీ, గురూ, ఇత్యాదులు తత్సమమున రాము, రామి, రాము, రామ్ఱు, రామ్లు, హరి, హర, హరు, హర్ఱు, హర్లు, గుర, గురి, గురు, గుర్ఱు. గుర్లు ఇట్టి రూపములం దాల్చి ఇద్దఱు రాములు ఇత్యాద్యర్థములం బొరయును. ఇది భాషాభివృద్ధి గాదా! ఈ సంజ్ఞాసూత్రము తోడ్పాటున రమాగౌరీ శబ్దములు రమ; రమి, రము, రమ్ఱు, రమ్లు అనియు, గౌర, గౌరి, గౌరు, గౌర్ఱు, గౌర్లు అనియు తత్సమంబున రూపంబులం దాల్చును. ''సంస్కృతశబ్దములు తొంటి ప్రత్యయములం గోల్పోయి, తెనుంగునం దమకు తగిన ప్రత్యయములం దాల్చి తత్సమము లగును.'' అనుసూత్రము ఈప్రక్రియకు బాధకము గాదా యందురేని, దీర్ఘాచ్చును త్యజించుటయే తొంటిప్రత్యయమును

విడుచుటయు, హ్రస్వమును దాల్చుటయే తెనుఁగునకుఁ దమకుం దగిన ప్రత్యయముం గొనుటయు నని వ్యాఖ్యానము. ఈ సంజ్ఞాసూత్రముచేత, ఏవో రెండుమూఁడు హ్రస్వములు కూడి ఏదో దీర్ఘమగును అని అనుశాసించినందున, అనఁగా దీనికి ఇది హ్రస్వము, దీనికి ఇది దీర్ఘము అని ఏకాచ్చునకు హ్రస్వదీర్ఘతాభేదములు విధింపనందున, పైయసందర్భము కలిగినది. మఱియు నీ ౬ వ సూత్రములో కూడిన మొత్తము తూనికయో, కొలతయో సరిపోవుటయే చెప్పఁబడినది గాని సంబంధాపేక్ష ఉక్తముగాదు. అందుల ప్రభావము ఇంకనుం జూడుఁడు: ''కాలము''=క్+అ+అ+ల్+అ+మ్+ఉ అనియేని, క్+అ+అ+అ+ల్+అ+మ్+ఉ అని యొండె, ''కౌను''=క్+అ+అ+ఉ+న్+ఉ అనియేని, క్+అ+అ+అ+ఉ+న్+ ఉ అని యొండె, రెండేసి తెలుఁగుల వర్ణక్రమము వచింపవలయును. మఱియు ఈఫక్కిచే ఒ+ఒ=ఓ అని నేర్పలేదేమి? ఆంధ్రమున ఒకారము గలదుగదా? 'మేము చెప్పిన యో (ఓ)కారము సంస్కృతవర్ణము, సంస్కృతమున ఒకారము లేదు, కావున ఓకారమును ఒకారద్వయసంకలన జాతముగా చెప్పమైతిమి' అందురా? అపక్షమున సంస్కృతమున అ+ఉ=ఓ అనియు, దేశ్యమందు ఒకారద్వయసంకలనజాతముగాను చెప్పెదరా? అట్లయిన అజాదిసంజ్ఞలు కేవలాంధ్రవర్ణములకు చెల్లునా? ఇట్లే ఎకారతత్త్వముం గూర్చియు చర్చింపవలయు. మఱియంత సర్వస్వములో ప్లుత మెట్లు కలుగునో చెప్పలేదేమి? అది అసంబద్ధమా?

మఱియు నొకసందేహము. ఈఫక్కికవలన పెద్ద దీర్ఘము, చిన్నదీర్ఘము అని దీర్ఘమునకు ద్వైవిధ్యముకలదా? ఒండె మూఁటి మొత్తపుదీర్ఘములోని హ్రస్వము చిన్నది; రెంటి మొత్తపుదీర్ఘములోని హ్రస్వము పెద్దది-అని హ్రస్వద్వైవిధ్యము కలదా ? లేదేని గణితము సరిపడవలదా ? మఱియు ఎ ఒ లు అనునవి అ+ఇ, అ+ఉ చేరి అయినవేని దీర్ఘములు గావలదా ? ఇట్లు గణితము సరిపడుటకై అర్ధహ్రస్వకల్పన సేయవలయునా ? ఇఁకను ఈ కల్పనలచేత ఛందస్సులో ఎన్ని వింతలు కావింపవలసివచ్చునో ఊహించుకొనుఁడు. గ్రంథ విస్తరభయముచే విరామము.

మఱియు ౫, ౬, సూత్రములను ఇట్లు మార్చి చమత్కారము సేయవచ్చును. ౫ వ సూత్రముగా ముందు దీర్ఘములనే ఉపదేశించి, ౬ వ సూత్రముగా అనంతరము "ఒక్క దీర్ఘము భిన్నమయి రెండుమూఁడు హ్రస్వములగును" అని సూత్రింపవచ్చును.

మఱి ప్లుతమునకు గణిత మెట్లు ? వీరు దానిని విడిచిపెట్టినారు. పాణిన్యాదులు ఉచ్చారణ కాలపరిమాణముం బట్టి హ్రస్వదీర్ఘప్లుతసంజ్ఞల నేర్పరించినారు. "ఊకాలోఽజ్ఝ్రస్వదీర్ఘప్లుతః" అని అష్టాధ్యాయీసూత్రము. సర్వస్వమున కాలసంబంధముం జెప్పక వర్ణసంకలనప్రక్రియం బూనుకొన్నారు. ఇందువలన పెద్దలగ్రంథంబులందుంబోలె "దానికి ఇది దీర్ఘము, దీనికి అది హ్రస్వము" అను వ్యవహా

రము సరిపడకపోయినది. "సంబుద్ధియందు నామము తుది హ్రస్వమునకు దీర్ఘమగును." "నామంబుల తుదిదీర్ఘమునకు హ్రస్వము వచ్చును." ఇత్యాది వ్యవహారము కుదురదు. అందువలన రమాశబ్దమునకు హ్రస్వము వచ్చిన రమి, రము, రమృ కావచ్చును. మఱి ప్లుతము కథ యేమి?

"ఆ. ఏకమాత్ర హ్రస్వ మినుమడింపఁగ దీర్ఘ
మయ్యె మూఁడుమాత్ర లైనఁ బ్లుతము."

అని అప్పకవి యానతి సర్వస్వమతమునకు బెడిసియున్నది. 'మూఁడుమాత్రల దీర్ఘమఁట!' మూఁడుమాత్రల సంకలన మయిన కతంబున ఐ ఔ లు ప్లుతములు గావలయును.

౭. "ఒంటిబిందువు పూర్ణానుస్వారము; జంటబిందువులు విసర్గము." అని సూత్రము. ౧౦౮-ఇందలి సున్న పూర్ణానుస్వారమా? 108 - ఇందలి యింగ్లీషుసున్నయుం బూర్ణానుస్వారమే యగునా? ౧౦౦౮-ఇందలి రెండుసున్నలు విసర్గమా? ఇట సున్నప్రక్కన సున్నయా? సున్నక్రింద సున్నయా? అసమగ్రలక్షణము అసమర్థము. ఇట "జంట బిందువులు" అనుచో బహువచన మేల? 'ఒంటి బిందువులు పూర్ణానుస్వారములు; జంట బిందువులు విసర్గలు' అనియుం జెప్పనొప్పునా? జంట యనఁగా రెండు. అటుపైని బిందువులు అని బహువచనమును ఘటించిన బిందువులు ౪ గాని, అంత కన్న ఎక్కుడుగాని కావలయును. ఇందువలన 'రామః' అనుటకు "రామః:" అనియేని, "రామః : :" అని ఇత్యాది

రూపమున నేని వ్రాయవలయుంగదా. సమామ్నాతములైన యనుస్వారవిసర్గములకు వ్రాతలో ఒంటి బిందువును, ఒక దాని క్రింద నొకటిగా రెండు బిందువులను చిహ్నములుగా లోకులు కావించికొనిరి. వీరు ఆకారలను చూచి వానికే ఈ పేరులను కావించికొన్నారు. వ్రాయు విధమును లక్షణముగా చెప్పుట మందము. ఈవిపరీతమార్గమునకుం దోడుగా ౧౧ వ సూత్రమునం జేర్కొన్న జిహ్వామూలీయోపధ్మానీయములకు అర్ధవిసర్గసదృశ చిహ్నములను జూపక విసర్గ చిహ్నములనే చూపినారు. నిందు విసర్గకును, అర్ధవిసర్గకును భేదము లేదా? అచ్చు (ముద్రణము)లోను, వ్రాతలోను ఆలస్యముచేత అర్ధ ములను చూపకున్నను శాస్త్రములోను ఆలస్యమా? ప్రాచీనులు ఈ రెండు సంజ్ఞలను ఉపదేశించిరి గాని ఆంధ్రమున బాలవ్యాక రణకారుఁడు సయితము వీనిని చెప్పలేదు. వీరి కివి యేల వలసి వచ్చినవి?

౭ వ సూత్రముపై యభ్యాసము:—'హ్రస్వమన నేమి? అవి యెవ్వి?' అని ప్రశ్నద్వయము కలదు. అవి యను సర్వ నామము హ్రస్వమునకు పరామర్శకముగా నున్నది. 'అది యెద్ది?' అని యేకవచనముగా నుండవలదా? లేదా, 'హ్రస్వము లన నేవి?' అని ప్రథమ ప్రశ్నమును బహువచనముతోనే వ్రాసికోరాదా? మరల, ''వానిలో నచ్చు లెన్ని? హల్లు లెన్ని? ఈ రెంటికి భేదమేమి ?'' ఇవి రెండా? అచ్చులును, హల్లులును గలసి ఏఁబదిగదా? ఏఁబదింటిని ''ఈరెంటికి'' అని పరామర్శిం

చుట ఎట్లు సాధువు? 'అచ్చులకును, హల్లులకును భేదమేమి?' అని వాక్యము రచించుకొనవలయును.

లో. 'అచ్చులు కానివర్ణములు హల్లులు' అని అచ్చుల తత్త్వముం జెప్పుట. ఈవిధమున 'హల్లులు కాని వర్ణములు అచ్చులు' అని హల్లులను నిర్వచింపవచ్చును. ఇప్పటికి వీరు వర్ణములనన్నింటిని చెప్పలేదు. అచ్చులు కానివర్ణము లేవో ఎట్లు తెలియును? అది తెలియక హల్లు లివి యని యెఱుంగు టెట్లు? "అచ్చులు కానివర్ణములు హల్లులు. ఇవి అచ్చుల తోడ్పాటున (తోట్పాటున అని వారిపాఠము) నుచ్చరింపఁ బడునవి." అని నిందుసూత్రము. అట్లేని—క కారమును క కా కి కీ అని అ ఆ ఇ ఈ ల సంగతిచే నుచ్చరింపఁగలిగితిమి. అట్లే బిందువిసర్గలతోడ్పాటున ఉచ్చరింపఁగలమా? కం, కః అను వీనిని ఎట్లు ఉచ్చరించుట? అటయిన అనుస్వార విసర్జ నీయములు అచ్చులుకావా? 'అ'ని యచ్చుల తోడ్పాటున అని చెప్పితిమా?' అని యడుగుదురు గావలయు. అటయిన ఏవి తోడ్పడవో చెప్పవలదా? మఱి తోడ్పడునన్నమాట ఏమి కాను?

ఈసర్వస్వమందు (అర్ధబిందువు) ౦ఽ వ సూత్రములో నుపదేశింపఁబడినది. నిలువుగా తఱిగినను అర్ధమే, అడ్డుగా తఱిగినను అర్ధమే. ఎట్లు తఱుగవలయునో చెప్పకుండఁగా వర్ణస్వరూపము ఎట్లు నిశ్చయపడును? వ్రాతలోని కొలతింబట్టి అరసున్న యనుపేరు ఊహించుకోవలసియున్నదే గాని, అట్లు

యినను అది ఆచార్యోపదిష్టము గాదు. మఱి దాని యుచ్చారణ యెట్లు? రూపసాదృశ్యముచేత నిరూపించుకోవలయునా? అట్టి సాదృశ్యము ర ఱ లకును, ల ళ లకును గలదా? బిందు వనఁగా బొట్టు. సంస్కృతములో దేవనాగరలిపిలో అనుస్వారమును బొట్టుచేతఁ దెలుపుదురు గాని తెలుఁగులో అట్లుగాదు. తెలుఁగులో కడియమువంటి గీఱచేత (వలయముచేత) తెలుపుదురు. అరసున్నను అర్ధకటకమువలె వ్రాయుదురు. ఇందు వలన దాని యుచ్చారణ యెట్లు తెలియును?

ఈసూత్రములో "తోట్పాటుచే" అని ప్రయోగమున్నది తెనుఁగులో అట్టిశబ్దము లేదు. "తోడ్పాటు" అనిన తెలుఁగగును.

౯. 'కకారముతోఁగూడిన ౫ వర్ణములు కవర్గము' అని సూత్రము. "కందు", "క్రీడ"—ఈరెండును కవర్గములా? ఈరెంటియందును అయిదేసివర్ణము లున్నవి. "పెద్ద లుపదేశించిన వర్ణసమామ్నాయములో" అని భావమా? 'మెథడ్డు' తెలియక పెద్దల వర్ణసమామ్నాయమే శరణమైనది! ఈ గ్రంథములో వర్ణసమామ్నాయమును ఎటనుం జెప్పలేదు. ఇది ౯ వ సూత్రము. ౧౧ వ సూత్రమున వర్ణములను కంఠ్యాదిక్రమమున ౯, ౯, ౯, ౯, ౭, ౧, ౧, ౫, ౨, ౨, ౧ అక్షరముల రాసులుగా పఠించినారు. ఏకవాక్యముగా నియతక్రమమున లేవు. అట్లయినను ఆ ౧౧ వ సూత్రముం జదివి సవిమ్మటఁ గదా పైఁజెప్పిన వర్గ్యాక్షరములం

గనుంగొనుట? ఇట్టి కష్టములు పూర్వులు పెట్టలేదు. ఆ ౧౧ వ సూత్రమువలననేని వర్గాక్షరము లివి యని స్పష్టపడునా? అందు ఆరాసులలోనుండి అయిదేసి వర్ణములను ఏఱుకోవలయును. అవి యేవైను? ఆయా యేనింటిలో ఈ కాదులు ఎన్నవవి? మఱియు ఇవి అచ్చులా? హల్లులా? మిశ్రమా? ౯ వ సూత్రము "కకారముతోఁగూడిన ౫ వర్ణములు కవర్గము" అని వర్గనామోపదేశము. ఏరాశిలోనేని కాదులు ఒకమాఱుగాక హెచ్చుగానున్నచో అందు ఏవర్ణమును ఈవర్గనిర్ణయముకై ఆద్యక్షరముగాఁ గొనవలయును? ఉ ఊ ప ఫ బ భ మ ఃప-ఈరాశిలో 'ఃప' అని యొకటేవర్ణమా? ఇట పాఠము చెప్పనొజ్జకు "హింటు" కావలయును. హింటులేదేని రెండవ పకారము మొదలు గ్రహింపఁడా? ఆవలి యక్షరములు ఆ పంక్తిలోలేవేని పంక్తి మొదటికిరాఁడా? లేక వరుస ఏలయని యేవర్ణములనైనను గ్రహింపఁడా? లేక ఆవలి పంక్తిలోని వర్ణములం గైకోఁడా? మఱి యీ వర్గాక్షరములు అన్నియు హల్లులా, అచ్చులు గూడనా? ఆసందేహము పెట్టనేల? ౫ వర్ణము లనుటకు బదులు ౫ హల్లులు అనరాదా?

ఈసూత్రము కడపటిభాగము. "ళ-ఇది లకారమునకు రూపాంతరము." అని యున్నది. ఇది కడు నద్భుతము. ఇందువలన "కొళకుళలోపళ కళువపువ్వుళు వికసిల్లును; తళ్లుళు పిళ్లళకు పాళిత్తురు." ఇత్యాది పిశాచోచ్చాటనమంత్రములు తండోపతండ మగును.

'వర్గము లయిననుం గూడి స్పర్శము లనంబడును.' 'కూడి' అననేమి? ఏతత్సంయోగములకే ఈ నామమా? వీనికన్నిటికిని ఒకటే సంయోగమా? ప్రత్యేకము వీనికి స్పర్శ సంజ్ఞ లేదా?

౧౦. "౫ వర్గముల మొదటియక్షరములు పరుషములు." అని సూత్రము. ఇప్పటికి ఆవర్గాక్షరము లేవో చూపలేదు. వర్గములు అయిదే అని యిప్పటికి రూఢికాలేదు. మొదటి యనుటచే మెథడ్డు తెలియని పూర్వవ్యాకర్తల వ్యాకరణమును ప్రక్కనుబెట్టుకొని దీనిని చదువవలయును. ఈ సూత్రములయర్థమును ఎక్కడి కక్కడ అందులో చూచుకొనవలయును.

ఇట "ఒజ్జకొఱకు సూచనలు" అనునర్థముగా ఇంగ్లీషు వాక్య మొకటి కలదు. "Hints to the Teacher." దానిని తెనుఁగులోనే వ్రాయరాదా? ఈ వ్యాకరణమును బాలురకు నేర్పువాఁడు అపాటియేని తెలుఁగు తెలియనివాఁడుగా నుండవలయునా? వాఁడేమి పచ్చిదొరయా? బాడె ఓట్టకప్పల్ దొరయా? ఈ హెచ్చరికలు ఈయన చెప్పక యుపాధ్యాయునికి తెలియవా? తాను పండితుఁడైన నగుఁగాక, దీనిం బాఠము చెప్పు నుపాధ్యాయులయందు ఇంత ప్రజ్ఞాదారిద్ర్యమును భావించుట న్యాయ్యము గాదు. విద్యార్థుల పూర్వపుణ్యాపరిపాకవశంబున ఇందలి యసంఖ్యేయదోషములను దిద్ది పాఠము చెప్పువాఁడే దీనియుపాధ్యాయుఁడు గానేర్చును గాని, ఒకపాటిపండితుఁడు దీనిం జెప్పలేఁడు.

మఱి యీసూచనలలోని విషయములు ఉపాధ్యాయునికేగాని విద్యార్థికి సాక్షాత్తుగా పనికిరావా? పోనీ, ఎవనికైనను పనికివచ్చునా? చూతము —

"స్పర్శములను ముట్టివచ్చుటచే ఈపేరుగలిగెను." ఈవాక్యమున రచన ఎంత యథార్థమ్ముగ నున్నదో పరికింపుఁడు. "స్పర్శములకు" అని కుమష్ఠిగా మార్చిన ఇది వాక్య మగును.

"అంతస్థములు"—"నోటినడుమ నిలిచి పలుకఁబడునవి." అని యాచార్యవాక్యము. పలుకఁబడుటకు ముందే నిలిచినవా? నిలుచుట వేఱు, పలుకఁబడుట వేఱునా? నిలిచిన యనంతరము పలుకఁబడుట యన నర్థముగలదా? మఱి 'నడుమ' అనుటకు "అంత" శబ్దమును, నిలుచుటకు "స్థా" ధాతువును ఈపదమందు వీరు ముద్రించిన వర్ణక్రమము ప్రకారము కలవు. చీమతలకాయ యంతయేని పోనీకుండ వివరించినారు సరియే,—కాని "అంత" మనఁగా నడుమా? తుదిగాదా? నడుమునకు వాచకము అంతఃశబ్దము గాని అంతశబ్దముగాదు. సంధివశమున విసర్గ లోపపక్షము నవలంబించుటకన్న "అంతఃస్థ" అనియే వచించిన, స్పష్టముగాను, అదుష్టముగాను, విద్యార్థితారకముగాను ఉండును. "స్పర్శోష్మణోరన్తర్మధ్యేతిష్ఠన్తీతి తదర్థః" అని శబ్దేంబుశేఖరము. "అన్తర్మధ్యే" అని యున్నది గాని "అన్తేమధ్యే" అని లేదు. "లౌకికవ్యవహారేప్యపి శసాదీనాం వర్గ్యాణాంచ మధ్యస్థితత్వేనచాన్తః

స్థాశబ్దవాచ్యతా'' అని శబ్దార్థరత్నము. ''నోటినడుమ'' నడుట వీనికేకాదు, ఇంకనెన్నిటికో అన్వయించును; దీని తర్వాతిసూత్రమును చూడుఁడు: ''నడుమ నడుట'' యేని దీనికిమాత్రమే అన్వయించునా? అది వేనికి అన్వయించినను మానినను వీనికి మాత్ర మన్వయింపదు. అదే వింత. వీనికి అనఁగా య ర ల వ లకు, తాలుమూర్ధదంతోష్ఠములు ఉత్పత్తిస్థానములు. ఇందొకటియు మధ్యము గాదు. వీరు విసర్జనీయసంజ్ఞను వివరింపక, విసర్జనీయమే గదా యని గావలయు, విసర్జించినారు.

''ఊష్మములు''—బెట్టగాఁ బలుకఁబడునవఁట-బెట్ట యేమి? ''ఊష్మాణఇతి ఊష్మావాయుః, తత్ప్రధానా ఇత్యర్థః, ఏవం 'సోష్మాణ ఇత్యస్య వాయునాసహవర్తన్తే ఇత్యర్థ' ఇతి ప్రాతిశాఖ్యభాష్యే స్పష్టమ్.'' అని శబ్దేందుశేఖరము. [ఊష్మ మనఁగా వాయువు; అది ప్రధానముగాఁగలవి ఊష్మములు. ఇట్లు 'సోష్మములు అనుదానికి వాయువుతోఁ గూడియుండునవి అని యర్థము' అని ప్రాతిశాఖ్యభాష్యమందు స్పష్టము.'' అని శబ్దేందుశేఖరము.]

''పరుషములు—పట్టుదలగాఁ బలుకఁబడునవి.'' అని సర్వస్వము, పట్టుదలయేమి?

''సరళములు—విసరుగాఁ బలుకునవి.'' విస రేమి? విసరుగాఁ బలికిన బాలుని ఒజ్జగారు దండింపరా?

''సంజ్ఞాప్రకరణము—ఈగ్రంథమందు వచ్చు గుర్తులను దెలుపుసూత్రముల సమూహము.'' అని యున్నది.

చిన్నయసూరి లోనగు పూర్వవ్యాకర్తలు తమ యాయాయి గ్రంథములలో ననంతరము వ్యవహృతము లేని ఆసంజ్ఞలను మాత్రమే ప్రాయికముగా సంజ్ఞాపరిచ్ఛేదమందు చెప్పినారు. వీరు అప్రసక్తములను అనఁగా సర్వస్వములో నెటను పిమ్మట రానిసంజ్ఞలను వృథాగా వింతవింత వివరణములతో నుపన్యసించినారు. అందులకు ఈ యూష్మాంతస్థా సంజ్ఞలు నిదర్శనములు. ఇట్టివే ౧౧ వ సూత్రమునం జెప్పిన జిహ్వామూలీయంబును, చెప్పని యుపధ్మానీయంబును. బాలవ్యాకరణకర్త దానిని ఉపదేశింపలేదు.

౧౧-వ సూత్రము తుదిని "సంస్కృతమునుండి మార్పును జెంది మగధ మొదలగు దేశములయందు వాడఁబడు భాష ప్రాకృతము." అని వీరివాక్యము. ఈసూత్రము చదువునినుఁగు మగధదేశమును, ప్రాచీనాధునిక మగధభాషలను ఎఱుంగునా ? ఆమగధభాష (రెండో, ఒకటియో) సంస్కృతమునుండి వచ్చినట్లు తెలిసికొనుటకు సంస్కృతమును సమగ్రకల్పముగానేని యెఱుంగవలదా ? మఱియు సంస్కృతము తెలిసినమాత్రమున దానికిని, మాగధ్యాదులకునుం గల ప్రకృతి వికృతి సంబంధము ఆనినుఁగునకుం దెలియునా ? పైఁగా ఆనినుఁగునకు ఈవ్యాకర్త శబ్దములను నేర్చువిధము వింతగానున్నది. " 'మగధ' మొదలగు దేశములయందు." అని వీరిప్రయోగము. దేశమునకు 'మగధము' అని పేరా, 'మగధ' అని పేరా ? ఇట్లే 'అంగ'యందు, 'వంగ'యందు,

'బంగాళ'యందు అని వ్యవహరింపనగునా? ఇది హాణ మర్యాదయేని 'మ్యగడ' (Magada) అని కదా యుండ వలయును?

మఱియొక విశేషము—సంస్కృతము మాఱి మాగ ధ్యాది ప్రాకృతమయినదఁట. "ఇచ్ఛామాత్రం ప్రభోఃసృష్టిః!" ఈ క్రింది పంక్తులం దిలకింపుఁడు—

"ప్రాకృత సంస్కృత మాగధ పిశాచభాషాః శౌరసేనీచ,
షష్ఠోఽత్ర భూరిభేదో దేశవిశేషా దపభ్రంశః"

రుద్రటుఁడు.

"సకలజగజ్జన్తూనాం వ్యాకరణాదిభిర నాహితసంస్కారః సహజోవచనవ్యాపారః ప్రకృతిః; తత్రభవం సైవవా ప్రాకృతమ్. 'ఆరిసవ అణే సిద్ధమ్ దేవాణం అద్ధమాగహా వాణీ' ఇత్యాది వచనాత్ ప్రాక్ పూర్వం కృతం ప్రాకృతమ్ బాల మహిళాదిసుబోధం సకలభాషానిబన్ధనభూతం వచన ముచ్యతే, మేఘనిర్ముక్తజలమివ ఏకస్వరూపమ్: తదేవచ దేశవిశేషాత్ సంస్కారకరణాచ్చ సమాసాదితవిశేషం సత్ సంస్కృతా ద్యుత్తరవిభేదా నాప్నోతి. పాణిన్యాది వ్యాకరణోదిత శబ్దలక్షణేన సంస్కరణాత్ సంస్కృతముచ్యతే-తథాచ ప్రాకృత భాషైవ కించి ద్విశేషలక్షణా న్మాగధికాభణ్యతే......తథా ప్రాకృతమేవ కిఞ్చిద్విశేషా త్పైశాచికమ్......శౌరసేన్యపి ప్రాకృత భాషైవ......తథాహి ప్రాకృతమేవాపభ్రంశః స ఏవాన్యై రుపనాగరాభీరగ్రామ్యత్వ భేదేన త్రిధోక్తః తన్ని

రాసార్థ ముక్తం భూరిభేద ఇతి. కుతః? దేశవిశేషాత్ కారణాత్. తస్య లక్షణం లోకాదేవ సమ్యగవసేయమ్.'' ఇట్లు ప్రాకృతమే మార్పు చెంది సంస్కృత మాయెనని పెద్దలు చెప్పియున్నారు. వీరు తద్విరుద్ధార్థముగాఁ జెప్పుట సహజమే.

అక్షరముల యుత్పత్తిస్థానములను జెప్పుటలో వీరు ఇ ఈ చ ఛ జ ఝ ఞ య శ ల కు ఉత్పత్తిస్థానముగా తాలువును జెప్పి, అంతటితో తనియక-''తాలువు అనఁగా చెంప'' యని అర్థము వ్రాసినారు. తాలు వనఁగా బుగ్గయొక్క లోపలివైపు, చెంప యనఁగా వెలుపలివైపు. వెలుపలివైపున అక్షరము లుచ్చరించుట అసాధ్యము. అదియే సాధ్యమేని, ఆహా, ఏమి పుణ్యము! నోరు తెఱవకయే మాటలాడవచ్చును.

'ఓష్ఠము (పెదవులు)' అని యనుగ్రహించినారు ఈ యేకవచనమునకే ఆబహువచన మర్థమా? దంతోష్ఠ మన్నట్లే 'పెదవి' అని యేల అనఁగూడదు?

'ఏ ఐ...కంఠము, చెంప' అని. మరల చెంపలో వర్ణోత్పత్తి.

'ఁక జిహ్వామూలీయము'. ఇంతదాఁక ఉత్పత్తి స్థానములను చెప్పుచువచ్చి, ఇట ఉత్పన్న వర్ణసంజ్ఞనే స్థానమునకు బదులుగాఁ జెప్పినారు, భవార్థమును తెలుపరైరి. జిహ్వామూలీయమే జిహ్వామూలమని స్వార్థమును భావించినారా? ఈబెడదలో విద్యార్థులగతి యేమి? ''హింట్లు'' గొనువాఁడు చెప్పఁగలఁడా ?

౧౨. ప్రాకృతభాషకు వర్ణములు '౪౦.' ఏవి అవి? ఏల గోపనము? 'అచ్చులు ౧౦.' ఏవి అవి? 'సంస్కృతమునందలి ఋ ౠ ఌ ౡ ఐ ఔలు మాత్ర మిందుఁ గలుగవు.' అను వ్రాఁతచే కడమ పదియచ్చులను ఊహించుకొనవలసినదా? అట్లు చేయుటకైనను సంస్కృతాచ్చులన్నియు ఒక్కచోటం గలవా? అంతటను పూర్వవ్యాకర్తల సూత్రములను ఈ సూత్రములకు టీకగా నుంచుకోవలయును.

౧౩-వ సూత్రముపై నభ్యాసములో—'కంఠ్యము లెవ్వి?' 'ఓష్ఠ్యము లెవ్వి?' 'కంఠోష్ఠ్యము లెవ్వి?' అను నిట్టివి భవార్థకములు-ఉత్పత్తిస్థానాక్షేపకములయిన ప్రశ్నములు కలవు. వీరు ఈకంఠ్యాది భవార్థకసంజ్ఞలను ఎక్కడను చెప్పలేదు. వివరింపనులేదు. ఇవి బాలుర కెట్లు తెలియును? వింతలో వింత—''ఃక ఃప'—వీనిపేరేమి?'' అని ప్రశ్న కలదు. ఃక కు పేరయిన జిహ్వామూలీయ శబ్దమును తదుత్పత్తిస్థానమును పేరుగానైనను జెప్పినారు గాని, ఃపకు అట్టి పేరయినను వీరు చెప్పలేదు. ఏల గొడవ యనియే మానినారా? వేఱు కారణమున మానినారా? ఉపధ్మానీయమని బాలుఁడు ఉత్తరము చెప్పవలయును. వానికీ ఈయనుపదిష్ట మెట్లు తెలియును? వానియొజ్జకైనం దెలియునా? హింట్లులేక అతని కెట్లు తెలియును? 'నాసికయందుఁ బుట్టిన వెవ్వి?'—దీనిచిత్ర మూహింపుఁడు. 'పుట్టినవర్ణములు' అనరాదా? ముదిరిన బాలుఁడు 'వెండ్రుకలు' అని చెప్పిన, వానిని బెంచి యెక్కించుట న్యాయమా

౧౪. 'సంస్కృతప్రాకృతములవలనం బుట్టిన యీ తెనుంగుభాష వికృతిభాష యనంబడును' అని సూత్రము. ఇట 'పుట్టిన' అని భవార్థకధాతు ప్రయోగము చేయుట వలన తద్భవములు మాత్రమే ఉద్దిష్టములుగాఁ గనఁబడుచున్నవి. మఱి ప్రాకృతసమములు వికృతిలోఁ జేరినవి కావా? అయినచో 'పుట్టిన' అనుట యెట్లు? ౧౫, ౧౬, సూత్రములందు వక్ష్యమాణములగు నక్షరములు తద్భవమునకు మాత్రమా? అగునేని 'తెనుఁగునకు' అని వానిని చెప్పు టెట్లు? మఱియు, ఆభాషాభాగమును చెప్పుటకు 'తద్భవము' అను పేరు చాలదా? 'వికృతి' యని యీసంజ్ఞను కల్పింపనేల? [చూడుము ౨౩-అభ్యాసము.] మఱియు ఆపక్షమందు దేశ్యమునకు వేఱుగా అక్షరపరిగణనము చేయలేదేమి? 'తద్భవ' మాత్రమును 'వికృతిభాష' (౧౪ సూ.)—'ఈ తెనుంగు భాష' (౧౫ సూ.)—'ఈభాష' (౧౬ సూ.) అని ఇన్నివిధములు నిర్దేశించుటకన్న 'తద్భవము' అన్న నెంత సులువుగా నుండును! మఱి "కలిసియున్నవి" (౧౫ సూ.) అనుటచే ఎటనుండియో వచ్చినట్లు తోఁచుచున్నది. ఎటనుండి వచ్చినవి? వృథాకాంక్షలు చెఱుపుసేయవా? 'ఉన్నవి' అన్న నిర్బాధము. అట్లే అనంతర సూత్రమున 'చేరియున్నవి' అను పదము 'ఎటనుండివచ్చి చేరినవి?' అను సాకాంక్షం గలిగించుచున్నది.

మఱియు ౭-వ సూత్రములో సంస్కృత వర్ణోపదేశములో బిందువునకు అనుస్వారసంజ్ఞ అనుగ్రహింపఁబడినది.

ఇందును ౬-వ సూత్రమునందుంబోలె 'రెండు అనుస్వారములు కూడి ఒకవిసర్గ. ఒక యనుస్వారము అర్ధవిసర్గ. అర్ధబిందు వనఁగా పాతికవిసర్గ. నాల్గు అరసున్నలు ఒకవిసర్గ.' అని లెక్కయేమయినం గలదా? మఱియొక ప్రశ్న—ఈ ౧౫-వ సూత్రములో వికృతిభాషకు ( [అరసున్న], ఱ[శకటరేఫము] ఎ, ఒ, అను వర్ణములు ఎక్కువగాఁ జెప్పఁబడినవి. అందలి యరసున్నకును ఉత్పత్తిస్థానము నాసికయే యగునా? అది యెట్లు? సంస్కృతవర్ణములకే గదా ఉత్పత్తిస్థానములు చెప్పఁబడినవి! (చూ. ౧౧ సూ.) ఆస్థానములు సంస్కృతవర్ణములు కాని వీని కెట్లు సరిపడును? మఱి వీనికి ప్రత్యేకముగా ఉత్పత్తిస్థానములను చెప్పలేదేమి ? ( [అరసున్న] నిండు సున్న కాదే. నిండుసున్నకు చెప్పిన యుత్పత్తిస్థానము అరసున్న కెట్లు ఒప్పును? రూపసామ్యముం బట్టియు, నామసామ్యముం బట్టియు సగము సున్నకు సగము ముక్కు ఉత్పత్తిస్థానమని లెక్కవై చికొంద మా? అట్లే, ఎ ఒ అనునవి-అర య (అ) కారము+అర యి (ఇ) కారము [అరయనఁగా అర్ధమాత్ర], అట్లే అర య(అ( కారము+అర యు (ఉ) కారమును కూడి నిష్పన్నము లయిన వని లెక్కయా? శకటరేఫమునకును మూర్ధమే ఉత్పత్తిస్థాన మా? ఇది సంస్కృతవర్ణమైన రేఫము గాదుకదా, దానికి చెప్పినది దీని కెట్లు చెల్లును ?

౧౬ చే జ లు మున్ను తాలవ్యములలో నుపదిష్ట ములుగావే. మఱి అవి తాలవ్యము లెట్లు? వీని కన్నిటికిని

గతియేమి ? మఱి వీనికి అజ్ఝల్సంజ్ఞ లెట్లు ? ప్రత్యాహార ములో ఇవి కలవా ? ఈ విషయములో తూష్ణీంభావముద్రయే మెథడ్డా ? వర్గములలో చే జే లు చేరినవా ? కాను అంతఃస్థా సంజ్ఞ గలదా? చే జే లు చాది పంచకములోపల లేవే ? ఇవి చేరిన ఏడగునే ? అయి దేసి అని గదా అట నిర్వాహము ! ఇంత దూర మాలోచించి చిన్నయసూరి 'దంత్యతాలవ్యంబు లయిన చజలు సవర్ణంబులు' అని సూత్రించినాఁడు. అది మెథడ్డు తెలియమిగా భావించి సర్వస్వకారుఁడు "గప్చుప్" అతఁడు (చిన్నయసూరి) కాను ప్రత్యేకముః తెనుఁగు వర్ణ సమామ్నాయములో పఠింపలేదు. 'యరలవ' అని మాత్రమే పఠించినాఁడు. కావున అతని వ్యాకరణములో పై ప్రశ్నలకు అవకాశము లేక పోయినది.

౧౭. 'తత్సమశాఖయందునుం జేరి యాంధ్రంబునం గలియుచున్నవి'- ఇందులకు ఉదాహరణము వలదా? అద్భుత మయిన శాఖాశబ్దము దొరకిన సంతోషమే చాలునా? ౧౭-వ సూత్రము తర్వాతి యభ్యాసము:—ఇందలి ప్రశ్నలలో— 'సంస్కృతమున నుండియుఁ దెనుంగునకు రాని వర్ణము లెన్ని? ఇవి తెనుంగున నెట్లు చేరుచున్నవి?'—ఇందు, 'రానివర్ణ ములు ఎట్లు చేరును?' అని ప్రశ్న. దీనికి అర్థమేమి ? చేరు చునే యున్నవా అన నేల ? వర్ణములు ఒక భాషనుండి మఱి యొక భాషకు పయనములు సేయుచుండునా ? భాష నుండి భాషకు పోవుట యనఁగా నర్థమేమి ?

౧౮. 'విడచి':—కీని వంటిదే సమాస ప్రకరణములో ౧౧-వ సూత్రములోని 'నిలచు'. ఆపాటి యీపాటి పండితులయిన, 'విడిచి' 'నిలుచు' అందురు. రస్తామరమ్మ తు భాగవతకవులు 'విడచి', 'నిలచు' అని వ్రాయుదురు. వీరు దానిని మెచ్చి సర్వస్వము 47-పుటలో, 15, 16 వ పంక్తులలో 'విడచిన'చో అని మరలను ప్రయోగించియున్నారు.

౧౯ వ సూత్రములో తత్సమము లెట్లు నిష్పన్నములగునో చెప్పఁబడి యున్నది. 'సంస్కృతపదములు తమ భాషయందుఁ దమకుంగల ప్రత్యయములను విడ(డి)చి తెనుంగునఁ దమకుఁ దగిన ప్రత్యయములను బొంది తెనుంగున వాడంబడుచో నవి తత్సమము లనంబడును.'—ఇదియొక గంధర్వకోలాహలము (గందరగోళము) గా నున్నది. 'సంస్కృతప్రాతిపదికమే ఇందు ప్రాతిపదికమై ఆంధ్రవిభక్తులం జెంది తత్సమమగును.' అన్న ఆంధ్రవాక్యము సొంపారును. ఇందులకు 'లక్ష్మీః-లక్ష్మి' అని యుదాహరణము. 'ప్రత్యయములను విడిచి' - అన్నారుగదా. ప్రత్యయ మన నేమో ఇప్పటికి ఈ హాత్తమునం జెప్ప లేదు. ఏ ప్రత్యయములను? సుప్పులను, తిఙులను గావలయును. ఏలయన- 'సుప్తిఙన్తంపదమ్.' కృత్తద్ధితములను సైతమా? ఈతత్త్వము తెలియక ప్రత్యయములను విడుచుటయెట్లు? ఇట్లు అబోధముగా గ్రంథము రచించి, "ఇతరులను మెథడ్డు తెలియదు. తమకే తెలియును." అని యేమి ఆడంబరము చేసినారోర! విసర్గ సుప్పునకు వచ్చినది.

విసర్గలోపమే సంస్కృతవిభక్తి లోపించుట. అందువలన 'లక్ష్మి' అని యేర్పడినది. మఱి ఏ ప్రత్యయము వచ్చి 'లక్ష్మి' అను రూపము వచ్చినది? ఈకారమునకు బదులుగా ఇకారము వచ్చినది. ఈకారము తనభాషయందు తనకుఁగలిగి తాను విడిచిన ప్రత్యయమా? ఇకారము తెనుఁగున తనకుఁ దగిన ప్రత్యయముగా వచ్చినదా? మఱి, 'హరి' అన్నచోట ఏ ప్రత్యయము వచ్చినది? అని ప్రశ్న. అందులకు దానినే తన "తనకు తగిన–" అని తెలిపితి మందురా? ఆతగ వెట్లు ఏర్పడును? 'తనకు విహితమయిన' అనవలయును. హరి శబ్దమునకు ఏమి విహితము? అది యెప్పుడు తెలియును? ఇంతకన్న సులువైన ప్రక్రియ కుదురదా? మఱియు, ఇందు సంస్కృత పదములనుమాత్రమే ‌ ‌ ‌ ‌ ‌ ‌ బుగా వీరు చెప్పినారు. ప్రాకృతసమములనుఁగూడ పూర్వులు చెప్పినారు. ఏమి చెప్పినను భేదము లేదా? అగ్గి, ఓలి, జేడ, జేముఁడు, సిరి – ఇవి ప్రాకృతసమములు. అగ్గీ, ఓలీ, జేడా, జేమో, సిరీ – అని ప్రాకృతమున ప్రథమైక వచనాంతములు. ఈ భాషాభాగము ఈ సర్వస్వములో నష్టమైనది. "సంస్కృతపదములు తమ భాషలో తమకుఁ గల ప్రత్యయములను విడిచి" అను కొండవీటి సీమ చేఁత్రాటిని చుట్ట చుట్టిన "సంస్కృత ప్రాతిపదికములు" అగును. "తమకుఁ గల ప్రత్యయములను"—ఏ విభక్తి? తెనుఁగు పదమున ఏ విభక్తియో, ఆ విభక్తియే అగునా? రామమ్, రామేణ, రామాయ,

రామాత్ - అనునవి రామునిన్, రామునిచేన్, రాముని కొఱకున్, రామునివలనన్-అనియు; రామాన్, రామైః, రామేభ్యః, రామేభ్యః-అనునవి రాములన్ - రాములచేన్, రాములకొఱకున్, రాములవలనన్-అనియు వాడంబడునా? "తమ తమ ప్రత్యయములను"—ఉణాదులుకూడనా?

౧౯. 'తద్భవము' లగుటకు సంస్కృత ప్రాకృతపద ములు తమ ప్రత్యయములను విడువవలదా ? వలయునేని తత్సమములకుం జెప్పినట్లు వీనికి చెప్పలేదేమి ?

౨౦ తొలుత మఱి యేభాషతోను సంబంధములేని యాంధ్రదేశపదములనుగా-పాలు, పెరుగు, తల్లి, తండ్రి అను వాని నుదాహరించినారు. 'పాలు'—దీనికి అఱవము 'పాల్'; కన్నడము 'హాలు'. 'తల్లి'కి అఱవము 'తాయి'; 'తండ్రి'కి అఱవము 'తందై'. సంబంధము లేదా? క్షీరవాచకమయిన 'పాలు' శబ్దము వైకృతమగు శబ్దరత్నాకరము. ఇచటి యుదా హరణముగు భాగవాచకముగాఁ గొనరాదా? యనిన, అట్లు చెప్పరాదా? రెండు భాషల పదములకు అర్థస్వరూపములందుం గల పోలిక ఆభాషలసంబంధము గాదేని, ఆపదములు స్వతం త్రోత్పన్నములే అని వాదమేని, తద్భవములే యుండవు. భాష నుండి భాషాంతరమునకు పదములు తొంటివిభక్తులతోనే ప్రవేశింపవుగదా. మఱి యర్థస్వరూపములచేఁ గాక యెందు వగ నెట్లు భాషాసంబంధ మేర్పడు? "పాలు" అను నాంధ్ర శబ్దమే ఆకర్ణాటాది భాషలలో ప్రవేశించినది. అంతకుముందు

ఆభాషలలో క్షీరవాచకశబ్దములు లేవు, ఆభాషలను బలుకు జనులు పాలనే యెఱుంగక యుండిరి.'' అని వాదింతురా? ఆ విషయమే సిద్ధాంతీకరింపరాదా?

౨౧ 'అన్యదేశ్యము లనఁగా, ఈ దేశ్యభాషయందు కలిసి వాడంబడు నితర దేశభాషా పదములు' అని సూత్రార్థము. ఈ యితర దేశభాషా పదములు దేశ్యమందే కలియుట యేమి? తత్సమ తద్భవములలో కలియవా?

''క. అసురులధాటికు నోర్వక
పసచెడి దివిషదులు తావు వదలిరి; మహిళల్
ఖుసి నుజ్జగించి ఘోషా
వసమున నిలయంబులందు వర్తించి రయా.''

అని యుదాహరణార్థము కల్పితము మదీయము. ఇట్లు ఏకవాక్యమందు అన్యదేశ్యము తత్సమాది మిశ్రం బయ్యె నేని ఆయన్యదేశ్యము అన్యదేశ్యము కాకపోవునా? ఇచట 'ఈ దేశ్య భాషయందు' అని సంకోచించుట కర మసమంజసము.

౨౨. గ్రామ్యమును 'ఆంధ్ర దేశమున వాడంబడు వ్యాకరణవిరుద్ధపదములు'గా మీరు నిర్వచించినారు. తంజావూరు, మధుర లోనగుతావుల వాడంబడు వ్యాకరణవిరుద్ధాంధ్రములు గ్రామ్యములు గావా? 'ఇందు గ్రామ్యములు' అనుటలో 'ఇందు' అన నక్కరలేదు. వ్యాకరణ విరుద్ధమని తెలియుట సర్వస్వాధ్యయనమును శాంతి చేసిన తర్వాతఁ గదా? ఇట

నుదాహరణములుగా ప్రదర్శితము లయిన పదములు 'వస్తాఁడు, తెస్తాఁడు, తింటాఁడు' అనునవి గ్రామ్యములని బాలునికి బోధపఱుచు నుద్యమ మేమియుఁ గనఁబడలేదు. గ్రామ్యములో అర్ధానుస్వారము కలుగునా? అది లేనిచో గ్రామ్యత్వహాని కలుగునా?

౨౩. 'మహాకవులచే తమ గ్రంథములయందు వాడఁబడిన.....పదములు' అని వీరిసూత్రము. మహాకవులు తమ గ్రంథములలోఁగాక ఒరుల గ్రంథములలో వాడుదురా? ఇది వ్యాకరణమా? వీథి పురాణమా?

౨౪. 'దేశ్యపదములలో నున్న పరుష సరళములకు ముందే యుండును.' అని సూత్ర పూర్వభాగము 'ఇతర హల్లులకు ముందుండదు' అని సూత్రోత్తర భాగము. ఉత్తర భాగము 'పరుష సరళములకు ముందే' అను దానికి టీక. 'పరుషసరళములకే ముందు' అనుట సరి. కాని ఈనియమము దేశ్యపదములకు మాత్రమా? తద్భవములకు చెల్లదా? చెల్లుననియే చదివిన పండితుల మతము. అట్లే 'సంస్కృత సమేతరములైన తెలుఁగు శబ్దములయందు' అని బాలవ్యాకరణమున చిన్నయసూరి. మఱి యట్టి దేశ్యపదములకు ఉదాహరణముగా వీరు 'అడఁకువ', 'అందము' ఇత్యాదుల ననుగ్రహించినారు. కాని, ఇఁదు 'అందము' (నామవాచకమేని) దేశ్యము కాదని చదివిన పండితులకెల్ల శిఖామణు లయిన శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులవారు వైకృతదీపికలో తెలిపియున్నారు. ఎట్లన,

"అందము-చక్కదనము-అన్తః."
'త్వయ్యాసన్నే పరిణతి ఫలశ్యామజమ్బూవనాన్తాః'
మేఘసందేశము.

'శ్యామానియాని జమ్బూవనాని తైరన్తాః రమ్యాః'

అని మల్లినాథుని టీక. 'అనుదము' అను క్రియాపదమునకు రూపాంతరముగా వాదింపరా? వాదింతురు గాక. ఏమి వాదించినను ఈనియమము ప్రాకృతసమ తద్భవములకునుం దప్పదు. మఱియు నిది సిద్ధానుస్వారమునకే ఉద్దిష్టమని తలంచితిమి. అనుస్వారమెల్ల నుద్దిష్టమ యేని 'కెంధూళులు' ఇత్యాదులయందు గతి కల్పన సేయవచ్చును, పాఠము సరిగాదనవచ్చును. ఉపాయము లుండవా? తత్భవాదులకు ఉదాహరణములను వైకృతదీపికలో చూచుకొనవచ్చును. ఐననొకకొన్ని.—అంకుసము, అంకణము, అంకె, జంకు, అంగుటము, ఇంగలము, అత్తమిల్లు, అతకరించు. కావున 'వికృతిలో' (లేక అచ్చులో) బిందువు స్థిరమునకు ముందుండదు. అని సూత్రించుట శ్రేయముగాఁ గనఁబడుచున్నది.

౨౬. 'య వృ వ్రూ వో ణలు తెనుఁగున పదాది నుండవు.' అని సూత్రము. వోకారము పదాది నుండునా? వోడు, వోకటి అనవచ్చునా? అనవచ్చునని దీనివలన భ్రమ కలుగును. కావున ఇట వోకారమునుగూడ చెప్పవలయును 'కావున వ్యుత్పత్తి; వ్యూహము, వ్యోమము, మొదలగునవి తత్సమములు'-ఒక విశేషము:—ఈసూత్రమువలన తత్స

నము తెలుఁగు కాదని యేర్పడుచున్నది. విద్యాధికారులారా, ఈవింతల నరయుఁడు. మఱి వీరు తత్సమములని సాధించిన యామూఁడు పదములలోను ఒకటియేని సూత్రోక్తాక్షరారబ్ధము కాదు. వ్రాతలో ముందు వచ్చిన మాత్రాన ఆదిగత వు వూ వోలకు ఇవి యుదాహరణములా ? వ్యాకర్తలకు వర్ణ క్రమమయినను తెలియవలదా? ఇంత పండితుఁడు వ్యాకరణము వ్రాయుట, తదభిమానులు దానిని బాలురకు చదువ నియమించుట ! శారదా దేవీ, ఏమి చేయుచున్నావు ? ఏమయితివి ?

వ్య వ్యా వ్యో అనునవి సంయోగములు. సూత్రమున ఈ సంయోగములు ఉక్తములు గావు. వ్య వ్యా వ్యోలకును, వు వూ వో లకును అభేదమా ? వుత్పత్తి, వూహము, వోమము అని వీనికి రూపాంతరములా ? చిన్నయసూరి వోఢృ వోఢవ్య శబ్దములను రెంటినే చెప్పెను. వీరు ఆయనను మించువారై హెచ్చుగాఁ జెప్పుటలో తమ వర్ణాజ్ఞానమునే వెల్లడించి కొన్నారు. వర్ణక్రమ మయినను తెలియదే!

మఱి శకారము పదాది నుండునా ? దానిం జెప్పమి యేమి ? ఇచట పూర్వపండితులు ఎంత చక్కఁగాఁ జెప్పిరో పరికింపుఁడు.—

'...పదాదిని ణకార యకార శకారంబులును ఉ ఊ ఒ ఓ లం గూడిన వకారంబును ఉండవు' అని వెంకయ్య. 'యకారంబును, వు వూ లును తెనుఁగుమాటలకు మొదట లేవు.' అని చిన్నయ సూరి.

ణకారము చెప్పుట సర్వస్వములో ఒకరికన్న హెచ్చే అయినను, వొకారము చెప్పమి ఇరువురకన్నను కుందే.

౨౭. 'ప్ర-పర-ప్రతి-పరి-అతి - అధి-అభి-అవ - అను-ఉప-సం-సు-అప-ని-వి-నిస్ - నిర్-దుస్-దుర్-ఉత్ - అపి-ఆ ఇవి యుపసర్గము లనంబడును. వీనిని తెనుంగున (ఇవి) ముందు గల పదములు తత్సమము లనంబడును.' అని సూత్రము. ఇందు ప్రపరాదులు (ఉపసర్గలు) చెప్పఁబడినవి. ఈసూత్రము వలన ప్రక్క, పరఁగు, ప్రతిన, పరికిణీ, అతివ, అభిని, అవద గాకి, అవఘళము, అనుము, ఉపమరి, సంగు, సులువు, అప రంజి, నిలువు, విసుగు, నిసుఁగు, నిరుడు, దుసికిలు, దురద, ఉత్త, ఆన ఇత్యాది పదములు తత్సమములు గావలయును.

ఈరెండు సూత్రములును తత్సమములం గనిపట్టుటకై మూఁడవ తరగతి బాలురకొఱకు ఉద్దేశింపఁబడినవి. కాని తత్సమము లనఁగా సంస్కృతసమములా? ప్రాకృతసమములా? ఉభయమా? వీరి నిర్వచన ప్రకారము (చూ. ౨౭ సూ.) తత్సమములనఁగా సంస్కృత సమములేగాని ప్రాకృతసమ ములు గావు. కావున నిర్వచనము లెట్లున్నను సంస్కృతసమ ములుగా నుండుననుట శ్రేయము. మఱియు 'తత్సమము లనం బడును.' అను వాక్యము శైలిచే తత్సమనిర్వచనముగా విల సిల్లుచున్నది. ఇది ౨౭వ సూత్రము. తత్సమ నిర్వచన సూత్రము పదునెనిమిదవది మఱియొకటి కలదు. ఒక సంజ్ఞకు రెండు నిర్వచనము లేల?

౨౯. '.........చజలు తాలువునందుఁ బుట్టినవైనను తెనుంగున అ ఆ ఉ ఊ ఓ ఔ లం గూడినప్పుడు దంత్యము లగుచున్నవి' అని సూత్రము. ఇందు ఒకారమును మానిన కిటు కేమో? మఱి, 'తెనుంగున'-౨౭-వ సూత్రమున 'తెనుంగునఁ దత్సమపదము లనఁబడును.' అను ప్రయోగముచే తత్సమముగూడ తెనుఁగులో నంతర్భూతమే యనియు తలంపవలసి యున్నది. దానిం బట్టి, ఈసూత్రముప్రకారము తత్సమ పదములందు సయితము చజలు దంత్యములు గావలయును. చక్రము, చాపము, చూర్ణము. చోదన, జట, జాతి, జుజోవు, జ్యోతి ఇత్యాదులందు చజలు దంత్యములే గావలయును. 'తెనుంగున' అని ఈ ౨౯వ సూత్రమున నిర్దేశించినందున ఈ యనిష్టము కలిగినది. ఆమాటం జెప్పకున్న ఈరెండు తెలుఁగుల చజలు సంస్కృతసమేతరమగు నాంధ్రమునకే ౧౬ వ సూత్రములో చెప్పఁబడినవి గావున అందులోనేయనియు, సంస్కృత సమమునం గావనియు స్పష్టముగానే తెలియును. ఇట్లు ఈరెండు సూత్రములును సంస్కృత సమవిషయమున ఒండొంటిని విరోధించుచున్నవి.

మఱియొక విరోధము—౨౯ వ సూత్రము క్రింద ఒజ్జకు వ్యాకర్తగా రొసంగిన హెచ్చరికలలో "తెనుంగునఁ బరుష సరళములకు ముందే బిందు వుండు ననుటచే స్థిరములకు ముందు బిందువుగల పదములు తత్సమములు." అనునది యొకటి. ఇది ౨౮ వ సూత్రమునకు అనువాదము. ఆసూత్ర

మిట్లున్నది: ""దేశ్య పదములలో బిందువు (సున్న) పరుషసరళ ములకు ముందే యుండును. ఇతర హల్లులకు ముందుండదు'' అని. పై అనువాదములో 'తెనుంగున' అనుపదము వలన 'తెనుంగు' 'తత్సమము' కాదని యేర్పడుచున్నది. ఇట అనూక్తములో 'దేశ్యపదములలో' అన్నందువలన 'దేశ్యమే' తెనుఁగు—'తెనుఁగే' 'దేశ్యము' అని ప్రాప్తించుచున్నది. ఇందువలన దేశ్యేతర మెల్ల తత్సమమని ఏర్పడుచున్నది. వీరి మతమున ప్రాకృతసమము తత్సమము కాదు. ౨౮=వ సూత్రము వలనను, దాని యనువాదము చేతను ప్రాకృత సమము కూడ తత్సమమే అని యేర్పడుచున్నది.

౨౮-వ సూత్రమున తద్భవమందును, స్థిరములకు ముందు బిందు వుండు నని తెలుపఁబడినది. పై యనువాదమున అం దుండదని చెప్పఁబడినది. ఇదంతయు పూర్వులను ధిక్కరించి చేయుచున్న స్వతంత్ర సృష్టి.

౨౯-వ సూత్రము తర్వాతి యభ్యాసము:—ఇందు 'సంస్కృతోపసర్గలు' అనుటచే, ప్రాకృతోపసర్గలు,' 'ఆంధ్రోపసర్గలు' నని వేర్వేఱు ఉపసర్గలు కలవా? అని యడుగవలసి యున్నది. 'సంస్కృత' అననేల?

౩౫. "'రామ, కృష్ణ'...ఇవి ప్రాతిపదికములు (నామములు)'' అని యుపదేశము. 'ఇవి' అనుటచే ఈ రెండే అని అర్థమగును. 'ఇట్టివి' అనినం గొంత మేలు. ఇట్లే ఇంకను రెండు ఉపదేశముల యందు ఎఱుంగునది. ఆరెండిటనుం గూడ 'ఇత్యాదులు' అన్న మేలే.

'నకారము ద్రుతము. వచ్చెన్, వానిన్, వనమందున్, చూచెను.' ఉదాహృతములలో మూఁటికి తుదను ద్రుతమున్నది, నాలవదానికి తుదను నుకారమున్నది నకార నుకారములకు అభేదమా ? ఈ ద్రుతాంతరూపములు ఈవ్యాకరణమున సిద్ధింపవు. (i) 'వానిన్', (ii) 'వనమందున్' అను పదములలో (i) లో రెండు నకారములు, (ii) లో రెండు నకారములుం గలవు ఇందు ఏ నకారము ద్రుతము? నాల్గును ద్రుతములా ?

౩౨. 'బిందువు పూర్ణము, ఖండము నని యిరుదెఱంగులు.' అని సూత్రార్థము. ౨౮-వ సూత్రమున బిందువు ప్రస్తుతము. అట ఇరుదెఱంగులును ఉదాహృతములు. అట్లు అట గతార్థమయిన దానికి ఈ సూత్ర మేల ?

౩౩. 'వచ్చెన్+కోమలి' వచ్చెన్ అను రూపము ఈ వ్యాకరణమున సిద్ధింపదు. (చూ. క్రియా. ౧౦ సూ.) 'వండెను', 'వచ్చెను', అని మాత్రమే ఈ ఫక్కికలో నిష్పన్న మగును. కావున దీనితో సంబంధించిన సూత్రము పొల్లే యగును.

'ద్రుతమునకు సంధిలో ఆదేశముగా వచ్చిన బిందువులు సాధ్యబిందువులు అనఁబడును'. అని (౩౩) సూత్రార్థము. ఈసూత్రమువలన హ్రస్వముమీఁది యరసున్నకు మాఱుగ ౨౯-వ సూత్రమువలన వచ్చిన నిండుసున్న సాధ్యబిందువు కాదని ఫలించుచున్నది. ఇదియునుంగాక, రాముఁడు, వాఁడు,

వేఁడు, చేయఁడు ఇత్యాదులయందలి యరసున్నయు, వేయేఁల, ద్రుతాదేశములయిన బిందువులుతప్ప కడమబిందువులన్నియు సాధ్యములు కావని సమకూడుచున్నది. అందువలన నిది సిద్ధము లనవలసియున్నది. కాముండు, పడంతి ఇత్యాదులయందలి నిండు సున్నయు సిద్ధమే యనవలసియున్నది. ఇది శాస్త్రహృదయము కాదు. బాలవ్యాకరణమునో (సంజ్ఞ ౧౮, ౧౯ సూ) 'దీర్ఘముమీఁద సాధ్యపూర్ణము లేదు.' అని సూత్రము. 'వీఁడు'—'రేఁగులు'—'గోఁగులు' అని యుదాహరించినందువలన పైయర్థము లభించుచున్నది.

3౮. మఱి యీసూత్రముచే శబ్దముతోనే పుట్టిన బిందువుసిద్ధమని తెలియుచున్నది. అందువలన ప్రత్యయము యొక్క ఉత్త్వాదికముచేత వచ్చిన బిందువులు సిద్ధములు గావని యేర్పడుచున్నది. ఇట్లు ఈరెండు (33–3౮) సూత్రములకును పరస్పరవిరుద్ధార్థము లూహ్యము లగుచున్నవి. ఇది బాలురను సిలుగులం బెట్టుటగా నున్నది.

ఇంత కష్టపెట్టియు ఇంతకష్టపడియు ఈసిద్ధసాధ్య సంజ్ఞలను, (3౯) రాఁగల లఘ్వలఘుసంజ్ఞలను జెప్పినందులకు ఈ వ్యాకరణమున ప్రయోజనమేమియు లేదు. సులువుగా దొరకినందున పాండిత్యప్రకర్షకై ఇవి వైచికొనఁబడినవి కాని బోధచేసికొనక వైచికొన్నందున పీడాకరము లయినవి.

3౯. సంధి వశమున వచ్చిన యకారము లఘువు; శబ్దమున స్వతస్సిద్ధయకారము అలఘువు—అని యీఁగందర గోళమున కర్థము.

38. 'అరుదు, బురద—ఈపదముల రేఫము లఘువు' అని సూత్రము దీనికి న్యాయ్యమయిన యర్థముచే హరి, గిరి లోనగు నితరపదములయందలి రేఫము లఘువగునో కాదో తెలియదు. కాదనియే అనవలసినదిగా తోఁచును. అట్లే, సూత్రోత్తర భాగముచేత ఎఱుక మఱచు లందలిదితప్ప గుఱ్ఱము, కఱ్ఱ, చెఱకు లోనగు పదములందలి శకటరేఫము లఘువో అలఘువో తెలియదు. అయినను అలఘువు కాదు, లఘువే అనవలసినదిగానే తోఁచును, పూర్వ వ్యాకర్తలు ఈచెట్ట నవలికి నెట్టుటకై 'ఇత్యాదులయందు' అని ప్రయోగించిరి. అట్లు చేయుట పాండిత్య ప్రకటనకొఱకు అని వీరు వారిని వెక్కిరించిరి.

39-వ సూత్రముచే కలఁత వలసలలోని లకారము లఘువని తెలియుచున్నదేగాని 'చిలుక పలుకు'ల యందలి లకారము లఘువో అలఘువో తెలియరాదు.

40. 'ఏఱు-ఏళ్లు; త్రాఁడు త్రాళ్లు—బహువచనము పరమగుచో ఱలడ అనువర్ణములకు మాఱుగ వచ్చిన ళకారము లఘువు'. ఈసూత్రములో (i) ఱ, (ii) ల, (iii) డ-అని మూఁడు వర్ణములు చెప్పినారు. ఉదాహరణములు రెండు వర్ణములకే యిచ్చినారు. ఏల ఈభేదము?

మఱియు విశేషము కలదు- ళకారము ఱ-ల-డ లందు హల్లునకు మాత్రమే ఆదేశమా? ఱు-లు-డు అను నంతిమ వర్ణములందలి ఉత్తునకుంగూడ నాదేశమా? అనఁగా ఱు-

లు-డు అను మొత్తములకే ఆదేశమా? తొలి పక్షము న్యాయ్యము. అందు,

వేఁడు+లు = వేళ్+ఉ+లు = వేళులు,

త్రాడు+లు = త్రాళ్+ఉ+లు = త్రాళులు.

అగును. వేళులు త్రాళులు అనియే పూర్వవ్యాకర్తలు ఉదాహరించినారు. రెండవపక్షమునందు,

వేఁడు+లు = వేళ్+లు = వేళ్లు,

త్రాడు+లు = త్రాళ్+లు త్రాళ్లు.

అని రూపములు సిద్ధించును. కాని మొత్తములకే ఆదేశము అను నీరెండవయర్థము ఆసూత్రవాక్యమునకు ఘటిల్లదు. ఆవాక్యమున హల్లులకుమాత్రమే ఆదేశమనెడి యర్థమే వచ్చును. ఇట్లుండ ఘటించెడి యర్థమునకు పొసంగునట్టి రూపమును 'వేళులు-త్రాళులు' అనువానినిమాని, ఘటింపని యర్థమునకు పొసంగునట్టివానిని 'వేళ్లు-త్రాళ్లు' అను రూపములను చూపుట పీడాకరముగానున్నది; వింతయు నగును.

౩౯. ఈ సూత్రవాక్యమునకు 'ప్రథమ మీఁది పొకు ఆదేశమగు వా లఘువు, ఒండు వా అలఘువు.' అని యర్థము: ఇందువలన ప్రథమేతరస్థలంబుల పొకువచ్చినవా అలఘువు కావలయును. బాలవ్యాకరణమున 'అతఁడు వలికె నిత్యాదుల యందున్న పాదేశవకారము లఘువు-తక్కిన వకార మలఘు' వని యున్నది. అంతియగాని 'ప్రథమ మీఁది' అన్నమాట లేదు. కావున ఇందువలన ప్రథమేతరస్థలములందలి యిట్టి వా

దేశము లఘువే కాఁదగును. ఆపెద్దలయందు భక్తికుదిరి వారి యుత్కృష్టపద్ధతిఁ బోధపడియుండిన ఈదొసంగు పొసంగదు గదా. ఇందు 'హరి+పలికె=హరి వలికె' అని ఉదాహరణ మున్నది. 'పలికె' అనురూపము ఈ వ్యాకరణముచే సిద్ధింపదు; దీనిచే 'పలికెను' అని సిద్ధించును. (చూ. క్రి. 'వండెను.')

౪౦. ఈ సూత్రముచే తెనుఁగున వాడందగనివానిని చెప్పుచున్నారు. అని యెవ్వియన:—సూ. 'సుబంతములను, సంస్కృత నామములను, తిజన్తములను, క్రియలను; తుము న్నంతములు, క్త్వాంతములు నను నవ్యయములను'— అని విస్తరము.

ఇటం బ్రష్టవ్యము ఇంచుక కలదు.—

సుబంతములు కాని సంస్కృతనామములు కలవా? తిజంతములు కాని క్రియలు (సంస్కృతమున) కలవా? [ఇచట సర్వస్వములో 'తిజన్తములు' అను పదములో నా క్రింద తాయొత్తు పెట్టినారే? అట్లే 'సుబంతములు' అను పదములో పెట్టలేదేమి? ఏ వర్ణక్రమము సరి? వ్యవస్థ లేదా?] సుబంత సంస్కృత నామములు పనికిరానియెడల ప్రాకృతనామములు పనికి వచ్చునా? ప్రాకృత క్రియలు పనికివచ్చునా? 'జమో' వచ్చేఁ (యముండు వచ్చెను.) 'సఱిఆ'ఉన్నది (సరిత్తు ఉన్నది.) అని ప్రయోగింపవచ్చునా? క్త్వా తుమున్నంతావ్యయములు కూడనియెడల ఇతర సంస్కృతావ్యయములు కూడునా?

'విహస్య (నవ్వి)' పోయినాఁడు, 'విధాయ (చేసి)' కూర్చున్నాఁడు, 'ఇదానీమ్ (ఇప్పుడు)' నడిచినాఁడు-ఇట్టి ప్రయోగములకు ఆక్షేపము లేదా?

౪౧. 'సుబంతతిజ క్త్వాంతములను అనుకరణంబునం బ్రయోగింపవచ్చు'నని యీసూత్రము. అనుకరణంబున ఎల్ల శబ్దములను ప్రయోగింపవచ్చును. అంశాలో ఈనియమ మేల? 'విధాయ' యనియెను, 'జమో' యనియెను, 'జావురే' అనియెను, 'ఎన్' అనియెను-ఇత్యాది.

మఱియు ఈసూత్రమునకు వారొసంగిన యుదాహరణములలో 'అనియె' అని ముఖ్యాలు ప్రయోగమున్నది ఈ వ్యాకరణముచేత 'అనియెను' అను రూపమే కలుగును గాని, 'అనియె' అనురూపము కలుగదు. (చూ. క్రి. వండెను.) అనుపదమునకే 'అనియె'-'అనియెఁ' అని రూపాంతరములు. వాక్యముకడ ద్రుతమునకు లోపము వికల్పమునగును [సంధి, ౨౭] అనుసూత్రముచేత వచ్చును అని విజృంభణమేని, ఇందులకు ఒసంగఁబడిన యుదాహరణములం గనుడు:— 'వాఁడు వచ్చెను, వచ్చెఁ, వచ్చె' అని. ఇందు 'వచ్చెను' అనురూపము క్రియా ప్రకరణము చేత సిద్ధము. దాని ద్రుతమునకు లోపము పైసంధి ౨౭-వ సూత్రమున విహితము. అందు ద్రుత మేది? ద్రుతము నకారముగదా? (౪౯) ఇందును నుకారములో నకారము లేదా యందురా? అది కడపట లేదే? సంధి ఆఱవసూత్రములో 'కడపటి' యను శబ్దమువలె ఇందలి

కడ శబ్దముకూడ ఉపధకుం బేరగునేని, ఆపక్షమున 'అనిమె+ఉ' అని మిగులును. 'అనిమెయు' అను నద్భుత రూపము లభించును. ఉ లోపమునకు విధి యెక్కడ? పైగా, ఇది వాక్యాంతకార్యము; అవాక్యాంతస్థలములయందు 'కనిమెన్', 'కనిమె' అనురూపములకు సిద్ధి యెట్లు?—లేదు. కావున, సంధి ౨౭ వ సూత్రము వాక్యాంతముల కిన్-కున్-వలనన్-అందున్-అను నిట్టి ప్రత్యయాంతములకుందప్ప మఱి వేనికిని పనికిరాదు.

# సంధి.

౧. 'సంధియన పదము తుదియచ్చుతో పై పదము మొదటి యచ్చు కలియుట' యఁట! ఇదియే సంధియేని, ఈ ప్రకరణమందు ద్రుతము మీఁది పరుషములకు సరళాదేశము, స్థిరమునకు ముందుండు ద్రుతమునకు లోపాదికము, ప్రథమ మీఁది కచటతప లకు గసడదవాదేశము, పుంప్వాగమములు, తన వర్ణకమున కార్యము, పడు ధాతుయోగమున కార్యము, మధ్యమపురుష 'ము' వర్ణకలోపము, వాక్యాంత ద్రుత లోపము, ద్వంద్వసమాస గసడదవాదేశము, అంచు–అట్లు–అపుడు–అబ్రము–అద్దేశము – ఇత్యాదులకు స్వరూపసిద్ధి, ఆర గాగమలోపము, ఇత్యాదులు, అచ్చుతో అచ్చు కలియుటగాని యట్టివి, ఏల విరాజిల్లుచున్నవి? మఱి 'కలియుట' యన నర్థమేమి? ఇట నుదాహృతము:—'రాముఁడు+అతఁడు- రాముఁ డతఁడు' అని. ఇట తుదిది ఉకారము పోయి మొదలిది అకారము నిలిచినది. ఇదియే సంధియని వ్యాకర్త యభిప్రాయముగా నగపడుచున్నది. ఇది పూర్వాచ్చు లోపించిన స్థలము. పీ రుదాహరింపనిది ఉత్తరాచ్చులోపించు స్థలమును గలదు. ఎట్లన, చెట్టు (యొక్క)+అది=చెట్టుది, నా (యొక్క) +అది=నాది, వాని (యొక్క)+అది=వానిది, నీ(యొక్క)+అది= నీది. ఇవి షష్ఠీసమాసము లని తెలియుటకై యొక్కను చేర్చి

నాఁడ. యొక్కలోపమునకు విధిసమాసప్రకరణమున నుండ వలయును. నవలాది, లకోరీది, గోనెది, కైది, రోది - అనియు షష్ఠీసమాసములు. అల్లే - అష్టిది - మంచిది - చెడుది - గ్రుడ్డిది ఇత్యాదులు కర్మధారయములుం గలవు. ఇందెల్ల ఉత్తరాచ్చు లుప్తము. ఇట్లు వ్యాకర్తగారు అనుగ్రహించినవియు, మనము సంగ్రహించినవియు నగు నీ వ్యవహారముల వలన 'కలియు' శబ్దమును తొలంగించి ఒకపాటి సూత్రమును రచించుకొందు మేని, ఇట్లుండఁదగును:—'అవ్యవహితములైన రెండు అచ్చులలో నొకటి నశించుట సంధి' అని యేర్పడును. బాలవ్యాకరణమందు 'పూర్వపరస్వరంబులకు పరస్వరం బేకాదేశంబగుట సంధి' యని యుండుటం బట్టియు, ఉత్తరస్వర లోపోదాహరణమట లేనందునను ఈవ్యాకర్తగారు పూర్వస్వరనాశమాత్రమే సంధిగా నెంచిరని తలంపుదము. ఈ యర్థంపు సంధిశబ్దముతో ఈ ప్రకరణమునకు సంధిప్రకరణ మను నామకరణము ఇఁచుకేనియు సరిపడదనుట స్పష్టమాయెఁగదా.

మఱి బాలవ్యాకరణమున నెట్లు సరిపడినది? అని యడుగుదురు. అందు వ్యాకర్తముందుగా సంధిని విధించి అనంతరము పూర్వస్వరనాశము సంధి యని వివరించి ఉదాహృతు లొసంగినాఁడు. అట్టి యుపక్రమాదికము ఈవ్యాకరణమున లేనందున ఇట నీ సంధిశబ్దార్థోక్తి కరము పీడాకరముగా నున్నది. బాలవ్యాకరణమున నిట్లున్నది:—

''ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు.

పూర్వపరస్వరంబులకు పరస్వరంబే కాదేశం బగుట సంధియనంబడు. రాముఁడు+అతఁడు=రాముఁడతఁడు, సోముఁడు+ఇతఁడు=సోముఁ డితఁడు.'' తదాశయము నెఱుంగక వీరు తదుక్తిని మాత్రము అనువదించినారు సంధిశబ్దము అర్థభేదములందు ప్రయోగింపఁబడుచున్నది.

౧) సంహిత—అనఁగా—ఒకదాని (=ఒకవర్ణము) వెంబడి నొకటి వచ్చుట (అనఁగా ఉచ్చరింపఁబడుట)—దానికి సంధియను వ్యవహారము కలదు.

౨) అట్టియెడ ఆరెంటికిని కలుగునట్టి లోపాగమాదేశాది కార్యము.

3) స్వరద్వయసంహితలో పూర్వస్వరలోపము. సంహితం గూర్చిన యీ కారికలం బరికింపుఁడు:—

''సంహితైకపదే నిత్యా నిత్యా ధాతూపసర్గయోః,
నిత్యా సమాసే, వాక్యేతు సా వివక్షా మపేక్షతే.''
''సంధి రేకపదే నిత్యః, నిత్యో ధాతూపసర్గయోః,
నిత్య స్సమాసే, వాక్యేతు స వివక్షా మపేక్షతే.''

అని బోపదేవీయ ముగ్ధబోధవ్యాకరణ దుర్గాదాసీయ వ్యాఖ్యయం దుద్ధృతము. పై మూఁడింట రెండవ యర్థమున సంధి పరిచ్ఛేద సంజ్ఞ యేర్పడినది. 'వాక్యవిరామమందు సంధి లేకున్నను దోషంబులేదు.' అను నుక్తికి, 'పడగనున్న హనుమ భయ విహ్వలుఁడు గాఁడు, అరదమునకు నూతుఁ డచ్యుతుండు' అని యుదాహృతము గదా. ఇట సంధిరాహి

యనఁగా సంహిత లేమి. అందువలన ప్రకృతిభావము— అనఁగా ఉన్నది యున్నట్లుండుట–అనఁగా యడాగము రామి. మూఁడవ యర్థమున ఉత్సంధి సూత్రంబును 'మధ్యమపురుష క్రియల యికారమునకు సంధి నిత్యము' అను సూత్రంబును నిష్పన్నము లయినవి.

'కలియుట' యను పదమునకు సంహితామాత్ర మర్థము కాఁదగును గాని పూర్వస్వరనాశమును, సంహితాకార్యాంతరమును అర్థము కానేరవు, ఆ శబ్దమువలన ఈవ్యాకరణములో మంచి చమత్కారములు ఉదయించుచున్నవి. ఎట్లన—కలియు=కలయు=కూడు (చూ. శబ్దరత్నాకరము.) ఇందువలన రెండు స్వరముల కూడికచే సంజ్ఞాప్రకరణములోని ౬–వ సూత్రమువలన

గోడ+అది=గోడాది;

వచ్చితిరి+ఇటకు=వచ్చితిరీటకు;

గోడ+ఇది = గోడేది;

రాముఁడు + ఉన్నాఁడు = రాముఁడూన్నాఁడు; అను నిత్యాదివ్యవహారములు సాధువగును. ఇట్టి యనిష్టములకు పూర్వవైయాకరణులు అవకాశ మీయలేదు.

౨. ఇందు సంధిరాని పక్షమునం గలుగు కార్యము చెప్పఁబడినది. ఈ సూత్రమునందును, సంధిశబ్దమునకు పూర్వపరస్వరంబులకు పరస్వర మేకాదేశ మగుటయే యర్థము. సూత్రము దీర్ఘముగా (అనఁగా మాటలపుంజముగా) నున్నది,

ఇది యడాగమ సూత్రము, 'సంధియనం బూర్వపదాంతా చ్చుత్తోను త్తరపదాద్యచ్చు కలియుట' యని నిర్వచించికొని యున్నారు గాన అటెత్తుగానే సూత్రము నిట్లు పన్నుకొన వచ్చును–'సంధిరానిచో నడుమ యకారము వచ్చును.' ఇట సంధిశబ్దముచేతనే పూర్వపరస్వరములు ఆక్షిప్తము లగు చున్నవి' కావున 'నడుమ' అన్నచో 'వానికే నడుమ' అని తెలియును. వీరి సూత్రము 'సంధికానిచోటఁ గళలగు పద ములమీఁద నొక యకారము గలిగి దానిపై వెనుకటి యచ్చు నిలుచును' అని. ఇందు 'కళలగు పదములమీఁద' అనుటకు మాఱుగా 'కళలమీఁద' అన్నంజాలును. ఏలన: సంజ్ఞాప్రకరణము 30–వ సూత్రములో కళలనెడి సంజ్ఞ పద ములకే వచ్చియున్నది. మఱియు కళలను ప్రస్తావించుట తూలు. ఏలన, సంధివివరణ సూత్రములో 'కడపటి యచ్చుతో ......మొదటియచ్చు' అని యున్నది. 'కడపటి' యనుట చేతనే ద్రుతప్రకృతికములయిన శత్రు చువర్ణకాదులు తొలఁ గింపఁ బడినవి. అట్లు ఒల్లక, 'కడపటి' యనఁగా 'పదమందున్న యచ్చులలో కడపటి. యని యర్థమును సాధింతురేని 'మొ దటి' యను పదమునకును 'ఉన్నయచ్చులలో మొదటి' అని యర్థము ప్రసక్తమగును. అందువలన 'వచ్చుచుంబోయెను' అనుచో 'వచ్చుబోయెను' అనియు సాధువగును అట్లయిన, చువర్ణకాదికములకు ఉదంతత్వ ప్రయుక్తమయిన సంధి యెట్లు వచ్చునందురేని తద్విధానసామర్థ్యముచేత వచ్చును. 'ఒక

యకారము కలిగి' యుంట. ఇందలి 'యొక' శబ్దప్రయోగము మూఁడవరూపవు (Third form) పూర్ణభాషాపాఠ్యపుస్తక ఫక్కికాశైల్యనుసారి, ['ఒకనాఁడు ఒకయూర నొకబాలుఁడు ఒక కుక్కపిల్లను ఒక బుజానంబెట్టుకొని ఒకవీథిలోఁ బోవు చుండెను'.] 'దానిపై వెనుకటియచ్చు నిలుచును.' ఈ వాక్యము సూత్రమున కనావశ్యకము. ఇది ఆ యక్కరముల వ్రాఁత వరుసను (ప్రకారమును) తెలుపును. 'దానిపై' అనఁగా 'ఆ యకారము నెత్తిమీఁద,' 'వెనుకటి' అనఁగా 'కుడివైపున నుండునట్టి' 'నిలుచును' అనఁగా 'వ్రాయుదురు' అని యర్థములు.

3. 'సంధికానిచో ద్రుతప్రకృతికముయొక్క కడపటి ద్రుతము వెనుకటి యచ్చు నిలుచును' అని సూత్రము. ఇందు 'కడపటి' అనుట తూలు. ఏలన—అంతమున ద్రుతముగల పదమునకే ద్రుతప్రకృతిక సంజ్ఞ (నూ సంజ్ఞా. 30 సూ.) 'ద్రుతముపై' అనుదాన 'పై' యను పదము రెండవసూత్రములో 'మీఁద' అను పదమునకు పర్యాయము. దానికింబోలె దీనికిని 'నెత్తిమీఁద' అని యర్థము. వెనుక=వెనుకటి= కుడివైపున ఉన్నట్టి, నిలుచును=వ్రాయుదురు.

4. 'దీర్ఘాచ్చులకు సంధిలేదు,' అని సూత్రార్థము. సూత్రములో 'అచ్చుపరంబగునపుడు'అను వాక్యము హెచ్చు. అందువలన హల్లు పరమయినచో సంధి కలుగునని భ్రమ కలుగుచున్నది. అట్టి భ్రమకు కారణము 2-వ సూత్రము

మీఁది కళాశబ్దవిమర్శం గనినం దెలియును. అందలి యా కళా శబ్దప్రయోగమే యీ భ్రమకుం గారణము.

౫. ఇది ఉత్సంధి విధాయకము. ఇందు 'నిత్యముగా' అనుట అనావశ్యకము. ఇప్పటికి వికల్పసంధి ప్రస్తావమే లేదు. లేని యాకాంక్షలం గలిగించుట చిక్కులంబెట్టుట.

౬. 'ప్రథమేతర విభక్తులయు శత్రర్థక చువర్ణకము యొక్కయు కడపటి యుకారమునకు స ధి వైకల్పికము.' అని సూత్రార్థము.

'నిన్నున్+అనియెన్=నిన్ననియెన్-నిన్ను ననియెన్;
వచ్చుచున్+ఉండెను = వచ్చుచుండెను.

అని యుదాహరణములు.

ఇందు పెక్కు విచిత్రము లున్నవి. 'నిన్నున్' అను పదము ఈ వ్యాకరణమువలన సిద్ధింపదు. వీరు నిరసించిన యన్యులవ్యాకరణములనుండి దానిని భిక్షించుకొనవలయును. ఏలన—సర్వనామముల రూపనిష్పత్తిని వీరు చెప్పలేదు. 'అనియెన్' అనురూపంబును ఈ వ్యాకరణమువలన సాధ్యము గాదు. క్రియలలో భూత కాలమున 'వండెను' అని నువర్ణాంతముగా రూపము పఠితమేగాని 'వండెన్' అను ద్రుతాంత రూపము పఠితముగాదు.

మఱియు, ఈవాక్యముల వెంబడి సూత్రముంగనుఁడు:—
"ప్రథమ తప్పఁ దక్కిన విభక్తులయొక్కయు శత్రర్థకచువర్ణకముయొక్కయు కడపటి యుకారమునకు సంధి వైకల్పి

కము.'' ఈసూత్రములో 'ప్రథమ తప్ప తక్కిన విభక్తుల' అని నిర్దేశించుటచేత 'నిన్నుఁ' అను పదమును వీరు ద్వితీయాంతముగా నిర్దేశించినారని తలంపవలసియున్నది. ద్వితీయా విభక్తి ప్రత్యయములు వీరి సర్వస్వముప్రకారము 'ని-ను-ల కూర్చి-' అనునవి. (చూ. శబ్ద. 3 సూ.) ఈ ప్రత్యయము లలో దేనికిని కడపటి ద్రుతములేదు. అందువలన ఇటం బఠిత మయిన 'ను' ప్రత్యయమే 'నిన్నుఁ' పదములోనిది అని తలంచుటకు నిమిత్తములేకున్నది. ఈ వ్యాకరణమున 'ను' విభక్తిలోని తుది యుకారము లోపించుటకు సూత్రములేదు. క్రియాప్రకరణములో శత్రర్థకరూపము ద్రుతాంతముగానే పఠితము. 'ఇదియునుంగాక ప్రథమతప్ప తక్కిన విభక్తుల యొక్క కడపటి యుకారమునకు సంధి వికల్పము.' అనుటం బట్టి 'బంటును అడిగెను' అనుచోట 'బంటును.యడిగెను' అనియు ప్రయోగము ముదురును. ఈ సందర్భములో ఇంకొక వింత చూపించెదను. ద్వితీయావిభక్తి ప్రత్యయములలోపల 'ను' అనునట్టిది యొకటి కలదు. (చూ. శబ్ద. 3 సూ.) అందులో 'నుఁ' అనునది లేదు. ఈప్రకరణములో ౨౧ వ సూత్రము 'నుఁ' అని ప్రారబ్ధము. ఈ 'నుఁ' ఎక్కడిది? ద్వితీయావిభక్తియే అగునేని, విభక్తిపరిగణన సూత్రములో (చూ. శబ్ద. 3) చేతఁ-చేఁ-తోడఁ-తోఁ; కొఱకుఁ; వలనఁ-కంటెఁ; కిఁ-కుఁ-లోపలఁ; అందుఁ-నఁ. అను వానింబోలె దీనిని సద్రుతముగా పఠింపమికి కారణమేమి?

'నున్' అనియే వాస్తవరూపము, 'ను' అనునది ప్రామాదికము అందురేని, ఆ పక్షమున, 'చెట్టునున్' అననగునేగాని 'చెట్టున్' అనుట యెట్లు? 'చెట్టున్' అనఁగూడదేని, ''వనజాక్షోపము వామలూరు తనయున్...ద్వైపాయనున్...భానున్ సుబంధున్...బిల్హణున్...మాఘున్...శివభద్రు...చోరున్...'' (మను.), ''స్ఫాయద్వటత్స్వాజమున్,'' ''దీపకళికాశృంగంబు శ్రీరంగమున్'' (ఆము.) ఇత్యాది పరస్సహస్ర ప్రయోగములు దుష్టములా?

మఱియొకవింత:—ఈసూత్రములో శత్రర్థక చువర్ణకము అను వ్యవహారము కనఁబడుచున్నది. ఈ వ్యాకరణమందు శత్రాద్యర్థములందు ప్రత్యయవిధానము లేదు. చున్నంతములు మాత్రము క్రియాప్రకరణమున పఠితములు. అందు చుకారమే ప్రత్యయమో, చున్నే ప్రత్యయమో? ఆరహస్యమును వీరు వెక్కిరించిన పూర్వుల వ్యాకరణములనుండియే తెలిసికొనవలసి యున్నది. పోనీ, స్వవ్యాకరణానురోధముగా చు న్ప్రత్యయ మనియే వ్యవహరించుకొనరాదా ? చువర్ణకమనుట కడపట ఉకారము లభించుటకైన యుక్తియా? ''నుకారముతో పనిలేదు, ఉకారమే కడపటి యక్కరము'' అని వాదమేని, ఈ సూత్రంబున విహితమయిన సంధి వైకల్పికముగావున వీరు పక్షంబున 'వచ్చుచుయుండెను' అనెడి రూపము ననుగ్రహించి భాషాభివృద్ధి గావించినవారగుదురు,

౭. ఈసూత్రమున ననుఁ-మముఁ-నినుఁ-మిముఁ-తనుఁ అను సర్వనామరూపములును, అనియెఁ - అడిగెఁ - అనెఁ అను క్రియాపదములును ప్రయుక్తములు. ఇవెవ్వియు ఈ వ్యాకరణమున సిద్ధింపవు సరిగదా, ఇందలి ఫక్కికంబట్టి యసాధువులు కూడనగును. 'ఈపదములు ఉకారాంతములై'- ఈ పదములనఁగా 'ననుఁ', 'మమున్', 'తనున్' అనునవి. ఇవి ఉకారాంతము లఁట! ఈ ప్రకరణములోని ౨౧-వ సూత్రమునఁ జెప్పఁబడిన 'నుఁ' ప్రత్యయమును తివిచి వైచితి మేని, న-ని-త అని మూఁటికి శేషించును. 'మముఁ' అను నది ప్రౌఢోద్ధను. అందుకై, నను-మము-నిను-మిము - తను లే శేషించునట్లు విడఁదివిచినచో ద్వితీ - యా ప్రత్యయము ద్రుతమాత్రమ యగును. 'ను'-'నుఁ' అని ఈవ్యాకరణమున ఆ ప్రత్యయ మగపడుచున్నది గాని ద్రుతమాత్రముగా ఎటను ఉపదిష్టముగాదు. [చూ. ౨౧ సూ. (నున్, కొఱకుఁ, కున్, అందున్,) ఇందున్, ఎందున్, ఎట్టకేలకుఁ, ఇఁకఁ.] ప్రత్యయముతో చేరిన మొత్తమే పదము. ప్రాతిపదికమునకు ప్రత్యయము ఘటితమగును అని సిద్ధాంతము గావున ఈ మొత్తములే ఇట పదవాచ్యములని గ్రహింపంజూచిన, ఆ మొత్తములు ఉదంతములు గావు. ఇది యిట్లుండ—'వీని కడపటి ద్విత్వము లోపించినందున సంధి కలుగదు' అని సూత్రమున సకారణము విధేయాంశము. ద్విత్వ మెడలినచో సంధి రాదని ఇప్పటి కెచటను చెప్పలేదు. పైగా, 'కడపటి ద్విత్వ'

మఁట! (చూ, ౭ సూ.) ఇట కడపట ద్రుతమున్నది గాని ద్విత్వము లేదు; 'నన్నుఁ-మమ్ముఁ' అనియుండెనా యేమి? ద్విత్వమనఁగా రెండిటితనము, అనఁగా రెండుమాఱులు అవ్యవహితముగా నుచ్చరింపఁబడియుండుట. అట్టి యాయుఃసికి ఆ రెండింట నొకటి పోయిన పోవును. అట్లర్థము కానీయక వీరు ద్విత్వమును జంటయని టీకవ్రాసినారు. జంట లోపించుట యనంగా, రెండుహల్లులును నశించుట. 'నన్నుఁ', 'మమ్ముఁ' అనునవి 'నఉఁ' 'మఉన్' అగుట. భావిఁ ద్రవ్య బేతాళములు బయల్వడుటగా నున్నది. జడ్డయనరాదా? ఇదియునుంగాక, ఇందు సర్వనామ పరంపరలో 'తమ్ముఁ' చెప్పలేదేమి? అది యీసూత్రమునకు విషయము కాదా?

౮. 'అకారమునకు సంధి బహుళ' మఁట! సూత్రమున దీని విస్తరములో సంధియొక్క కలిమి లేములకు నిమిత్తమును నిశ్చయముగా తెలిసియున్న దానిని సయితము చెప్పక కొన్నిచోట్ల వికల్పము, కొన్నిచోట్ల రాదు అని గుట్టు తెలియనీయక నసికిపైచుట యేల? 'వచ్చిన+అది వచ్చినది, వచ్చినయది', దీనికే 'కొన్నిచోట్ల వికల్పము' అను సూత్రాంశము. 'అకారాంతములైన క్రియాజన్యవిశేషణములకు సంధి వికల్పము' అని సూత్రించిన హృదయంగముగా నుండును. నిండారు విషయము విద్యార్థులకు సులువుగా ఉపదిష్టమగును. 'హంస+ఏది= హంసయేది-' దీనికే 'కొన్నిచోట్ల సంధి కలుగమి యగు' అను సూత్రాంశము. ఇట నిమిత్తము 'హంస' తత్సమమగుట.

ఈ సూత్రాంశము ఏటికి? 'కలుగదు' అనరాదా? 'తత్సమంబుల య (అ) కారమునకు సంధిరాదు' అని సూత్రించుట హితము. 'కొన్నిచోట్ల' అనుట చీఁకటిలో తడవుకొనుటగానున్నది. ఇందు 'చింతాకు' అనునది ౮, ౯-వ సూత్రములు రెండింటికి గోచరమయినది. ఇది విధాయక సూత్రముగాక యవతారికా మాత్రమయేని దీనికి సూత్రసంఖ్య యేల యిడవలయును? ఇతరులు దీనికే సూత్రము చేసి యిందలి యవాంతరములను వృత్తిలో చెప్పినారు.

౯. 'ప్రత్యయాదుల యచ్చు పరమగుచో అకారమునకు సంధియగు' అని సూత్రార్థము. ఇందులకు మూఁడు ఉదాహరణములు దత్తములు: 'చింతాకు', 'పోఁకంత', 'చేరెడు'. చేరేఁడులో ప్రత్యయాంతోదాహరణమయిన యె (ఎ) డు, పరిమాణార్థకమయినచో అందు అరసున్న యుండవలయును; తద్ధర్మార్థక విశేషణప్రత్యయ మగునెడల, అది ఉకారసంధి యగును. కావున దానికి ఈసూత్రము వలవదు. కాన నిట నుదాహృతికి అది పనికిరాదు.

౧౬-వ సూత్రమున ఎడు (ఏఁడు) ప్రత్యయము మరలం జెప్పఁబడినది; కాని అందును అరసున్నను వీరు పెట్టలేదు, అట్లే ౧౭-వ సూత్రమునను ఈ యేఁడు వర్ణకము కలదు, అందును అరసున్న లేదు. కావున ఈ రెంటను (మూఁటను) ఎడు పరిమాణార్థకము కాదా? కాకేమి? అందుమేని దానిని రెండుసూత్రములయందు ప్రయోజనభేదము లేకయే చెప్ప

నేల? మఱియు నిట 'ప్రత్యయాదుల యచ్చులు పరంబగుచో అకారమునకు సంధియగు' నని యున్నది. ఆశ్చర్యమే! ఇందు వలన 'రమందఱ్'. 'అమ్మందఱ్', 'అబ్బందఱ్', 'మొలకందఱ్' అని చెప్పవచ్చునా? 'అందఱ్' అనునది విభక్తి ప్రత్యయము కాదా? (చూ. శబ్ద. 3 సూ.)

౧౦. 'క్రియాజన్యవిశేషణములు మొదలగువానియందలి య (అ) కారమునకు సంధి వికల్పము' అని సూత్రము. ఇందుచెప్పిన 'మొదలగునవి' యేవో తెలియదు. ఈ సూత్రములోని యీ 'మొదలగునవి' ౮-వ సూత్రములోని 'కొన్ని చోట్ల'కు పర్యాయపదము. అందలి వికల్పసంధికి ఇది వృత్తియేని, ఈవృత్తికి సంఖ్య యేల? సంఖ్య యిడకుండుట న్యాయ్యము.

౧౧. "స్త్రీవాచక తత్సమసంబోధనముల కడపటి య (అ) కారమునకు సంధి గలుగదు." అని యిట సూత్రవాక్యము. ఇది బాలవ్యాకరణములోని య (అ) కార సంధ్యభావవృత్తికి గుప్తి 'స్త్రీవాచకతత్సమ సంబోధనాంతంబులకు సంధిలేదు' అని బా. వ్యా. వృత్తి. ఈ సర్వస్వసూత్రము ఇందే ౮-వ సూత్రమునం జెప్పిన సంధ్యభావమునకు నిమిత్త సంపాదనము. దీనికిని సూత్రసంఖ్య తగదు. ఇందు 'కడపటి' యనుట అనావశ్యకము.

౧౩. ఇది ఏమ్యాదుల యికారముయొక్క వికల్ప సంధికి సూత్రము. ఇందులకు వీరిచే ఏమి-మఱి-కి షష్ఠి అని

మూఁడే ఏమ్యాదులు ఉదాహృతములు. పూర్వులు ఈ మూఁటినేగాక మఱికొన్నిటినిగూడ పరిగణించినారు. ఏవనః— "ఏవి-మఱి-కిషష్ఠి-అది-అవి-ఇది-ఇవి-ఏది-ఏవి; ఇది యాకృతి గణంబు" అని పెద్దలవాక్యము. ఇట్లు కరగతమై సులువుగా వ్రాయఁదగిన యీ తొమ్మిదింటిని—ఇది సర్వస్వమఁటగదా— ఇందు వ్రాసికొని యుండరాదా? అక్లేశముగా విద్యార్థులు గ్రహింతురుగదా.

౧౮. బాలవ్యాకరణమున 'ఏమ్యాదులు' అన్నారే గాని 'పదములు' అనలేదు. వీరు 'ఏమి మొదలయిన పదంబుల' అని పదశబ్దఘటితముగా ఆరంభించి, ఏమి, హారికిఁ, అది – అనువాని నుదాహరించినారు. కిషష్ఠ్యంతము పదమే అయినను కివర్ణకము పదముకాదు; వర్ణకమునకు పృథక్ప్రయోగము లేనందున, గణములో కివర్ణకము చెప్పుటచేత తద్వర్ణాంత ములే లబ్ధములయినవి. సర్వస్వమం దన్ననో,—కివర్ణకమని కివర్ణకమని చెప్పమిచేతను, 'హారికిచ్చె'అని యుదాహరించుట చేతను 'హారికిఁ' అనుపదము ఏమ్యాదులలో చేరినదని తోఁ చునేగాని, కివర్ణాంతములైన పదములెల్ల జేరినవని యేర్ప డదు. చేరవనియుం దోఁచును. కావున 'పదములు' అనకుం డుటవలనం గొంత మేలగును.

౧౯. 'క్త్వార్థక యికారమునకు సంధిరాదు' అని వ్యాకర్తగారి వాక్యము. [ ౨౧-వ సూ. అభ్యాసములో చూడుము-క్త్వార్థక యికారము.] 'క్త్వార్థకేకారము' అనం

దెలియదాయెనే ఇది మూఁడవతరగతి (Third Form) విద్యార్థి చేయుతప్పు. దీనితోఁ దులఁదూగునది 3 వ సూత్రమున 'ఒకే విభక్తి' అనునది ఇదియును 'తద్ధపారము బాయిదే.'

౧౬. 'ఎడు' ప్రత్యయమఁట! ''ఎడు''లో అరసున్న యుండవలయును.

౧౭. ఇందును 'ఎడు'లో అరసున్న వలయును 'ఎఁడు పరంబగునపుడు పూర్వపదంబుల కడపటివివర్ణముకూడ లోపించును.' అని సూత్రము. ఇందు 'కూడ' అనుట అనన్వితము; ఏలన, మఱియొకటి లోపించునని ఇప్పటికి చెప్పనందున.

మఱియొక విశేషము:—ఈసూత్రముచేత 'దాలి+ఎఁడు' (పిడుకలు) = 'దా+ఎఁడు' (పిడుకలు)='దేఁడు' (పిడుకలు) అగును గాని 'దాలెఁడు' (పిడుకలు) గావు. 'దేఁడు' అను సంధికి చూ. ౧౬ సూ.

౧౮. ఆమ్రేడితసంధి సూత్రము ఇట ఉదాహరణములలో, 'ఓహో+ఓహో=ఓహోహో' అని యున్నది. తుదను హ్రస్వమెట్లు వచ్చినది ? సాధింతురా ? అచ్చుపొరఁబాటా ?

౧౯. ఎదుర+ఎదుర=ఎట్టయెదుర—ఈ సూత్రమునకు—'ఆమ్రేడితము పరమయినచో పూర్వపదమున తొలివర్ణము మీఁది భాగమునకు ద్విత్వటకారంబగు'—అని యర్థము. అందువలన ఎదుర+ఎదుర=ఎట్ట్+ఎదుర='ఎట్టెదుర' అగును గాని 'ఎట్టయెదుర' గానేరదు. 'టకారాకారములనే టకార

మంటిమి' అని వాదింతురేని, తద్ద్విత్వము 'టట' యగును. అంత 'ఎటట యెదురు' అని రూపమగును. 'కడ+కడ' అనుచో కకారము తొలివర్ణముగాన, తచ్ఛిష్టము 'అడ'; దానికి 'ట్ట్' వచ్చిన, 'క్ట్ట్ కడ' అగును. అట్లే—'తుద+తుద' 'త్ట్ట్తుద' అగును ఇదియునుం గాక—శిష్టమునకు ఏవిద్దెచేనైనంగాని 'ట్ట' వచ్చునుగాక యనిన, ఆ పక్షము నను—'ఎట్ట+ఎదురు' = ఎట్టెదురు' మాత్రమే యగునుగాని 'ఎట్టయెదురు' కానేరదు; ఏలన, ఆమ్రేడితము పరమయినచో సంధియగునుగదా. (౧౮ వ సూ.)

౨౦. వచ్చెన్+అతఁడు=వచ్చెనతఁడు. 'వచ్చెన్' అను రూపము ఈవ్యాకరణ సర్వస్వమున సిద్ధింపమి యెఱుకయే గదా! "ద్రుతాంతముల కచ్చు పరంబగునపుడు సంధి గలుగదు. పరంబగుచో లోపంబును గలుగదు.' ఇందు ఉత్తరభాగము అనావశ్యకము. ఏలయన, లోపమునకు ప్రసక్తిలేదు; లోపమునకు విధి యెటను లేదు. సంధిలేమిచే యథాక్రమోచ్చారణవశంబున 'వచ్చెనతఁడు' అని కానే యగును.

౨౧. '(నున్, కొఱకున్, కున్, అందున్) ఇందున్, ఎందున్, ఎట్టకేలకున్, ఇఁకన్-౨౦ వ సూత్రములో నిషిద్ధమైన ద్రుతాంతసంధి ౬-వ సూత్రముచే కుండలితములకు వికల్పముగా నగును. దీనిచే ఇతరములకు నాల్గింటికి వికల్పము.' అని యీ సూత్రము. (న్, కొఱకున్, కున్,

అందుఁ) అను వానికి, ఈ సూత్రమువలన నిరవకాశమయిన ౬-వ సూత్రముచేత సంధికలుగుచునేయుండఁగా, ఇచట మరల వానిని పఠించుట టీకాశైలిగాని సూత్రశైలిగాదు. సాంకర్యము బాలురను చిక్కులంబెట్టును. ద్రుతప్రకృతికమునకు సంధిలేదనెడి ౨౦-వ సూత్రమునకు ఈ ౨౧-వ సూత్రము అపవాదమై యుండఁగా, ఇటం జెప్పిన యీ ప్రథమేతర విభక్త్యకారభాగమును ఆ సూత్రమున మానియుండవచ్చును.

పైగా—ఇందుఁ, ఎందుఁ, ఎట్టకేలకుఁ, ఇఁకఁ అను నాల్గింటికి ఆ ౬-వ సూత్రంపు వికల్పసంధి ఈసూత్రము వలనఁ గలుగునఁట! ఇట ప్రష్టవ్యము మెండుగాఁ గలదు. ఆ ౬-వ సూత్రమునకు విషయమైన విభక్తిప్రత్యయములు— ఈ సూత్రములో కుండలీకృతములై యున్నవి. 'ఇందుఁగలఁడందులేఁ'డను నిట్టిప్రయోగములందలిది 'అందు' కుండలీకృతమయిన య (అ)ందు ప్రత్యయముగాదు. ఇది కడమ నాల్గింటను (అకుండలితములందును) జేరలేదు. దీనికి సంధిమాటయేమి? 'అందుండుఁ ద్వాయ సద్మ' (ఆము.) ఇత్యాది మహాకవి ప్రయోగములు దుష్టములా? పైగా 6-వ సూత్రమునం జెప్పిన వికల్పసంధి ఉకారమునకుఁ గాని, అకారమునకుంగాదు. ఉకారసంబంధము వలదేని, 'అటం జెప్పిన' అని ఆ సంబంధముం దడవనేల? అట్లుండ ఆసంధి యిట 'ఇఁకఁ' అను పదమున కెట్లు గలుగును? 'ఇఁక'కు 'అందు'తో సాహచర్యముం జెప్పుకొన్న ప్రయోజన మేమి? ఎట్లైనను విధానముచేతనే

గదా దీనికి సంధి వలయును. దీనికి విధాన మేదీ? కావున ఈ వ్యాకరణము ప్రకారము దీనికి పై ౨౦-వ సూత్రముచేత సంధి నిషిద్ధము. అందువలన "అందుందుర్ద్వయసద్మ పద్మ వదనుండు" అను విష్ణుచిత్తీయప్రయోగము దుష్టము కావలయును. "ఎందెందు వెదకిచూచిన నందందే కలఁడు దాన వాగ్రణి వింటే" అను భాగవతప్రయోగంబును దుష్టమే కావలయును. వ్యాకరణము ఇందులకా!

ఇక్కడ గుట్టు ఏమనఁగా—ఈ ౨౧-వ సూత్రవాక్యములో కుండలితమైన యు(అ)ందు ప్రత్యయ మనియు అకుండలితములైనవి 'ఇందు,-ఎందు' పదము లనియు, స్పష్టముగా ప్రతిపాదితము. ఇందువలన అందు-ఇందు-ఎందు అనునవి ప్రథమేతర విభక్తి సూత్రగోచరములు కావని వీరి తలంపు. ఈ మూఁడును తత్సూత్రగోచరములే. అందుఱ్, ఇందుఱ్, ఎందుఱ్ అనునవి సప్తమ్యంతపదములు. వానికి వికల్పసంధి ప్రథమేతర విభక్తిసూత్రముచేతనే సిద్ధించినది. వానిలో 'ఇందు', 'అందు' అనువానిని ౨౧-వ సూత్రమునం జేర్చుట శబ్దస్వరూపము నెఱుంగమిం గలిగిన పొరఁబాటు. ఇఁక (ఇఁగ) ఎట్టకేలలకు మాత్రమే సూత్రము వలసినది. అదియుం గుదురక పాడయినది. ఇచట ౨౧-గా సంఖ్యాతమయినవ్యాసములో కడపట 'ఈ సూత్రముచే' అని యున్నది. అతి మనోహరమయిన నౌకా వాహ్యాళి యీ ౨౧-వ సూత్రంపు సుడిలోఁ బడి 'మునగానాం తేలానా' మయినది!

౨౨. వచ్చెన్-చూచెన్ - అని ద్రుతాంతరూపములు ఈ వ్యాకరణముచే సిద్ధింపవు. వానిని వీరు నిందించు పూర్వ వ్యాకర్తల గ్రంథములనుండి తెలిసికోవలయు.

౨౮. 'తాన్గనియె, రాజున్జూచె'—దీనితోడి సూత్రము నర్థము.—'దీర్ఘముపై ద్రుతమునకు పూర్ణబిందు సంశ్లేషములు కలుగవు' అని 'తాను' అనిశబ్దము. 'తాను నేను పదములు' అని ౩౦-వ సూత్రమునం దుక్తము. ఇందలి తుది యుకారమునకు లోప మెట్లు వచ్చినది? దురూహముగా నున్నది. ఇందులకు పూర్వవ్యాకరణములే శరణము. ఈ సూత్రముకై 'తాన్...గనియె' అని విడివిడిగా ముద్రించుటయు, 'తాన్గనియె' అని నకారము క్రింద గాయొత్తుతో ముద్రింపమియు సంశ్లేషమురామిని తెలుపుటకా? 'సంశ్లేషమన రెండుహల్లులకూడిక' అని వీరి ౩౩-వ సూత్రములో నున్నది. ఆ కూడిక అచ్చులోనా, వ్రాతలోనా? అచ్చులోనగునేని, సిరా, కాగితము, పుస్తకపరిమాణము వీనికి నియమము లేమయినను గలవా? వ్రాతలోనయిన విడిగా వ్రాయుట సంశ్లేషము గాదని రహస్య మేమయినం గలదా? ఒత్తుపెట్టిన సంశ్లేషము, పొల్లువ్రాసినం గాదా, అని బర్హిబర్హాముం ద్రిప్పుట వింతగానే యున్నది. సంశ్లేషమనంగా సంయుక్తోచ్చారణ. అది విడిగా పొల్లుగా ముద్రించినను, పంక్తిచ్ఛేదమయినను, క్రింద ఒత్తుపెట్టి ముద్రించినను, సంశ్లేషమే. కావున 'తాన్ గనియె' అను వాక్యము అసంశ్లేషోదా

హరణీమునకు పనికిరాదు. 'తాఁజదివె', 'తాను జదివె' అని బాలవ్యాకరణమున నుదాహృతము. అందువలన 'తాను జదివె' అనునది అసంశ్లేషోదాహరణమని యెఱుంగనగు. సూత్రములలో ఇందు 'దీర్ఘముపై' ననియు, బా. వ్యా. న 'తాను నేను లకు' అనియు, భేదము.

౨౫. పై యట్లే, ఈ సూత్రముతోడ 'కనియెఁ గోవు', 'పాండెఁ సీరి' అనునవి విడివిడిగా ముద్రించినను, సంశ్లేషోదాహరణములే కాని అసంశ్లేషోదాహరణములు గావు. ఏవిధముగా ముద్రించి ఎంత టక్కుగా పఠించినను హ్రస్వము, ద్రుతము, సరళస్థిరాన్యతరమును, వరుసగా వచ్చిన చోట ఆ హ్రస్వమునకు గురుత్వము రాకతప్పదు. ద్రుతమాత్రముచేతనే గురుత్వమందురేని, ద్రుతము లోపింపని స్థలములందు, 'ఆతని నడిగెఁ' ఇత్యాదులయందు 'ని' వర్ణము గురువా? కాదు. కావున విడిగా వ్రాయుటయు ముద్రించుటయు సంశ్లేషకు భంజకములు గావు. 'అతిశయముగ బుద్ధిమంతుఁడగు బుధసేవఁ' అనుచో 'వఁ' గురువు గాదా? ద్రుతమాత్రముచేతనేగదా దానికి గురుత్వము వచ్చినది? అని యాక్షేపము. అది యవసానకార్యము. ఇక్కడ అవసానము గాదుగదా?

'రెండు హల్లులు కూడిన సంశ్లేషమనంబడు'—అని వీరి ౨౩-వ సూత్రము. 'సంశ్లేష మనఁగా మీఁదిహల్లుతోఁ గూడుకొనుట.' దీనిచే పూర్వహల్లుతోఁ గూడుకొనుటయు

సంశ్లేషమే అనఁదగునని తోఁచుచున్నది. ఏమన్నను ఒకటే అగునా? మఱియు దీర్ఘముపై సంశ్లేషము కాదేని—

'ఏన్గులఁ గూలిచి తన నవ
లాన్గాచి స్వమార్గరోధులన్ రాసుతులన్
బీన్గులు గావించి లకో
రీన్గుదియించెను గుమారవృషభుం డాజిన్.'

అని మదీయము ప్రసక్తివశమునం గల్పితము. ఇందలివి 'నవలాన్గాచి,' 'లకోరీన్గుదియించి' అను ప్రయోగములు దుష్టములా?

౨౬. 'కన్+కవ = కంగవ.' 'కన్ను' శబ్దమునకు ఈ వ్యాకరణమువలన 'కను' అను రూపమురాదు 'కను' శబ్దమునకు 'కన్' అను రూపము ౫౯-వ సూత్రముచేత కలుగును. అటుపైని ఈసూత్రముచేత ౨౫-వ సూత్రంపు ద్రుతకార్యమునందు విశేషము చెప్పఁబడినది. 'పదంబు మొదటిదగు హ్రస్వాక్షరముపై" అని సూత్రాంశము. దీని చేత అజాదిపదమే నిర్దిష్టమని తోఁచును. అది సరిగాదు గావున 'పదంబున తొలియక్షరమందలి హ్రస్వముపై' అన వలయును. 'పదంబున ప్రథమాక్షరహ్రస్వముపై' అనిన మఱియుమేలు. పదమనుట అనువాదమాత్రమే గావున బాల వ్యాకరణములో 'ప్రథమహ్రస్వంబుపై' అని యారబ్దము. మఱి ౫౯-వ సూత్రమువలని లుప్తశేషమునందలి నకారము నకు నకారత్వముచేతనే ద్రుతత్వము కలుగునా? ఆపక్షమున

['మ్రాను+పడు'=] 'మ్రాఁబడు-' 'మ్రాన్పడు'-అని ప్రయోగింపవచ్చునా? 'మ్రాన్పడు' తప్పేగదా. వీరు 'కన్గవ'లో 'ఉ' లోపము ౫౯-వ సూత్రముచేత వచ్చినదని తెలుపుటకై ఆ సూత్రముకడ దీనినికూడ ఉదాహరించినారు. శిష్టములోని నకారమునకు ఈ (౨౬) సూత్రమువలన ద్రుతకార్యమును ప్రస్తుతించినారు. అందువలన 'రాముఁడన్గొమరుఁడు' అనుచో 'అంగొమరుండు', 'ఇరులుకొన్దోఁటల' అనుచో 'కొందోఁటల', 'మ్రాన్పడియె' 'మ్రానుపాటు' అనుటకు మాఱుగా 'మ్రాఁబడియె' 'మ్రాన్బాటు', 'మ్రాఁబాటు' అవియు రావలదా? అట్లే 'పేను చచ్చెన్' అనుట దుష్టమై, 'పేనుసచ్చెన్' అనుటయు దుష్టమే అయి, 'పేఁజచ్చెన్' అనియు, 'చేనుపండెన్' అనుట తప్పయి 'చేఁబండెన్' అనుటయు ఒప్పుగావలదా? ఇట్లుండ 'కన్+కవ' అను నిచ్చో 'కన్'అను పదము ద్రుతప్రకృతిక మెట్లయినది? ఇట పూర్వులవ్యాకరణములే శరణములు.

౨౯. 'అవ్యయముల మీఁదను, గళలగు క్రియాపదముల మీఁదను బరుషములకు గసడదవ లగు' అని సూత్రము. ఈసూత్రముచే 'ఊర్వశివలె సక్కనిది', 'నన్నింద్రుఁబోలె సూచినది' ఇత్యాది ప్రయోగములు ఆంధ్రశారదోపాసకుల పాపపరీపాకముగా పంటపండును. 'వలెన్, పోలెన్' అవ్యయములుగదా. అట్లయిన ఈయనిష్టమును బాధించుటకు 'ద్రుతప్రకృతికములమీఁది పరుషములకు సరళము లాదేశంబగు' అని (౨౨-వ) సూత్రము ఉండలేదా? యనిన, అది దీనినే

బాధించునో, ఇది దానినే బాధించునో సుబోధమా? కావున, సూత్రమున 'క్రియాపదములును, అవ్యయములును అగు కళలమీఁద' అని మార్చుకొనవలయును. అవ్యయము లన నేమో ఈవ్యాకరణమువలనం దెలియదు. అందుకై వీరిచే ధిక్కృతులైన పూర్వవ్యాకర్తలపదములనే సేవింపవలయును. ఈరెండును ద్రుతాంతావ్యయములని శబ్దరత్నాకరములో నిరూపితము. బాలవ్యాకరణములో 'అపుడు సనియె' అను నుదాహరణములో 'అపుడు' శబ్దమును ప్రథమాంతముగానే ఉపపాదించినారు. 'అప్పు డిప్పు డెప్పుడను శబ్దములు నిత్యైక వచనాంతములు' అని యందుల వృత్తి అది వీరికి బోధపడ దాయెను. వీరు 'అపుడుసనియె' అని అలోవ సూత్రములో అనగా ప్రథమమీఁది గసడదవాదేశసూత్రముతో నుదాహరించినారు. ఏమి వ్రాసినను సరియే యగునా? ద్రుతాంతములు అవ్యయములు గానేరవని వీరి యెఱుకగాఁ గానిపించుచున్నది.

30. 'తాను నేను పదంబులు ద్రుతాంతములగుటచే' అని ఈ సూత్రమున నున్నది. అవి ద్రుతాంతము లెట్లయినవి? నువర్ణాంతత్వముచేత అందురేని, పేను, మేను, చేను, మాని న్వాదులును ద్రుతాంతములే యగునా? 'పేను సచ్చెన్' అనఁ గూడదా? అనవచ్చును అట్లే అనవలసినది. 'తాను సచ్చెన్' అని మాత్రముచెప్పఁగూడదు. ఏలన, ఈ సూత్రము తాను నేనుల కొఱకే అందురేని, తానునేనులు ద్రుతాంతము లని బాలవ్యాకరణమునుండి బిచ్చముం దెచ్చికొనవచ్చును. వీనిపై

సరళాదేశాది ద్రుతకార్యములకై ఈ సూత్రము. ఇట్లే సరళ స్థిరములు పరము లగునపుడు అగుకార్యములకై సూత్రాంతర మును చెప్పవలదా? ఈ వ్యాకరణమునందు జెప్పలేదు. 'ప్రత్యేకముగా చెప్ప నక్కఱలేదు. ద్రుతాంతత్వముచేతనే సిద్ధించును,' అందురేని, ఆ పక్షమున ఈ సూత్రముకూడ అనావశ్యకమే. ఇట్టిది లేకయే బాలవ్యాకరణమున నిర్వాహమైనది.

ఇదిగాక, ప్రత్యేకముగా చెప్ప నక్కఱలేదు అను మాట సరిగాదు. ఏలన 'తాను నేను పదంబుల ద్రుతంబునకు సంశ్లేషములేదు' అని బా. వ్యా. సంధి ౨౨-వ సూత్రము. ఇందువలన ఇతరద్రుతమున కెల్ల సంశ్లేషము కలుగునని తెలియుచున్నది. అటుండ దీర్ఘమాత్రముమీఁది ద్రుతమునకు సంశ్లేషమురాదని వీరు ౨౮-వ సూత్రముచే శాసించినారు. ఈ విశేషమును కోవిదు లరయవలయును.

మఱి, నేను నను ఏను అని రూపాంతరము గదా. దానికి ద్రుతసంధియా-కళాసంధియా? ఊరక యెట్లు తెలియును?

౩౧. దేశ్యములమీఁది సాంస్కృతికపశుపములకు గస డదవలు రావని యీ సూత్రమునర్థము. దేశ్యములపైని రాని చో తద్భవములపై వచ్చునా? 'తెనుంగులమీఁది' అని బాల వ్యాకరణము. కావున 'దేశ్య లమీఁది' మాత్రమే అని సంకోచించుట సమంజసముగాదు. అట్లే—

''న వికృతిశబ్దా త్పరతః''

అని ఆంధ్రశబ్ద చింతామణి.

"తత్సమవ్యతిరిక్తములయిన తెనుఁగు శబ్దములమీఁది తత్సమశబ్దముల కచటపలకు గసడదవలు రావు" అని తట్టీక త్యక్తతద్భవము గావున ఈసూత్రము పనికిరాదు

౩౨. ఇందు 'కాలుసేతులు'ను, 'ఊరుపల్లెలు'ను ద్వంద్వసమాసములు. వీనియందు రెండేసియే పదములు. 'ద్వంద్వమున ప్రథమేతరపదాదిస్థమైన పరుషములకు యథాక్రమముగ గసడదవాదేశము వచ్చును', అని సూత్రార్థము. 'యథాక్రమము', 'ఒకేవిభక్తియందుండు', 'రెండు మూఁడు పదములు సమాసము' అని లక్షణముకూడ చెప్పినారు. ఇట రెండవ పదమున మొదటి పరుషమునకు ఆదేశము చెప్పఁబడినది అట్టి యాదేశము మూఁడవపదము మొదటి పరుషములకు రాదా? ఏల రాదు? 'రెండుమూఁడు' అనుటచే నాలుగుకూడ ఉండ వచ్చునని సూచన అగపడుచున్నది. 'కాలు సేయి దోఁకలు', 'కాలుసేయిదలలు' అనఁగూడదా? కూడునేని 'రెండవ' అనక 'ద్వితీయ ప్రభృతి' అనరాదా?

మఱియొక సందేహము—'ఒకే విభక్తియందుండు రెండు మూఁడు పదముల సమాసము ద్వంద్వము నాఁబడు' అని లక్షణవాక్యము పలికినారు. అభిన్న విభక్తికముల సమాసము ద్వంద్వమనుట. అందువలన, 'నీలము ఉజ్జ్వలము నగు దేహము నీలోజ్జ్వలదేహము'-ఇది ద్వంద్వమా? 'నీలము నుజ్జ్వలము నగు దేహము కలవాఁడు నీలోజ్జ్వలదేహుఁడు'-

ఇది ద్వంద్వమా? 'నీలమగు మేఘము నీలమేఘము'.—ఇది ద్వంద్వమా? ఈ యగడితలో పడిన విద్యార్థి గట్టెక్కుట యెట్లు? మఱియు రెండవపదముయొక్క మొదటిపరుషమన్న, రెండవపదములోని పరుషములలో మొదటిది అని యర్థమగును. దానంజేసి 'తాయి అప్పలు' అనుటకు మాఱుగా 'తాయి అవ్వలు' అనవలసినదా? మఱియు 'పదములోని పరుషములలో మొదటిది అని యేల యర్థమగును? పదాదియగు పరుషమనియే యేల యర్థముకాదు?' అని యాక్షేపమేని, "నుడితొలి హ్రస్వంబు", "ప్రాంతాదుల తొలియచ్చు" ఇత్యాది బాలవ్యాకరణ వ్యవహారంబుం బరికింపుఁడు.

మఱియు నొకవింత—'ఒకేవిభక్తి' యఁట! ఇదియు ౧౫-వ సూత్రములోని 'క్త్వార్థక యికారము' వలె 3-వ ఫారము (=తరగతి) 'బాయి' (=విద్యార్థి) తెలుఁగే.

మఱియు, ఈ 3౨-వ సూత్రము ఎట్టి ద్వంద్వములకో? అనఁగా తత్సమ తద్భవ దేశ్యశబ్దములలో ఏ శబ్దముల ద్వంద్వములకు? అని ప్రశ్న. మఱియు, ఇందు చెప్పిన గసడదవాదేశము సిద్ధద్వంద్వములకా? సాధ్యద్వంద్వములకా? మిశ్రద్వంద్వములకా? అనియుం బ్రశ్నాంతరము. ఇక్కార్యము ఎట్టి ద్వంద్వములకో జరుగవలసినదో చెప్పనందున ఈ వ్యాకరణముచే, 'రామకృష్ణులు' తప్పు; రామగృష్ణులు ఒప్పు. 'చతుర్వక్త్ర చతుర్భుజ చంద్రచూడులు' తప్పు; 'చతుర్వక్త్ర సతు

ఝషధ్వజ సంద్రమాషలు' ఒప్పు. ఇట్టి సిద్ధాంతములు బాల్యములో నేర్చు బాలురకు మఱి యీ జన్మములో తెనుఁగు కుదురునా?

33. విశేషణ విశేష్యములు చేరిన సమాసము కర్మధారయ మఁట! 'పీతాంబరుఁడు'—ఇది కర్మధారయమా? ఇదియు 'పీతము' అను విశేషణమును, 'అంబరము' అను విశేష్యమును చేరి యేర్పడిన సమాసమే. అయినను, చదివిన పండితులు దీనిని 'బహువ్రీహి' యందురు.

34. "సమాసమున పుంప్వాదేశములకును ఉదంతములకును పరుష సరళములు పరమయినప్పుడు 'ను' అను నాగమంబు వచ్చు" నఁట! ఈ యాగమము ఎట వచ్చును? దేనికి వచ్చును? పూర్వమునకా? పరమునకా? "సరసపు+పలుకు=ను+సరసపు+పలుకు" అనియా? "సరసపు+పలుకు+ను" అనియా? "సరస+ను+పు+పలుకు", లేక "సరస+ను+ంపు+పలుకు" అనియా? లేక, మఱి యిందలి యే యక్షరములకడ నైనను వచ్చునా? పూర్వులు దీనిని నుగాగమ మనిరి. కిత్తయినందున షష్ఠ్యుక్తమునకు కడపట వచ్చినది. ఆ కిత్తును తొలంచినందున ఇన్ని వికల్పములు కలిగినవి. ఇచటి యుదాహరణములయందు 'సరసపుంబలుకు' అని ద్రుతకార్యము కానఁబడుచున్నది. ఈ వ్యాకరణమున 'ను' కారము ద్రుత మెట్లగును?

'తలిరు+బోడి=తలిరుంబోడి' అనియు నుదాహృతము. తలిరు వంటి ముండిత శిరుఁడేని, ముండిత శిరస్కయేని యర్థమా?

తలగొరిగించుకొన్న(బాపన)యతియేని, అట్టి (బాపన) వితంతు వేని యర్థమా?

''అలరుం బోఁడుల లోపల
నలరుంబోఁడుములు నీకు హరిణాంకముఖీ,
తల పూవాడకయుండును
తలపూవు ధరించి వికచతామరసాక్షీ.''

అనుచోటను పద్యాది సమాసమునకు ఇట్లుగాక శృంగారోచితముగా మనోహరముగా అర్థము వచ్చుచున్నదే, అది యేమి? అందురేని: అందు అర్ధానుస్వార మొకటి కలదు. అదియే మాంగల్యము; దానినే ఇటనుం దవిలించిన, ఇఁటను మంచియర్థమే వచ్చును. అటయిన ఈరెండవ తావున 'పోఁడి' శబ్దమా, 'బోఁడి' శబ్దమా? చూడుము శ. ర. 'అలరుఁబోఁడి'. అం దిట్లున్నది:

''దే. వి. (అలరు+పోఁడి) ౧. పుష్పమువలె మనోజ్ఞురాలైన ఆఁడుది. ౨. ఇంతి (ఇట్టితావులయందు పోఁడిశబ్దము పరమగునప్పుడు ఎల్లచో నుగాగమంబని యెఱుంగునది.)''

ఏతదనుగుణముగా శ. ర. లో 'ననఁబోఁడి' యనియు శబ్దము పఠితము. ముఖ్యముగా 'ననఁబోఁడి' నడిమి యరసున్నకే 'అలరుఁబోఁడి' క్రింది కుండలీకృత భాగములోని యుపపత్తి. దానికొఱకే 'అలరుంబోఁడి' జూడుమని 'ననఁబోఁడి'కడ సీతారామాచార్యులవారి హెచ్చరిక. విస్తరభయముచే ఈ 'పోఁడి'కి వ్యుత్పత్తి నిట వ్రాయనైతిని. సీతారామాచార్యుల

వారు కుండలీకరణముచేత 'నసఁబోఁడి' యను సమాసము అలుక్కు కాదనియు అందలి తొలి యరసున్న ద్వితీయా విభక్తి ద్రుతమునకు ఆదేశముగా వచ్చినది కాదనియు, నిజ మతమును దెలియఁబఱిచినారు. వీరేమో ఈ పదము సరళాదియే యని తలంచినారు. అందువలనను. అరసున్నఁ ద్రెంచివైచినందునను, అయ్యమంగళార్థము వచ్చినది. దీనిని 'తలిరుఁబోఁడి' యని దిద్దుకొని సరళమున కుదాహరణముగా "తళుకుంగజ్జెల"ను తెచ్చుకొనవలసినది.

మఱి యీ యాగమములో ఉకారముంచిన ప్రయోజన మేమి? అది ఎచట ఎప్పుడు బయటంబడును? పూజ్యులైన పూర్వవ్యాకర్తలయందు భక్తి లేకున్నను తదేకశరణులు వీరు తత్ప్రసాదిత నుగాగమ వజ్రమణిని స్వీకరించియు అందలి కిత్తును పోవిడిచి మణిని గ్రుడ్డిగవ్వ గావించికొన్నారు.

3౫. ఇందును 'ను'అను నాగమము అనియే యున్నది. సూ. "సమాసమున 'పుం. పు'లకును, ఉకారాంత పదములకును పరుషసరళములు పరంబులగునపుడు 'ను' అను నాగమంబగు." అకిత్కరణ-విత్కరణముల గతిని 3౪-వ సూత్రంబునందుం బోలె నెఱుంగునది.

3౬. 'భిన్నవిభక్తులగు నామవాచకముల సమాసము తత్పురుషము' అని సూత్రార్థము. సూత్రములో 'విభక్తులం గల' అని ద్వితీయ కలదు. 'విభక్తులు గల' యని ప్రథమగా దిద్దుకొనవలయును. మఱి వీరి చిత్తమునకు 'శ్వేతాశ్వము',

'మహారాజు' ఇట్టివి తత్పురుషములుకాక పోయినవి. ఇఁకను 'తత్పురుషస్సమానాధికరణః కర్మధారయః', 'సమానాధికరణ తత్పురుషము', 'వ్యధికరణ తత్పురుషము' ఇత్యాది తత్పురుష సంబంధి వ్యవహారమునకు గతియేమి ?

మఱియొక యద్భుతము—'పితృనాజ్ఞ' యఁట! తెనుఁగులో పితృశబ్దము 'పిత' యగును. 'పిత' యనియే వీరును శబ్దప్రకరణములో (౧౦. సూ.) రూపనిష్పత్తి చేసికొని యున్నారు. పితలు – పితలను – పితయొక్క – పితలయొక్క – అని యిట్లు అదంతముగా నిలుచునుగాని, పితృ–పితృలు–పితృనిన్– పితృనితోడ – పితృని కొఱకుఁ – పితృయొక్క – పితృల యొక్క–అని యిట్లు ఉండదు. వీరికి ఈ విపరీత ఫక్కి యెట్లు తోఁచినదో! ఇఁకను భావ్యార్థకవులు 'రాముని పితృ పది తేరుల దోర' అని కవనము లల్లరా?

రాజు+ఆజ్ఞ అను షష్ఠీ సమాసములో ఉకారాంత పదమున కచ్చుపరంబగుచో 'న అను నాగమంబగు.' ఆపక్షమున 'రాజు+న+ఆజ్ఞ' అనినై 'రాజున యాజ్ఞ' అగును. 'రాజు నాజ్ఞ' కానేరదు.

3౮. ఇందు 'వేల్పుటావు' అను సమాసమున 'వేల్పు' విశేషణమని చెప్పఁబడి యున్నది. అందువలన నిది కర్మధారయ సమాసముగాను 'వేల్పయిన యావు' అని విగృహీతవ్యముగాను వీరి యభిప్రాయ మగపడుచున్నది. ఇది విశేషణమా ? 'వేల్పులయొక్క యావు' అని విగ్రహము కాదా ?

అట్లు విగ్రహింపఁగూడదా? 39-వ సూత్రమున, 'విశేష్యములమీఁదను టు అను నాగమము వచ్చును. చెఱువుటలుఁగు' అని చెప్పిరి గదా. 'వేల్పుటావు'ను ఆ సూత్రమునకే ఏల గోచరము సేయరాదు? సంవాదములం గననగు.

'వేల్పులగిడ్డి' బ్రాహ్మ్యనిఘంటువు. ఈ క్రింది సూత్రము తాడినాడ వెంకయ్య గారిది—"సమాసముల యందు ఉకారాంత పదంబులకు అజాదులగు సమానాధికరణ శబ్దంబులు పరంబులగునపుడు ట కారంబంతాగమంబు గావచ్చును. 'ఉ' చిగురుటాకు కఱకుటమ్ము మొ. చిగురాకనియుఁ గలదు" ఇందులకే ఆంధ్రశబ్దచింతామణి టీక-సంధి. 33. "సామానాధికరణ్యేషూదన్తానాం టుగాగమోఽచిస్యాత్" - 'సామానాధికరణ్యేషు' అను బహువచన స్వారస్యముచేత అసమానాధికరణ శబ్దంబులకును గలుగును. ఉ. వేల్పుటావు ఇత్యాదికము. ఇట్లు సకలభాషావాగనుశాసనులు అసమానాధికరణమని అనుశాసించిన 'వేల్పుటావు' దుర్దైవవిలసిత విశేషంబున వీరి చేతంబడి సమానాధికరణమైనది.

'టు అను నాగమము' - ఇందు ఉకారప్రయోజనము అగపడలేదు. సమానగౌరవమునకా?

39. 'చెఱువుటలుంగులు' - అని విశేష్యముపై 'టు' వచ్చినందులకు ఉదాహరణము. ఇది సాధువా? ఇదియేమి సమాసము? షష్ఠీసమాస మగునెడల, షష్ఠీసమాసమందెల్ల

నీయాగమమువచ్చునా? 'రాజుటాజ్ఞ' అనియుం జెప్పవచ్చునా? 'చెఱువు నలుఁగు' అనిన అసాధువా ? 'చెఱువు - టుదకము' అనవలయునా?

'కర్మధారయమున విశేషణాంత అడలకు అచ్చుపరం బగుచో ద్విత్వటకారము వచ్చును' అని సూత్రార్థము. కడపటి అడ లనుటచే ఉకారాంతములనియెడి నియమము పోయినది. తుది స్వరమేదయినను దానితోఁ గూడిన అడ లకే (అనఁగా ఆమొత్తములకే) ఆదేశమేని, 'కటి+ఆవు'='కట్టావు' 'పోఁడిమైన యింతి'='పోట్టింతి' అగునా ? అట్లే, 'కాఱు+అడవి' 'కాట్టడవి', 'పాడు+ఇల్లు' 'పాట్టిల్లు' అగునా?

పూర్వులు కుఱు చిఱు కడు నిడు నడు అని పదములనే సూత్రముననే నిర్దేశించినారు. దాని నతిక్రమించి వీరు సామాన్యముచేసినందున ననిష్టము లిట్లు ఉద్భవిల్లినవి. తుదియచ్చు మారదేని 'కాట్టియావు'-'పోఁట్టియింత' ఇత్యాది రూపములు గల్గునా ?

౮౦. 'గుణవంత+ఆలు.' ఇట 'గుణవంత' అని తత్సమమెట్లు నిష్పన్నమయినదో ఎఱుకపడకున్నది. 'ఆమె గుణవంత-ఓసి గుణవంతా'-ఇట్టి వ్యవహార మెందేని కలదా ? దానికి గతిచెప్పక దానిపై యాగమము విధించుట యేమి పద్ధతి ?

౮౧. "దేశ్యపదములపై 'ఇల్లు' 'రిల్లు' అగును," అని సూత్రసారము. దీనివలన 'పడుకరిల్లు,' 'వంటరిల్లు',

'మిద్దెరిల్లు'-లోనగు ననిష్టరూపములు కల్గును. పూర్వులు అట్లు కలుగనీయక 'పాద బొమ్మ శబ్దములమీఁద'నని నిర్దేశించిరి.

౭౩. 'పడు మొదలగు ధాతువులు పరములయినచో ప్రథమామువర్ణమునకు లోపపూర్ణబిందువులు వికల్పముగ నగును', అని సూత్రార్థము. దీనివలన, 'అశ్వముపడియె'అనుటకు 'అశ్వపడియె' 'అశ్వంపడియె', 'వృక్షము పడియె' అనుటకు 'వృక్షపడియె' అని యిట్టి యనిష్టములు సంభవించును. తన్నివారణార్థము పూర్వులు "ఈ కార్యము కర్తృవాచి ముపర్ణకమునకు కలుగదు" అనిరి. ఇంకొక విశేషము - ఇందు సూత్రభాగములో 'ముపర్ణకము' అనక 'ము వర్ణము' అన్నందున 'పాముపడియె', 'పాంపడియె', 'పాపడియె' అని యనిష్టరూపములు కలుగును.

౭౪. 'ఏని=ఏన్' అనుట. 'ఏని శబ్దముయొక్క కడపటి యి '(ఇ)' కారము వికల్పముగ లోపించును అని సూత్రము. 'రామునేనిన్+కొల్చెద'='రాముఁనేఁ గొల్చెద' అని వీరియుదాహరణము. సూత్రమునం జెప్పినట్లు ఇకారము లోపించెనేని రెండు నకారములు నిలుచును. 'ఏన్న్' అగును. తర్వాత తుదిదానికి అరసున్న వచ్చిన'రామునేన్ఁ గొల్చెదన్' అగును. ఇది పలుకుటకైనను రాదు. నికారమునకే లోపము చెప్పుదము: అప్పుడు 'ఏన్' అని మిగులును. ఇష్టమే యగును. వారు చెప్పినది పనికిరాదు. చెప్పనిది పనికివచ్చును.

౨౮. 'ఉండుఁడు+ఉండుఁడు = ఉండుండుఁడు' అనుచో సూత్రమున మధ్యమపురుష క్రియల ముడు వర్ణములకు లోపము వికల్పముగా విహితము. వర్ణకములనక వర్ణము లన్నందు వలన— 'ముడువుము+ముడువుము' అనునది 'డువుడువు' అగును. అట్లే 'ముడువుఁడు ముడువుఁడు' అనునదియు 'వుఁవుఁ' అగును. కావున, 'వర్ణకముఁడులకు' అనవలయును. మఱియు సూత్రమున డులోపమే ఉక్తముగాని, దానికి పూర్వ ముండుండు నున్నను లోపము ఉక్తము కాదు. ఆ చెట్టను నెట్టుటకై చిన్నయసూరి 'మధ్యమముడుజ్ఞులకు' అని జిత్తుంగూడ చెప్పెను. 'మధ్యమ' అనఁగా 'మధ్యమపురుష విహిత' అని యర్థము

౨౯. చేసితివి=చేసితి, చేయుదువు = చేయుదు. సూత్రమున భూత తద్ధర్మార్థక క్రియల మధ్యమ పురుష వివు వర్ణకములకు వైకల్పికలోపము విహితము. ఇవి సకలధాతువులకును నిమిత్త నిరపేక్షముగా వచ్చెడు రూపాంతరములు. వీనిని క్రియాపరిచ్ఛేదముననే పూర్వులు చెప్పిరి. రూపాంతరములను సంధిప్రకరణములోఁ జెప్పుట లాఘవార్థమేని, లాఘవము నతిక్రమింపకయే ప్రసక్తమయిన ప్రకరణమందే చెప్పుట యొప్పును. కానిచో వనము, వనమ్ము, వనంబు అను నిత్యాదుల నెల్ల ఈ ప్రకరణముననే చెప్పవలదా ?

మఱియొక విశేషము—ఈద్వైరూప్యము క్రియాప్రకరణములో ఆయాకాలము క్రింద ప్రదర్శితమే. (చూ. క్రియా. ౧౦.) పైగా నిట ఈ పిష్టపేషణ మేల ?

౫౧. ఇందు సమాసమున అది అవి శబ్దముల మొదటి యచ్చునకు లోపము వికల్పముగా విహితము. సూత్రములో 'మొదటి య (అ) కారమునకు' అని యున్నది. 'మొదటి' అనుట యనావశ్యకము. ఏలన-ఈ శబ్దములలో మొదటఁగాక ఒండెడ అకారము లేదు. పైగా, ఇందు వికల్పమన్నారు. అందువలన 'వచ్చు+అది' అనుచో 'వచ్చునది' అని తద్ధర్మార్థకో కారముపై ను అను నాగమము వచ్చునా, లేక, ప్రతిపదోక్తమయిన తచ్ఛబ్దాకార ప్రయుక్తలోపముచే 'వచ్చుది' అని యగునా? అనిష్టరూప నివారణార్థమై పూర్వులు బహుళ మనిరి.

౫౨. 'నా నీ శబ్దములకు సమాసమున ఉత్తరపదము పరమైనచో దువర్ణకము వికల్పముగా నాగమంబగు' నని సూత్రము. ఎచట ఆగమంబగు? నా+నేరము, నీ+కరుణ—ఇవి దునా నేరము, దునీ కరుణయగునా? కాకుండుటకై తొంటిపెద్దలు దుగాగమంబనిరి. మఱియును ఆగమము అన్నం జాలదా? వర్ణకమనియుం జెప్పనేల? వర్ణమన్నం జాలదా? అన కున్నం జాలదా?

౫౩. చనిన=చన్న. ఈ రూపాంతరములను క్రియా ప్రకరణమందే చెప్పుట న్యాయము. చనును నకు తద్ధర్మమున మధ్యమస్వర లోపమనియు నిందు ఉక్తము. 'చనును+ఎ = చన్నె, చనునే' అని యుదాహరణములు. ఇట ఎ ఏ లేల? ఆ ఎ లేక తద్ధర్మరూపము కాదా? చనును 'చన్ను' అగునా?

కాదేని అగుననుట యెట్లు? ఎ ఏలు పరమయినప్పుడే అగునేని, అట్లని సూత్రముననే చెప్పరాదా ?

౫౫. 'పదంబు నడిమి నరలడల యుత్తునకు లోపము వికల్పముగా నగును' అని సూత్రార్థము. ఈసూత్రమువలన మానుషి, తరుణి, తలుని, గడుల ఇత్యాదులు వికల్పంబుగా మాన్షి, తర్ణి, తల్ని, గడ్ల ఇత్యాదులుగా మాఱును. అట్టివి అనిష్టములని పెద్దలు చెప్పుదురు.

౫౬. ఇది ఇకారలోప సూత్రము. ఇటను, 'పదంబుల నడుమ' అని యున్నది. ఏపదములలోనో తెలియకున్నది. జనిత, కరిణి, పాలిత, తాడిత అనునవి, జన్త, కర్ణి, పాల్త, తాడ్త అనియు నగు. ఒక్కొక్క సూత్రమును అనిష్టముల పుట్టగా నున్నది.

౫౭. ఈసూత్రమున 'దేశ్యపదముల కడపటి నలడర టల యు (ఉ) త్వము వికల్పముగా లోపించు' నని యున్నది. ఇందువలన, — ఇది నీకఱ వానిక నెరియుచున్నది; వాఁడు నాకు 'తోడ్'; నీకిది 'చేట్' అను రూపములు కలుగును. ఇందు ఈ యుత్వలోపము దేశ్యపదములకే చెప్పఁబడినది. అటుమున 'నీర్వామి' (= సముద్రము) 'కటి మీఁద ముదుక నీర్కావిదోవతి పింజ' (వై. భా.) 'తనువు మీఁకొప్పలవల్చు జాలారిదాన' (భార.) 'సంగరోత్సవోద్భవరభ సాతిరేకము బయల్పడు టించుక లేక' (భాగ.) అను ప్రయోగములందు తద్భవములయిన నీరు, మీను, బయలు శబ్దము

లందలి యు (ఉ) లోపము దుష్టమా? 'తద్భవములకు వేఱు సూత్రము చేసెదము' అందురా? అట్లేల? ఇందే 'తద్భవ' శబ్దమును చొప్పింపరాదా? లేక 'సమేతరమందు' అనరాదా?

౬౦. అను విను మొదలగు ధాతువులకు అని సూత్రారంభము. కను, కొను, తిను, మను అను నాలుగే ఆ మొదలయినవి సులువుగా వానిని సయితము సూత్రముననే చెప్పియుండవచ్చును. ఆ ధాతువులకు చువర్ణకము పరమయినప్పుడు కడపటి యుత్తు వికల్పముగా లోపించునఁట—అగుఁగాక, ఈ సూత్రమువలన అను ధాతువునకు చు వర్ణకము రాఁగా, 'అనుచు' అగును. అనంతరము ఉ లోపము వికల్పముగా నయిన 'అన్చు' అని యొకరూపము, 'అనుచు' అని యొకటియు నేర్పడును. 'అన్చు'లో శేషించిన నకారము బిందు వగునఁట. (పూర్ణ బిందు వనవలసినది.) ఆ బిందువుచేఁ 'అంచు' అగును. ఈ బిందువు వైకల్పికము కాదు గావున 'అన్చు' అను రూపాంతరము ఉండదు. కావున 'అనుచు'— 'అంచు' అని రెండే రూపములగును. బాలవ్యాకరణముచే త్రైరూప్యము సిద్ధించును. '' 'అన్చు' అను రూపము నిలువ దేని వ్యాకర్త దానిని కల్పించునా? ను వర్ణమునకే వికల్పముగా బింద్వాదేశమును చెప్పఁడా? అందువలన ఆ రూపము కూడ నిలుచునట్టిదే యని తెలియును గావున సూత్రమున వికల్పశబ్దమును ప్రయోగింపలేదు'' అని భాష్యము పల్కుడు రేని, 'పూర్ణబిందువు' అనుటకే తెలియక 'బిందువు' అన్న

తాము పైభాష్యము రచించుకొనుపాటి ప్రతిభ తమ విద్యార్థికి ఉండునని తలంచుట వింతగాదా ? కావున 'వికల్పముగా' అని సూత్రములోనే పఠించికొనుట యుచితము.

౬౧, ౬౨, ౬౩. ఈ సూత్రములను ఆడంబరముగా కల్పించుటకు మాఱుగా ఈ పదములకు ఈ యీ రూపాంతరములు కలవు అని తెల్పినం జాలును.

"అటు-ఇటు-ఎటు అను పదములకు లు వర్ణకంబు పరంబగునపుడు టు వర్ణము యొక్క యుత్వము వికల్పముగ లోపించును" అని ౬౧-వ సూత్రము. ఇచట ఈ పదములకు లు వర్ణక ప్రసక్తి యెట్టిదో వ్యాకర్త చెప్పలేదు. లు వర్ణకము అనుటచే ప్రథమా బహువచనము తోఁచుచున్నది. "బహువచనమునందు డలటరల యుత్వంబునకు లోపము వికల్పము." అని బాలవ్యాకరణము ఆచ్ఛిక సూ. ౧౨ అట్లుండ, ఈ మూఁటికిని విశేషించి యిటం జెప్పుటకు నిమిత్త విశేష మగపడలేదు. పాటు కాటు, చేటు, చెట్టు, దాటు అను వీనికెల్ల బహువచనమున పాట్లు, కాట్లు, చేట్లు, చెట్లు, దాఁట్లు అను రూపములందు ఉత్వలోపము ప్రసిద్ధమే గదా ! కావున ఈ ౬౧ వ సూత్రము అప్రసక్తమే. విశేషాధాయకము కాదు.

సంజ్ఞ ౩౧-వ సూ. లో అట్లు, ఇట్లు, ఎట్లు అని పఠితము లయిన పదములకు ఇది వ్యుత్పత్తిప్రక్రియాప్రపంచనముగానున్నది. సరిగా చెప్పిన అట్లు, ఇట్లు, ఎట్లు మొదలు

ఆచోటు, ఈచోటు, ఏచోటు వఱకు శృంఖలంజెప్పఁదగును. ఆచోటు, అచ్చోటు, అచ్చొటు, అచ్చటు, అచటు, అటు, అటులు, అట్లు—ఇట్లే ఈచోటు.........ఇట్లు; ఏచోటు .........ఎట్లు. ఇందులో తుది లంకెను మాత్రము విడఁదివి చిన నేమాయె. పైనిచెప్పిన పాట్వాదులయందు సామాన్యముగా బహువచనములో ఉ లోపమగుట నెఱుంగమి యొక్క విలసితముగానున్నది. దీనిని మాని ఆడలటరలయుత్వ లోప సూత్రమును వాక్రుచ్చిన శ్రేయముగా నుండెడిని. అట్లు చేయమిచే ఈమూఁటందప్ప కడమనామములందు ఈ యు (ఉ) లోపము రాదని యుపదేశము గమ్యమగును. అందువలన ఆ రూపములెల్ల అసాధువు లయ్యెడిని.

౬౪. మధ్యమపురుషయోగంబున ఆరగాగమము వైకల్పికమనుట. దీనిని సంబోధనంబున ఆరగాగమమును జెప్పు చోటనే తెలుపుట శ్రేయము.

.. ఆ ఈ ఏ అను సర్వనామములమీఁది హల్లునకు వికల్పముగా ద్విత్వము వచ్చి ఇవి హ్రస్వములగుట - ఈ సూత్రాంశముచేత 'ఆబ్రాహ్మణుఁడు' అనునది 'అబ్బ్రాహ్మణుఁడు' అగును. తన్నివారణకై 'అసంయుక్త హల్లునకు' అన వలయును.

౬౭. "అనుకరణంబున నమశ్శబ్దవిసర్గకు లోపమేని, ఓత్వమేని వికల్పముగా నగు" ననుట. ఈసూత్రమువలన, 'నమః+అనియె' అనియుండఁగా విసర్గకు లోపమురాఁగా 'నమ

అనియె' యయి యడాగమముచేత 'నమ యనియె' అగును. ఇది యొకరూపము. ఇది రాకున్న 'నమః అనియె' అనియే యుండును. ఇది యింకొకరూపము. ఈ రూపమున ఆ విసర్గకు ఓత్వమువచ్చిన, 'నమ+ఓ+అనియె' అని అలౌకికవాక్యమయి, పిమ్మట, యడాగమములచేత 'నమయోయనియె' అని మూఁడవరూపము సిద్ధించును. ఇది అనిష్టరూపమనియు 'నమః అనియె' అనునది ప్రకృతిభావ ప్రస్తావములేని యిచ్చోట అనుపదేష్టవ్యమనియు, అప్రసక్తమనియు చెప్పవలయునా? పూర్వుల వ్యాకరణములచేత 'నమయోయనియె' అను రూపము ఘటిల్లదు. ఇందువలన అక్కఱకురాని దొకటియు, విపరీతమొకటియు వచ్చినవి. అక్కఱకు వచ్చు రెంటిలో 'నమ యనియె' అనున దొక్కటియె దీనం గుదిరినది. 'నమో యనియె' అనురూపము ఆవశ్యకమయినట్టిది యీ గంధర్వ కోలాహలములో కాందిశీకమైనది.

ఉదా. 'అనుకృతిని ఉదంతపదములకు విసర్గలోపము వు అను నాగమంబును వచ్చును' అని సూత్రము. 'శంభుః+ అనియె' అను వాక్యము విసర్గలోపముచే 'శంభు+అనియె' అగును. అనంతరము ఆగమముచే నేమగును? 'వుశంభనియె' అగునా? కాదు. కాదని యెట్లు తెలియును? అది తెలియుటకే పూర్వులు వుగాగమ మనిరి.

ఇది సంధిప్రకరణము.

# శబ్ద ప్రకరణము

౧. 'పురుషవాచకములను బోధించు నామములు పుంలింగములు. స్త్రీవాచకములను బోధించు నామములు స్త్రీలింగములు. స్త్రీ పుం వాచకములు కాని నామములు నపుంసకలింగములు.'

అని లింగ సంజ్ఞాభేద విధాయక సూత్రము. 'వాచకములను బోధించునామము' లంట! నామమే వాచకము, వాచకమే నామము. ఇదియుం దెలియదే! 'పురుషనామములు పుంలింగములు, స్త్రీనామములు స్త్రీలింగములు, ఇతర నామములు నపుంసకలింగములు, అని వ్రాసికొనరాదా?—ఈ లింగ సంజ్ఞ సంస్కృత వ్యాకరణములోనిది. ఇట వీరు దానిని అర్థభేదమునకు ఈడ్చుచున్నారు. సంస్కృతమున లింగమునకు అర్థముతో కొన్నిచోట్ల సంబంధము కలదు. కొన్నిచోట్ల లేదు. వృక్షః (=వృక్షము) పుంలింగము; కళత్రమ్ (=భార్య) నపుంసకలింగము: మిత్రమ్(=చెలికాడు) నపుంసకలింగము; లతా (=తీగ) స్త్రీలింగము. ఒక వస్తువునకే వెవ్వేఱులింగముల పదములు నామములగుటయుం గలదు. కొమ్మకు 'విటపః' (పుంలింగము) ఒకపేరు, 'శాఖా' (స్త్రీలింగము) మఱియొకపేరు. ఇట్లుండ ఈ వ్యాకర్తగారు సంస్కృతవ్యాకరణములోని లింగసంజ్ఞను సంగ్రహించి, దానికి ఇంగ్లీషు(Gender) మర్యాదకు అనుగుణమైన వ్యక్తిభేదోచితార్థమును కూర్చి

అప్పటికిని సరిపడక మహదమహత్సంజ్ఞలనుంగూడ చేర్చుకొని ఈభాగమును చిక్కులపాలు గావించినారు. వీనిని అసంకీర్ణములనుగా నుంచుట మహోపకారముగా నుండును. మహదమహన్మహతీ సంజ్ఞలచేత ఇంగ్లీషు మర్యాద కొంత యలవడును. ఇంగ్లీషు లింగము సూత్రములలో లేనిచో అంత దానం దీఱును. సంస్కృతలింగమే రూపనిష్పత్తికి వలసియున్నది. కానిచో 'పద్మలత మనోహారిణి' అను వాక్యమున 'మనోహారిణి' అని స్త్రీత్వ మెట్లు వచ్చును? ఇట వీరి ఫక్కి కావలసినది మాని అక్కఱలేనిదానియందు విజృంభించుట యైనది.

౨. 'ఒక వస్తువుం దెలుపు పదము ఏకవచన' మఁట! 'ఒకటి' యను పదము నట్టిదే. దానికా ఏకవచన మని పేరు? 'పెక్కు వస్తువులం దెలుపుపదము బహువచన' మఁట! 'సేన' పెక్కువస్తువులం దెలుపును. అది బహువచనమా? అట్లే 'మంద', పూర్వులు పదమునకు ఆసంజ్ఞయిడక ప్రత్యయమున కిడిరి. ఏమన్నను నిరాక్షేపము! అంతయు సబ్బుండా!

3. 'నామవాచకములును, సర్వనామములును సందర్భానుసారముగా ఆయా విభక్తులయందు వాడంబడును'— అని సూత్రార్థము. వీరు నామవాచకములు సర్వనామములు అననేవో ముందు తెలుపకయే, ఈపాత్తములో ఎటనుం దెలుపకయే, ఇట్లు సూత్రము నారంభించినారు. సందర్భానుసారమఁట! విభక్తులు సంబంధవిశేషమును తెలుపును. 'సంబంధ' అనవలసినది. 'ప్రథమ మొదలగు నేడు విభక్తులం గలిగి'—

ఈ తూలేల? 'విభక్తులను గలిగి'—'విభక్తులను' అని ప్రథమ తాస్థిన ద్వితీయ వే.ల; 'నినులకూర్చ్న ద్వితీయావిభక్తి'—ఇవి అన్నియు కళలా? కానిచో కానివానిని తుది ద్రుతముతో నే పఠి పమికి కారణమేమి?

ర. 'పుంలింగములగు పదములు మహద్వాచకములు, పుంలింగములు కానివి అమహద్వాచకములు' అని సూత్రము. ఈ గొడవ యేల? పురుషవాచకములు మహత్తులు, తద్భిన్నములు అమహత్తులు అని చెప్పకోరాదా? ఈ లింగప్రస్తావమేల? ఇట నభిప్రేతము ఏలింగమో ఇంగ్లీషులింగమా? సంస్కృతలింగమా?

'ఇకారాంతములు కాని పదములకు మహద్వాచకమునకు బిందుపూర్వక డువర్ణకం బగు' అని యున్నది. పదమనంగా వాచకమే. వాచకమే పదము. 'ఇకారాంతములు కాని మహద్వాచక పదములకు' అనిన అర్థముండును. 'డువర్ణకంబగు' అని విధానము. కాని అది యెక్కడ నగు? ఆదిలోనా? అంతమందా? ఎటనేనియునా? ఈ సూత్రముచేత గ్లా శబ్దమునకు 'గ్లాండు' అని లోకాతీత రూపము కలుగును. 'గ్లా' అనియే పెద్దలు ఒప్పిన రూపము. ఈ సూత్రముచేత 'అన్న' అను పదమునకు 'అన్నండు' అని ప్రథమైక వచనాంత రూపము కుదురును. అట్లే 'రాముండుండు' (రూ. 'రాముండుండు') ఇత్యాదులును కుదురును. ఇది సూత్రమున పద శబ్దము ప్రయోగించుకొన్న స్వారస్యము.

౫. ఈ సూత్రముచేత అదంత తత్సమప్రాతిపదికము యొక్క అత్వమునకు డు విభక్తికి ముందు ఉత్వాదేశము చెప్పఁబడినది. ఈ వ్యాకరణమువలన తత్సమములలో ప్రాకృత సమములు చేరలేదు. (చూ. సంజ్ఞా. 78 సూ.) అందువలన 'జముఁడు' అను రూపము దీనిచే సిద్ధింపదు. 'జమ అని ప్రాకృత ప్రాతిపదికము – అకారాంతము, యమవాచకము, యమసమము.

౬ 'ఇకారాంత మహద్వాచకములకును స్త్రీవాచకములకును వచ్చిన ప్రథమైకవచన ప్రత్యయము లోపించు' నఁట. వీరు పదమునకే ఏకవచన బహువచన సంజ్ఞలం బెట్టినారు. (చూ. ఈ ప్రకరణమే 2 వ సూ.) ఇట ప్రథమైక వచన ప్రత్యయమనుచున్నారు. పదమే ప్రత్యయమా? ప్రత్యయమే పదమా? ఏ ప్రత్యయము ఏవచనమును సూచించునో వీరు తెలుపలేదు. బిందుపూర్వక డువర్ణకమును ఇకారాంత భిన్న మహద్వాచకములకు ౭ వ సూ. లో విధించినారు. మఱి ఇకారాంతముపై ప్రథమైకవచన ప్రత్యయము పూర్వము వచ్చినంగదా, లోపము చెప్పుటకు? అచట అని దంతములకు బిందుపూర్వక మనుటచేత తదితరములకు ఆ బిందు పూర్వక డువర్ణకమేని డుమువులలో నేదేనియు రావచ్చునందురా? అట్లు తలంచుటకు అవకాశమీయక వీరే హరి+ఁడు,=హరి, శౌరి+ఁడు=శౌరి అని ఆ ప్రక్రియను భంగపఱిచినారు. ఇట, ఁడు ప్రత్యయమునకు ప్రసక్తి యెక్కడిది?

౭ వ సూత్రములో ఇకారాంత మహద్వాచకములు పర్యు దస్తములు గదా. ఇటనుంగూడ 'హరి+ఁను' అని ఁడు ప్రత్య యమును చూపుటచేత విభక్తులలో పఠితమైన డున్వరమే యని తలంపనైయున్నది. కనుక ఈచోట ఁడుప్రత్యయమును తల్లోపమును చూపుట యసమంజసమే.

'లక్ష్మి'—దీనిమీఁద లోపించిన ప్రథమైకవచన ప్రత్య యము ఏది? ము వు లలో నొకటి కావలయును. ఇకారాంత మహత్తులమీఁద ఈలోపము రాదని యీ సూత్రమువలన నేర్పడును వారి(=జలము) అనునది ౭ వ సూత్రముచేత 'వారిము' అగును.

౭. నపుంసక ప్రథమైకవచనమునకు మువర్ణకం బగు నఁట. ఇటను లింగసందేహము కలదే. ఇచ్చిన యుదాహర ణము వనము. అదంతములకే మువర్ణకమని తలంచితిమి. ఇట ఆ నియమము నిరస్తము. కావున కుక్కము, పిల్లిము, విల్లు ము, రోలుము, రోఁకలిము ఇత్యాదుల పంటపండును. ఇవి నపుంసకము లనుటకు ౭–౯ వ సూ. చూడుఁడు. మఱియు నిఁట మువర్ణకమునకు 'మ్ము' ఏని 'ంబు' 'ఏని అగునఁట. అట్ల నుటచే మువర్ణకము నశించును. వనమ్ము, వనంబు అనియే నిలుచును గాని 'వనము' అను రూపము ఉండదు. కావున 'విభాష'నని సూత్రమునం బఠించుకొన్న, భావము సుగమము గా నుండును. ఈసూత్రముచేత 'వారిము'(=జలము), 'భేరిము, దుందుభిము, పవిము, అళిము, అహిము' ఇత్యాది రూప

ములు కలుగును. ౮, ౯ సూత్రములలోనుంబోలె ఇందును పదములకే విభక్తిని విధించినారు. విభక్త్యంతమునకు పదమని పేరు గాని ప్రాతిపదికమునకుం గాదు. అందువలన ఇప్పటికి ఈమూఁడు సూత్రములవలనను—రాముఁడుఁడు, గురువుఁడు లేక గురుఁడుఁడు అని రూపసిద్ధియగును. "సుప్తిఙన్తం పదమ్" అన్నముక్కను కొంచెము పఠించుకొన్న బాగుగా నుండును. పదములకు అనుటకు మాఱు ప్రాతిపదికములకు అని మార్చుకొనుట మంచిది. "అదేమి, ఆధునిక సహజపాండిత్యులు-బంధువుఁడు, శత్రువుఁడు, అని ప్రగల్భించుట లేదా ? దానినే ఏల స్మరించుకొనగూడదు?" అందురా? అట్లే చేయుఁడు; కాని బాలురకు మాత్రము అట్లు నేర్పకుఁడు.

ఉకారాంతంబు లయినందున ౭వ సూత్రమున ఆక్షిప్తమయిన మువర్ణకము రోలు విల్లులకు రాదు.

సూ. ౧౦—ఈవ్యాకరణముచేత ఉదంత గోశబ్దములకు ప్రథమైక వచనముగా వువర్ణకము వచ్చునేగాని, ప్రథమ బహువచనమందును కడమ విభక్తులందును వుగాగమము రాదు. అందువలన ధేనులు, ధేనులన్, ధేనులచేతన్ అను రూపములు కలుగును. అది దైవవశమున అనుకూలమే అయినది. అంతటితో పోక గోలు గోలన్, గోలచేతన్ ఇత్యాద్యనిష్టరూపము లుద్భవించుచున్నవి. మఱియు, ధేనువులు, ధేనువులన్, ధేనువులచేతన్, గోవులు, గోవులన్, గోవులచేతన్ ఇత్యాది సాధురూపములు నష్టమైపోవును.

మఱియు, వీరు ౯ వ సూత్రములో వువర్ణకమును గోశబ్దమునకు మాత్రమే చెప్పక, ఓకారాంతమాత్రమునకెల్ల చెప్పినందున రోవు అని (ధనవాచకము) అనిష్టరూపము నుపదేశించినవారయినారు.

ఇట ప్రథమైక వచనమున మాత్రము మువర్ణకము విహితము. ప్రథమా బహువచన ప్రభృతిరూపములయందు తత్స్థానమున మువర్ణకమును చెప్పలేదు. అందువలన, వనలన్, వనలచేతన్, అను నిట్టి యనిష్టరూపములేగాని వనములన్, వనములచేతన్, ఇత్యాదులు రావు. అట్లే తద్విపరీతముగా పేలన్, పేలచేతన్, ఇట్టివి వలసినవి పుట్టవు. పేలుచేతన్, పేలున్, ఇట్టిరూపములు కలుగును. (చూ. ౨౬ శబ్దప్రకరణము.)

౯. 'ఉకారాంత మహద్వాచకములకు ప్రథమైకవచనమున బిందుపూర్వక డువర్ణకంబు వికల్పముగా నగు' ౮ వ సూత్రములో ఉకారాంతపదములకు ప్రథమైకవచనమునందు వువర్ణకము విహితము. ఇట ౯ వ సూత్రముక్రింద వృద్ధశబ్దమును ఉకారాంతముగా నుదాహరించియున్నారు. దానింబట్టి ఈసూత్రముచేత 'వృద్ధువు' అని యొక రూపము వచ్చుచున్నది. వీరికి 'వృద్ధు' అని యుకారాంతశబ్ద మెట్లు వచ్చినది? ఇది పదమా? ప్రాతిపదికమా? ఈప్రక్రియ ద్రోహముగా నున్నది. ఈ సూత్రమునకు వలసినట్లు వృద్ధశబ్దము ఉదంతమయేని 'వృద్ధువు' అనురూపము రావలదా? దాని నెట్లు నివా

రింపనగు? ఇట 'హూహువు' 'హూహుఁడు' అని యుదాహరించుకొన్న సాధువుగా నుండును. గుఃశబ్దము చాలదా?

౧౦. 'ఓకారాంత శబ్దములకు ప్రథమైకవచనమునకు వువర్ణకము వచ్చును.' ఇందువలన 'ద్యోవు' అని స్వర్గవాచి యొకటి లభించును. దీనిని చిన్నయసూరి చెప్పనేరఁడాయెను.

౧౧. అమహచ్ఛబ్దములకు మహద్వివక్ష యందు డుజాదు లగునఁట. ఇందులో సూత్రాక్షరములో అనావశ్యకముగా, అర్థము తెలియకుండునట్లుగా – లింగప్రస్తావము చేసినారు.

౧౨. ఈసూత్రముచే రై, నౌ, భూ, దివ్ శబ్దములకు రో, నావ, భువి, దివి, అను రూపములు కుదిరినవి. కాని వీనిపై డుమ్వాదులు ఏలరావో ఎక్కడనుం జెప్పలేదు. దానంజేసి రోవు, నావము అను రూపములు నిరాఘాటములు. ఇట సూత్రములో 'సంస్కృతపదములగు' అనియున్నది. అది సరిగాదు. 'సంస్కృత ప్రాతిపదికములగు' అనవలయు. వీనిలో 'రో' పుంలింగము. కడమవి స్త్రీలింగములు. ఈ వ్యాకరణమున అన్నియు నపుంసక లింగము లేల? వీనికి భువిము, దివిము, నావము అను రూపములు ౭–౧౦ సూత్రములచే వచ్చును.

౧౩. 'కుశాదులకు మువర్ణకంబు రాదు' అని సూత్రము. మువర్ణకప్రసక్తి నపుంసకలింగ మగుటచేత, అట్లని 7–వ సూత్రమునం జెప్పఁబడినది. లింగమే కారణమయినది.

ఈ లింగ సాంకర్యముచేత పండితులు సైతము శబ్దముల వాస్తవ లింగమును మఱతురో అని వెఱవఁదగియున్నది. కుశ శబ్దము పుంలింగము. "ఇమే కుశాః", అంతట అమహత్తులన రాదా? ఈ పాడులింగ మేల?

౧౮. 'ఋకారాంతము లగు విధాత్రాదులకు ఉువర్ణకంబు వికల్పంబు' అని విధానము. ఈ విధానము మహదర్థమందేగాని అమహదర్థమందుఁ గాదు. ఆ భేదమును వీరు తెలుపలేదు. అమహదర్థమున విధాత, సవిత అనియే యగును. ఉ. పెద్దల నధిక్షేపించిన పాపమే యీ కష్టములకు విధాత. ఈ సుఖమునకు మా పురాకృతపుణ్యమే సవిత. కావున 'మహదర్థకములగు విధాత్రాదులకు' అని సూత్రమును రచించుకొనవలయును. మఱియు. 'ఋకారాంతము లగు విధాత్రాదులు' అని యల్లిక! ఋకారాంతములుకాని విధాత్రాదులు వేఱే కలవా! అనావశ్యక లింగమును తెచ్చుకొనుటకన్న 'విధాత్రి' 'సవిత్రి' అను రూపములకు సంస్కృతలింగమును అసంకీర్ణముగా స్పష్టముగా వ్యవహరించుకొన్న శ్రేయముగాదా?

౧౯. 'సంస్కృతపదములు' అని ప్రయోగము. సంస్కృతప్రాతిపదికములు అనుట సరి. కానిచో 'రాజా' అనునది 'రాజ' అగునా? 'ఆయన దొడ్డరాజ' అనవలయు [రాజు అనుటకు ఈ వ్యాకరణమున గతి నరయుచున్నాఁడ.] 'సంస్కృత ప్రాతిపదికముల తుది దీర్ఘము ఇందు. హ్రస్వమగును.' అని

సూత్రాభిప్రాయము. దీనినే రబ్బరుగాను తప్పగాను లాగిన 'దీర్ఘాంతములగు సంస్కృతపదములు తత్సమంబున హ్రస్వాంతము లగును' అగును. ఇందు 'తత్సమంబున' అనుట అనావశ్యకము. 'సంస్కృత' అనుటచే అది గతార్థము. అదియు వలవదు. 21-వ సూత్రములో దేశ్యములకు నిషేధము కలదు గావున, అట్లయిన ప్రాకృతసమములకును తద్భవములకును ప్రసక్తింపదా యనిన ప్రాకృతసమములకు ప్రసక్తింపవలసినదే. వానికిని ఈ విధి చెల్లవలసినదే. తద్భవములను తప్పించుట యెట్లు? సూత్రములో "దేశ్యతద్భవములందుఁగాక" అని ఘటించికొన్న నిర్బాధము.

౨౦. ఇందును పదములనుట సరిగాదు. నామము లన వచ్చును.

౨౧. 'లకోరి' హ్రస్వముగాదని వీరి మాట. మనుచరిత్ర టీకాకారులయిన జూలూరి అప్పయ్యపతులవారు అగునని చెప్పి అందులకు 'కోయిలకోయిలకోలకోరికో' అని యుదాహరించినారు.

౨౨. రాములు, ధనములు, అని బహువచన నిష్పత్తి. ఇందును 'పదములు' అనుట సరిగాదు. ఇటలాంతేతర ప్రకృతులపై బహువచనమునందు లు విధానము, 'రాముఁడు' రాములు' అని యుదాహరణము. ఇది అదంతము రామశబ్దము, రాముశబ్దము గాదు. ఈసూత్రముచేత రాములెట్లగును? సూత్రము–'లకారాంతములుగాని పదముల ప్రథమా బహు

వచనమునకు లువర్ణకంబగు.' 5-వ సూత్రములో అకారాంత తత్సమమునకు డువర్ణకమునకు ముందు ఉత్త్వము విహితము గాని ఒండు ప్రత్యయములు పరమయినపుడు విహితముగాదు కావున 'రాములు, రాములన్ అను నిత్యాది రూపములు ఈ వ్యాకర్తకు సమ్మతములే గాని రాములు రాములన్ ఇత్యాదులు ఈయనకు పనికిరావు' అని చెప్పవలసి యున్నది. అనఁగా ఈ సాధురూపములు ఈ వ్యాకరణమునకు విరుద్ధములనుట.

'లాంతేతర'—లాంతపర్యుదాస ప్రయోజనము 22-వ సూత్రమునం దెలియును. 'తత్సమమున లాంతముపై ప్రథమాద్వితీయాలులలకు రురలగును.' అని సూత్రార్థము. అందువలన 'చతుష్షష్టికళరు,' 'సాలగ్రామశిలరు,' 'ఈ మణుల వెలరు' ఇత్యాదులు సంభవించును. బాలురు ప్రథమ, బాలురన్ ద్వితీయ; ఇఁకను తృతీయాది బహువచనములు ఎట్లు? బాలులచేత అనవలయునా? ఈ వ్యాకరణముచేత ఇట్లే అనవలయును. పూర్వుల వ్యాకరణములచేత 'బాలురచేతన్' ఇత్యాది రూపములే అగును. ఇందు రేఫాదేశము తృతీయాదులందు చెప్పలేదు. లాగమమునే చెప్పినారు. ఇదిగాక దీని వలన 'బాలరు' అగునేగాని 'బాలురు' కానేరదు.

౨౮. నెయ్యురకును, పగతురకును బాలురగతియే.

౨౯. 'దేశ్యపదములు'— 'దేశ్యములు' అనవలయును. ఏలన 'ద్రు' సూ. 'దేశ్యపదములగు కాఁడు ప్రత్యయాం

తములకును, ఆలు శబ్దమునకును బహువచనమునం బూర్ణ బిందుపూర్వకంబును రేఫయుతంబును నగు డు వర్ణకంబగు.''
ఈసూత్రముంబట్టి విలుకాఁడు+ండుర్ = విలుకాఁడుండుర్, ఆలు+ండుర్=ఆలుండుర్ అను రూపంబులు సమకూడును. డు వర్ణకమనుటచేత 'డు' ఒక్కటే మొత్తముగా నుండవలయును. రేఫము డకారమునకును ఉకారమునకును నడుమం జొరదు. ద్వితీయాదులయందు విలుకాఁడునకుᳯ, విలుకాఁడుండుర్కుᳯ, ఇట్టివే భూత ప్రేత పిశాచములు బయలువెడలును.
వేఁటకాఁడు మొదలయిన కాప్రత్యయాంతములకు 'వేఁటకాండ్రు' ప్ర. బ. వ. రూపము సిద్ధింపదు. (చూ. ౨౫ శబ్దప్రకరణము.) వేఁటకాండ్రచేతᳯ, విండ్లచేతᳯ, ఆండ్రచేతᳯ ఇత్యాదిరూపములకు ఇందు గతిలేదు. ఇళ్ళు, తాళ్లచేతᳯ లోనగునవియుః ఎన్నిటి నుదాహరింతుము. ఎట్లన-కాడ్వంతాలులపై బ. వ. నందు 'ండ్రు' అగును అని సూత్ర (౨౫) భావము. అందువలన విలుకాఁడుండుండ్రు, ఆలుండ్రు అగును; మఱియు 'సాహసగాఁడు' దేశ్యముగాదే గాండుండ్రుగాని గాండ్రుగాని ఎట్లగును? ఈ సూత్రము కాఱడవిగా నున్నది. విస్తర భయము.

మఱియు నీసూత్రముచే పూర్ణబిందు పూర్వకమును రేఫయుతమును అగుడువర్ణకము విహితము. అట్లన-'ండుర్' అగును గాని 'ండ్రు' గాదు. బిందుపూర్వకత్వమును రేఫయుతత్వమును డుకారమునకే గాని డకారమునకుఁ గావు. కావున 'ండుర్' అగును. గొడ్లం దోలం బనికివచ్చును.

౨౬. 'పదములకు' అనుట సరిగాదు. 'నువర్ణాంతపదము లకు' అన్న నిర్దోషము. 'కొన్ని నువర్ణాంత పదములకు బహుత్వమున నువర్ణకమునకు మాఱుగ లువర్ణకం బగు.' అని సూత్రము. బహుత్వమున నువర్ణమునకు బదులుగా లువర్ణకము వచ్చుననుటయే కాని దానిచేతనే బహుత్వము తెలియునను నర్థమురాదు. కొలను-కొలఁకులు అనుచో నువర్ణమునకు మాఱుగా 'కు' వచ్చినది. కాని బహువచనమును రానే వచ్చినది. అట్లే ఇటనుం గాఁదగునని వాక్యరీతి కన్పట్టుచున్నది. అట్లు వచ్చిన చెలులు పేలులు గావలయును. కావున నువర్ణము లోపించును అనవలయును.

౨౭. 'నువర్ణాంతపదములు'—'పద' అను నక్షరము లను వదలవలయును. "కొన్ని నువర్ణాంతపదంబుల నువర్ణంబునకు"-ఈ తూలేల? 'కొన్నిటి తుది నువర్ణమునకు బహువచనమున' 'కు' ఆదేశమగును' అన్నంజాలును.

౨౮. జొంపాలు, కొట్టాలు అను రూపములు సాధించుటకై 'కొన్ని దేశ్యపదముల మీఁద బహువచన మువర్ణకంబునకు లోపంబును దాని పూర్వమునందున్న యచ్చునకు దీర్ఘంబును వికల్పముగా నగును' అని సూత్రము కల్పించుకొన్నారు. ఇందు చిక్కులు పెక్కులున్నవి.

(i) 'దేశ్య' అనఁగూడదు. అదేశ్యముల యందును 'వజ్రాల,' 'రత్నాల,' 'స్నానాల,' 'నిష్పన్నాల్,' 'చరణాల్,' అని శ్రీనాథాదుల ప్రయోగములు దీపించుచున్నవి.

(ii) 'బహువచనము' అనఁగూడదు—ఏలన 'ప్రాణాన' అని భారతప్రయోగంబును, 'కాలానకు', 'పాపాన', 'కాలాన' 'వనాన' అని యిట్లు నానావిభక్తులలో 'ఏకవచన' బహువచనములయందు శ్రీనాథాదుల ప్రయోగములు కలవు.

(iii) ఇందును 'పద' శబ్దము పనికిరాదు.

(iv) 'ముఁవర్ణకమునకు' అనుటచే ప్రథమైక వచనేతర స్థలమున ఈకార్యము రాదు రామి అనిష్టము.

(v) 'బహువచనమున, ముఁవర్ణక లోపంబును, అని యున్నది. ముఁవర్ణకము ప్రథమైక వచనమునకే విహితము. ఇతర రూపములయందు ముఁవర్ణము గాని 'ముఁవర్ణకము' గాదు. ఇచట లేనిదానికి, రానిదానికి లోపము చేయుటెట్లు?

ఉదా: చుట్టాలు=చుట్టలు, మీసాలు=మీసలు, పూర్వ సూత్రముచే నగు దీర్ఘము వైకల్పికమని యీ సూత్రము. వైకల్పికమేని 'జొంపలు', 'కొట్టలు' అని యనిష్టరూపములు కలుగును. కొన్నిశబ్దములందు అని వ్రాసికొని యుండిన ఈ యనిష్టము కలుగదు.

30. ఇందును 'పదములకు' అనుట సరిగాదు. దానిం దొలఁగించినట్టి సూత్రము–నామముతుది యికారమునకు బహువచనము పరమగుచో ఉకారమగును. 'హరులన్' 'హరులచేతన్' ఇత్యాదులయందు బహువచనము పరమయి నదా? ఉత్వ మెట్లువచ్చినది? పదముగదా బహువచనము. అందును పెక్కువస్తువులం దెలుపు పదముగదా బహువచ

నము. చూ. ౨ సూత్రము :—'ఒకవస్తువుం దెలుపు పద మేకవచనము. పెక్కువస్తువులం దెలుపు పదము బహువచనము.' లు, లన్, లచేతన్-ఇత్యాది విభక్తులు పదములా? ఇచట పదమే వచనమని తాఁగల్పించుకొన్న సంజ్ఞను మఱచి వ్యాకర్తగారు 'లు వర్ణంబు బహువచనంబు' [బాల వ్యా. శబ్ద. ౧౨ సూ] అను నిత్యాది బాలవ్యాకరణ సూత్రములనే శరణుఁజొచ్చినారు.

౩౧. ఇఁదును పదములనుట సరిగాదు. మఱి యిందు ఇకారాంతములకని సామాన్యముగాఁ జెప్పినందున - 'పరిధి' 'సమితి' ఇత్యాదులకు 'పరుధులు' 'సముతులు' అని అనిష్ట రూపములు సిద్ధించినవి. ఏతన్నివారణార్థమే బాలవ్యాకరణమున 'వికృతియందు' అని సూత్రారంభము.

౩౨. ఇందును పదశబ్దము పనికిరాదు. 'బహువచనమున నామము తుది డివర్ణమునకు ళకారము వికల్పముగా నాదేశమగును' అని సూత్రాభిప్రాయము. ఇందును 'వికృతి యందు' అనవలయును. అననందున (వ్యాడికి) వ్యాళ్ళు, (తోడికి) తోళ్ళు- ఇత్యాద్యనిష్ట రూపములు కలుగును.

౩౩. 'బహువచనము పరంబగు నపుడు ద్విత్వ లువర్ణమునకు బిందుపూర్వక డువర్ణకంబగు.' ఈ గ్రంథమర్యాదలో (౧) 'బహువచనము పరంబగు నపుడు' అనఁగా రాములు రాములన్, చెట్లు, చెట్లన్, ఇత్యాది శబ్దములు పరమయి నప్పుడు అని యర్థమగును. విభక్తిప్రత్యయములే అర్థమ

కావలయు నని మాణవకుండు నెఱుంగఁగలఁడు. అందులకు వీరి శబ్ద - 2-వ సూత్రము భంగము కావించినది. కావున నిట వీరు బాలవ్యాకరణాదుల నాశ్రయించినారు. (౨) ఇఁకను 'ద్విత్వలువర్ణ'మఁట! ఏటిది యిది? 'లులు' కాదా! ద్విత్వ లకారములేదే. ఉకారముతోఁడి లకారమునకే ద్విత్వము చెప్పినారు, కావున రెండు లకారములును రెండు ఉకారము లునుం గావలదా? వెండులకొఅకును, ముండులకొఅకును వ్రాసికొన్న సూత్రమిది. దీనివలన చెల్లు (ఏ. వ)-చెండులు కావలయును. ఇది గాక 'బిందుపూర్వక డువర్ణకం' బఁట! ఏబిందువు? అర్ధబిందు వేని 'ముల్లు' (ఏ. వ) నకు ముఁడులు బహువచనము అగును. కాదనుట యెట్లు? సంధి ౨౬-వ సూత్రములో నిషిద్ధమైనట్టిది ద్రుతాదేశమయిన యరసున్న. ఈ సూత్రమువలన వెండులును ముండులును వచ్చినవిగాని విండ్లును ముండ్లును ఎట్లు వచ్చును? అందులకు ఈ వ్యాకరణ ములో సూత్రము కనఁబడ లేదు.

౩౮. ఈ సూత్రమునకు పదశబ్దము పనికిరాదు. బహు వచనమనుట స్వనిరుక్తార్థములో లేదు. 'ప్రాతిపదికాంతళులు డులకు బహువచనమున వికల్పముగా శకారాదేశమగు' ననుట. ఇందులకు ఏఱు-ఏళ్లు-ఏఱులు; పాలు-పాళ్లు-పాళులు; త్రాడు - త్రాళ్లు - త్రాళులు అని యుదాహరణములు. ఈ సూత్రము ప్రకారము పాళ్లు - పాలులు అనియు, త్రాళ్లు - త్రాళులు అనియు, రూపము లేర్పడును. అంతియకాని పాళులు,

త్రాళులు అనునవి సిద్ధింపవు. అయినను వానినిగూడ నుదాహ రించినారు.

3౫. "ద్వితీయైకవచనమున మహత్తులకు 'నిౕ' అమహత్తులకు 'నుౕ' అగును" అనుట. ఏకవచనసంజ్ఞను వీరు పదమునకే పెట్టుకొన్నారు. (చూ. శబ్ద. ౨. సూ.) కాని ఆ యర్థమున ప్రయోగించుకొనక ఇతర వ్యాకర్తల ప్రయోగము ననుసరించినారు.

ఇట 'వచనమున' అను సప్తమికి పరత్వమర్థమా? ఆదేశస్థానిత్వమర్థమా? రెండవది అపూర్వము. మొదటిది ఘటింపదు. 'ద్వితీయైకవచనముగా' అని వివక్షితము. వచన మనం బ్రత్యయమే అన్నమాట ఎఱుంగని విజృంభణమిది. 'ఒకవస్తువుం దెలుపు పద మేకవచనము. పెక్కువస్తువులం దెలుపు పదము బహువచనము' అని యీ ప్రకరణములో వీరి ౨-వ సూత్రము. పాడుకలో ప్రథమావిభక్త్యంతమనుటకు బదులు 'ప్రథమావిభక్తి' అనుట కలదు. అట్లే 'ద్వితీయైకవచనాంతము' అనుటకు బదులు 'ద్వితీయైకవచనము' అనుట కలదు. విభక్తి పరిగణనములో 'నిౕ' లేదు. 'ని' ఉన్నది. అది యిట చల్లఁగా 'నిౕ' అయినది; అనఁగా దాని కిట ద్రుతము మొలచినది. ఇందువలన చల్లఁగా 'రామునిౕ' అనురూపమే ఘటించునుగాని 'రాముౕ' అను రూపము ఘటింపదు. అమహత్తునకు 'ధనమును' అగునేగాని 'ధనముౕ' అనురూపము కలుగదు.

'ని ను ల కూర్చి' కదా ద్వి. ప్రత్యయములు. సంధి ౨౧ లో నుఁ కలదు. ఇది అందలి మాటలవలన ద్వితీయా విభక్తి నువర్ణకముగా కనఁబడుచున్నది. దీనికి అట ద్రుతము మొలచుట యెట్టిచిత్రమో, నువర్ణకమున ఉకారము లోపించి 'ధనముఁ' అగుటయు అట్టి చిత్రముగానే యున్నది. కళాపరి గణనములో చేర్పనందుననే ఇది ద్రుతప్రకృతిక మగునందు రేని, ఈ పక్షమున 'నుఁ' అగునేగాని, 'ఁ' ఎట్లగును? పయిగా స్వత్వమురాఁగా ఆ పదము 'ధనమునుు' అగును. మఱియు శ్రీనిఁ, కైనిఁ, అగునే గాని, శ్రీఁ, కైఁ అన రాదా? మఱియు నివర్ణమునకు 'రాముని' కై ద్రుతము మొలచెనుగదా. 'హరి'కై ఉన్న యికారముకూడ తొలఁ గునా?

3౬. 'ద్వితీయా బహువచనమున లవర్ణకంబగు' ద్వితీయా బహువచనము లవర్ణకంబనుట. పదమే బహువచన మన్న సంజ్ఞాకరణము విస్మృతము. అగుఁగాక; 'రాములఁ' అని తుదద్రుత మెట్లుకలుగును? దానిని రెండవసూత్రమున 'లఁ' అనియే ఏల పఠింపలేదు. మఱియు ఈ పక్కికలో 'రామలఁ' అగును గాని 'రాములఁ' కానేరదు.

3౭. "తృతీయాదులు పరమగుచో అనికారాంతమహ త్తులకు ఏకవచనమున 'ని' అనియు, బహువచనమున 'ల' అనియు ఆగమంబులగు" అని సూత్రార్థము. ఇందలి వాక్యరచ నలో విశేషములు:—'విభక్తుల ప్రత్యయము'లఁట. విభ

క్తులే ప్రత్యయములని యెఱుఁగవలయు. 'ఇకారాంతములు కాని మహచ్ఛబ్దములకు' అని యున్నది. '—శబ్దములపై' అనవలయు. ఏలయన, 'కు' అనఁ జో ఆగమ మెచట వచ్చునో తెలియదు. ప్రత్యయమునకే వచనసంజ్ఞ గావున 'ఏకవచనమున' 'బహువచనమున' అనుట స్పష్టార్థము గాదు. 'ఏకత్వమున', 'బహుత్వమున' అనవలయును ఏమయిన నగుఁగాక 'రాము చేతన్' అని మకారము మీఁద ఉకారమునకు ఇందు గతిలేదు. అందువలన 'రామునిచేతన్' 'రాములచేతన్' అని యే రూపము లగును. మఱియు నిందువలఁ 'రామునిచేతన్' అని న్యాగమములేని రూపము సిద్ధింపదు; ఏలన న్యాగమము వైకల్పికము గాదు.

౩౭. 'హరిచేతన్' ఇత్యాదులందు న్యాగమము రాదనుటకు సూత్రము. ఇట, న్యాగమము తృతీయాదులయందు ఇదంతములకు కలుగదని ౩౭ వ సూత్రమందే తెలిసినది ఇట వెండి ఆ యర్థముకొఱకే 'ఇకారాంత మహచ్ఛబ్దములకు' అని యీ సూత్రమునం జెప్పుట అనావశ్యకము. స్త్రీ నపుంసకములకుం గలుగదని చెప్పనేల? చెప్పకున్నం గలుగునా? ఇదియు వ్యర్థమే?

౩౯. ఇందును పదములనుట దుష్టము. ఇచట కి షష్ఠికి ప్రకృతులు చెప్పఁబడినవి. ఇవి ఇకారాంత తత్సమములును, దేశ్యములును నఁట! అటయిన రాణికిన్, దాడికిన్ (= ధాటికిన్), దాదికిన్=(ధాత్రికిన్); ఇట్టి తద్భవరూపములు దుష్ట

ములా? ఇకారాంతత దేశ్యములకు అన్వయింపదు. కాన, ఇకారాంతముగతి యిట్లయినది,— శ్రీకిన్, హ్రీకిన్— అనుట తప్పా? ఈ వ్యాకరణముచేత 'చేనికిన్' అను రూపము కలుగదు.

౪౦. అనిదంతములపై కు షష్ఠి వచ్చుననుట. ఎటుపు రాని యిత్తు ఇట నేల వచ్చినది? దీనిచేత 'శ్రీకున్' 'కైకున్' అను రూపములు అవతరించును. ఈ వ్యాకరణముచే రాముసకున్ అనుచోట రామకున్ అనియే వచ్చును. ఇట కు షష్ఠికి ముందు నకారాగమ మొకటి యగపడుచున్నది. ఇది వీరికెట్లు వచ్చినది? ఇందులకు వీరు సూత్రమును రచింపలేదు. అంతిమ స్వర నిమిత్త నిరపేక్షముగా ఈయాగమము వచ్చునా? రానిండు. అట్లు వచ్చినచో శ్రీనకున్, కైనకున్ అనియు దివ్య రూపములు తాండవింపం దొడంగును.

౪౧. "అమహత్తులపై సప్తమ్యేకవచనము 'నన్' అగును. ఇతరములపై 'అందున్' అగును." అని సూత్రోక్తి. ఇందువలన 'వనమునందున్' అను రూపము సమసినది. పైంగా 'గోడనన్', 'నేజానన్' 'గుడినన్', 'లకోరీనన్', 'గోనెనన్', పండితమ్మన్యుల 'పైనన్' ఇత్యాదులు సంభవించును.

'ఇతరములపై' అన్నందులకు 'తక్కిన పదములకు' అని వ్యాకర్తగారి ప్రయోగము. ఇట పదశబ్దము పనికిరాదు గదా! 'తక్కిన నామములకు' అనవలయు. 'రామునందున్' —ఇందు నడిమి నకార మెట్లువచ్చినది? ౩౭ వ సూత్రములో

చెప్పిన న్యాగమమా? అట్లైన 'రామునియందుఁ' కాదా? సంధి యెట్లు?

౨౧. 'సంబోధనంబున పదాంతమునకు అత్వమగునఁట. ఇందువలన 'రాముఁడ' అగును. మఱియు,

ఇందువలన 'ఓ శ్రీ' యనునది 'ఓ శ్రి' అగును. అదే ౨౨.చే 'ఓ శ్రా' అయియు నగు. అట్లే 'ఓ పూ,' 'ఓ గోనె' 'ఓ ముత్తో,' 'ఓ రో' అనునవి 'ఓప—' 'ఓ పా,' 'ఓ గోన-ఓ గోనా,' 'ఓ ముత్త-ఓ ముత్తా,' 'ఓ ర-ఓ రా' అగును. (౨౨) సూత్రములో వికల్పముగా దీర్ఘము చెప్పఁబడినది, దీర్ఘాంతములకు ఇది యన్వయి పదా? అన్వయింపవలసిన న్యాయము లేదు. అందువలన ఓలకోర-'ఓ లకోరా' అని సంబుద్ధి కావలయు. అట్టివియు నుండునా?

౨౩. సంబోధ్యవాచకమునకు ముందు 'ఓ ఓయి' అని చేర్చుటయుం గలదఁట. అందువలన 'ఓ ఓయి రాముఁడా' అగునేగాని, 'ఓ రాముఁడ,' 'ఓయిరాముడ' అని రూపము లేర్పడవు గావలయు. 'తి త ఉ' అని యుండలేదా? ''అట్లు తలంపనేల, ఉదాహరణములచే ఓ వేఱు ఓయి వేఱు అని తెలిసికొనవచ్చును. అసంధిగా ఓ ఓయి అని యెట్లు ఆగమ మగును'' అందురేని ఈ సూత్రముచే 'ఓయి లక్ష్మీ' ఓయి గౌరీ అగును.

౨౪. ఇది ఆరాగమ సూత్రము, సంబోధనంబున బహువచనంబుపై, ఆర ఆరా అగును, ఉ. రాములార, రాము

లారా, ఈసూత్రమునసే ఆరాయనియుం జెప్పుటచేతను, 'సంబోధనంబునం బదాంతంబున కత్వంబగును' అను ౮౨ వ సూత్రములో ఆ యుసగు అని చెప్పుమిచేతను ఏకవచనముపై అత్వమేగాని ఆత్వము రాదని వీరి మతము ఊహనీయమై యున్నది. అందువలన 'రాముఁడా' అన్న వీరికిం బనికిరాదని తోఁచుచున్నది. ౮౬ వ సూత్రమునం జెప్పిన దీర్ఘముచే 'రాముఁడా' అగును అందురా! అట్లయిన, దానిచేతనే 'రాములారా' ఏలగాదు? అగునేని 'ఆరా' యనియు సూత్రమునసే చెప్పనేల? దానివలన రాదేని ౮౨ వ సూత్రములో ఆత్వమునుగూడ విధింపమి యేల? తత్త్వమేమన ౮౬ వ సూత్రమునం జెప్పిన దీర్ఘము ఇకారమునకేగాని అన్యమునకుంగాదు అని వీరి యన్వయము. అందులకు తార్కాణము—దీర్ఘమునకు సూత్రమును వేఱుగాఁజెప్పక ౮౬ వ సూత్రములోఁ జేర్చుటయు, 'హరి' అని ఇకారాంతమునకు మాత్ర మే ఉదాహరణ మొసంగుటయు. ఇకారేతరస్వరమునకెల్ల, అత్వమును, తుదిహ్రస్వమునకెల్ల దీర్ఘమును వచ్చునని భావమేని దానిని ఇంతకన్న సులువుగా చెప్ప శక్యము గాదా?

రామ, శంభూ, అను సంబోధనరూపములకు ఈ గ్రంథములో సూత్రములులేవు. ఈ రూపములకై ౮౨ వ సూత్రము ప్రవర్తించుటకు 'రాము' అను పదములేదు, 'శంభూ' అను రూపము ౮౬ వ సూత్రమునం జెప్పిన దీర్ఘముచేత కలుగదు. ఏలన 'శంభు' అని పదములేదు,

౪౫. సంబుద్ధి ముందు నీచతా మిత్రతలందు రి, సి, విధానము. దీనిచే 'రి నీచుఁడా,' 'సి సకియ' అని కలుగును, కాని 'ఓరి నీచుఁడ' 'ఓసి సకియ' కావు. అగునేని తుల్య న్యాయంబున 'రిఓ నీచుఁడ' 'సిఓసకియ' అనియు నగును. 'ఓయురి దొంగ, 'ఓయుసి కులట' అను రూపములునుం గలుగును.

౪౬. సూత్రసారము.—'ట్రి,ంటి, తి, త్రి, ఁప' అనునవి నామములపై యథాసంభవముగా (౧) విభక్తులకు ముందు, (౨) సమాసమందు (౩) ఆ రెంను విధములను వచ్చును. ఉదాహరణములు (౧) వ తెగకు లేవు. లేమికి కారణము చెప్పలేదు. (౨) వ తెగకు నాము వేములు. (౩) వ తెగకు కూడు, అన్ని, నేయి. మిఱ్ఱు అని నాలుగు కలవు. కాని, చిత్రములునుం గలవు. 'ఔపవిభక్తు లనఁబడును' అని వీరి వాక్యము. 'ఔపవిభక్తులు' అను శబ్దముం గల్పించుకొనుటకు, ఆదివృద్ధి ఎట్లు వచ్చును? పూర్వులు వీనిని 'ఔపవిభక్తిక ములు' అనిరి గాని 'ఔపవిభక్తులు' అనలేదు. ఇచ్చవచ్చిన ట్లెల్ల రూపకల్పన! వీరు 'ఔపవిభక్తు'లనియే ౪౬ వ, సూ.లో ప్రయోగించినారు. మఱి ఉదాహరణములలో 'మిత్తికిన్' 'మిత్తిచేను' అని గురురేఫపాఠము. 'మిత్రికిన్, మిత్రిచేతను' అని లఘురేఫము ఉండవలయును. మఱియు, ఔపవిభక్తులు అను సంజ్ఞను వివరించుచున్నారు. విభక్తులకు ముందు వచ్చునవిగాన, 'ఔపవిభక్తులు' అనబడునఁట!-అపశబ్దమైనను అగుఁ

గాక సమాసమందు మాత్రము వచ్చునట్టి 'ఁప' అనుదానిని 'ఔపవిభక్తి' అనుట ఎట్లు? విగ్రహములలోనైన 'నాము యొక్క చేను' 'వేమనెడు చెట్టు' 'పాములయొక్క తేఁడు' అని యుండునేగాని, 'ఁప'కు ప్రయోగములేదు. 'నాఁపచేను' 'వేఁపచెట్టు' 'పాఁపతేఁడు' అని సమాసములు. బాలవ్యాకరణమున 'ఁప' అను దానిని, ఔపవిభక్తికములలోఁ జేర్పుటకు కారణము విశదమయినదా?

౨౮. సర్వనామావతరణము—'విభక్తి ప్రత్యయము లఁట.' ఇంత పాండిత్యమేల? 'విభక్తులు' అన్నం జాలును. 'నామవాచకము లట్లు' అననేల? ఇదియునుంగాక, సర్వనామములు నామవాచకములు కావని ఈ ప్రకరణము 3–వ సూత్రములో తత్పృథఙ్నిర్దేశముచేత స్పష్టము. అందే సర్వనామములకును విభక్తులు విహితములు ఇట మరల ఆమాట యేల? ఇవి (అనఁగా సర్వనామములు) 'ఉపయోగింపఁబడును' అని వాక్యము. ఇట్టి సందర్భములందు ప్రయోగింపఁబడును అనుట భాషాస్వాభావ్యము.

౨౯. 'సర్వనామ విశేషణముల కడపట సర్వనామాంత వర్ణములు వచ్చును, అని సూత్రార్థము. అట్లు వచ్చునేని 'నేను భక్తుఁడును' 'మేము భక్తులుము' 'నీవు భక్తుఁడువు' 'మీరు భక్తులురు' అని యగునేగాని 'భక్తుఁడను, భక్తులము' 'భక్తుఁడవు' 'భక్తులరు' అను రూపములు రావు. పైగాఁ 'భక్తుఁడు (ఁ) డు' 'భక్తుఁడురు' అను నిట్టివియు ఘటి

ల్లును. మఱియు దీనిచేత 'నీవు హారివు' 'నేను హారిను' 'వాఁడు హారి(ి)డు' వారు హారిరు, 'మీరు హారిరు' ఇట్టివి ఉద్భవం బొందును. ఇంతియకాని 'భక్తుఁడను, భక్తులము, భక్తుఁడవు, భక్తులరు' అను రూపములు (అందలి య (అ) కారాదేశము) ఉదాహరణగమ్యము లేగాని సూత్రానుగృహీతములు గావు. ఇదియుం గాక ఈసూత్రముచేతఁ 'నేను భక్తుఁడు, నీవు బుద్ధిమంతుఁడు' అను నిట్టి ప్రయోగములు దుష్టము లగును. ఏలన ఇందు చెప్పిన కార్యము వైకల్పికముగాదు. ఇవి అసాధువులని ఈసూత్రముచేత భ్రమ పడవలసినపని లేదు. బాలవ్యాకరణము, కారకపరిచ్ఛేదములో పండిత సార్వభౌముఁడు సూరి వీనినిఁ సవిశేషములనుంగా నుపదేశించినాఁడు. (బాల, కారక, 33, 38.)

ఈ వ్యాకరణమున సంఖ్యావాచకములను సర్వనామములనుగాఁ జెప్పలేదు. అవి భాషలో చేరవా యేమి?

మఱియు, సర్వనామములకు ఇందు నూతన లింగములు నిర్దిష్టములుగావు. కావున వానికి మహదాది సంజ్ఞయుం గలుగదు. వాని క్రియలకును, విశేషణములకును మహత్త్వాది వ్యవస్థ ఎట్లు? అది లేనందున 'అమ్మ, సీతమ్మా, నీవు పావనమవు' 'ఓ రంభాదులారా, మీరు సుందరములరు' ఇత్యాది నూతన ఫక్కికలు ఘటిల్లనగును.

'నేను భక్తుఁడను' ఇచట 'భక్తుఁడను' అను రూపము. ౮-౯-౧౦ సూత్రములంబట్టి మహత్తులకుం గలుగఁదగినది. ఈ

శబ్దము మహత్తెట్లయినది? 'నేను'నకు విశేషణమైనందున అయినదందుమేని 'నేను' నకు మహత్త్వములేదే! ఏలన ఆ వ్యవస్థ నామవాచకములకేగాని సర్వనామములకుఁగాదు. అయిన విభక్తులు వానికి రావా అనిన విధానవిశేషముచేత వచ్చును. పుంలింగ సంజ్ఞయు మహత్సంజ్ఞయు లేకపోయినం బోవును గాక, పుంలింగములు కానివానికిం గలుగు నమహత్సంజ్ఞ రాదా? అనిన, రానిండు, అందువలన నేను 'భక్తము' అగును. ఇట్టిది ఇందలి సూత్రముల వలని యనిష్ట పరంపర.

౫౦. తోగ=తోవ; పగలు=పవలు; సిగము; తగిలి, అలిగె, అని ఐదు ఉదాహరణములు. 'దేశ్యపదములలో... కొన్ని గకారములు వకారములగును' అని సూత్రవాక్యము. "కొన్ని దేశ్యపదములలో 'గా'కు 'వా' వచ్చును" అనిన భావయగును. గకారములు వకారములగును అను శైలి వికారముగా లేదా? దేశ్యపదములలో అని సూత్రమున నిర్దేశము. ఉదాహరణములలో 'సిగము' కలదు. అది శివశబ్దభవమని, అభియుక్తులైన సీతారామాచార్యులవారి యాశయము. చూ. వైకృతదీపిక—'సిగము=గ్రహము-శివః' 'సివము=గ్రహము, శివః.' ఎక్కడికక్కడనే వ్యాఘాతము! ఇందలి యైదుదాహరణములలో మూఁడు ప్రథమావిభక్తులు, ఒక క్త్వార్థకము, ఒక భూతార్థక ప్రథమపురుషైక వచనము. ఉదాహరణములలోని యీభేదమునకు నిమిత్తమేమి? ఈ రూపము

లందే 'వ' కారము వచ్చునుగాని వేటుచోట్ల రాదని భావ
మా? లేక, వట్టి బిభీషికా మాత్రమా ?
౫౧. 'దేశ్యపదములలో ప్రథమేతర తకారములు
కొన్ని దకారములగును' అని సూత్రపర్యాయము. ఏమి ఈ
పీడ ? 'దేశ్యములలో నుడి తొలివర్ణముగాని తాకు దా
వచ్చుట కలదు' అనిన భాషయగును. ఇట నుదాహరణము
లు.—'కొతుకు, ఉతుకు, అతుకు, వెతుకు, చతికిల'. ఇందు
తుదిది మాత్రము తుమున్నర్థక రూపముగా నుంచిన భావ
మేమో. మఱియొకరూపమున ఈదాదేశము రాదనియా ?
ఏల ఇట్లు వృధాజిజ్ఞాసలం గల్పించుట ?—

# విభక్త్యర్థ ప్రకరణము

౧. సూత్రమందు అభిహితార్థమును చెప్పనందున 'రాముఁడు వచ్చెఁ' అను నిత్యాది వాక్యములందు 'రాముఁడు' అని ప్రథమ రాదు. 'ప్రాతిపదిక సంబోధనంబులకుం బ్రథమయగు' అని వీరి సూత్రము, 'ప్రాతిపదకసంబోధనోక్తార్థంబులం బ్రథమయగు' అని బాలవ్యాకరణ సూత్రము ఈ మూటిలో ఉక్తార్థమన నేమో తెలియక వీరు దానిని విడిచి పెట్టినారు. అట్లు విడిచినందునం గలిగిన చెట్టలు ముందు తెలియఁగలవు.

౨. ఇందు కర్మ యన నేమో నిర్వచింపలేదు. 'అశ్వం గొట్టెను' అని ఉదాహరణము. అశ్వమునకు ద్వితీయావిభక్తి వచ్చునఁట. అశ్వశబ్దమునకుఁ గాని అశ్వమునకుఁ గాదు. "క్రియయొక్క ఫలము"—క్రియార్థమయిన ఫల మనవలయును—"క్రియయొక్క ఫలము"-సరిగా పరుగెత్తుటయు నగును. ఆఫలమును రౌతు అనుభవించును.

3. 'కర్తృకరణ సహార్థతుల్యార్థములకుం దృతీయయగు' ఇది బాలవ్యాకరణ సూత్రమును చెడఁగొట్టి చేసినట్టిది. దీనిచేత కర్తకు తృతీయ వచ్చును. చేత, చే, తోడ, తో, అని తృతీయా ప్రత్యయములు నాలుగు. పైయర్థములకు ఈనాల్గింటిలో ఏది వచ్చును? ఏదైనను సరియ యగునా? పూర్వులు ఏయర్థమున నేప్రత్యయము వచ్చునో చెప్పుచు వచ్చిరి. వీరు ఆ రహస్యమును దాఁచిరి. ఆ గుట్టు తెలియనం

మున, 'రామునితోడ వాలి నిహతుం డయ్యె' అను నుదాహృత వాక్యంబున కర్త్రర్థమున 'రామునితోడ వాలి నిహతుండయ్యె' అనియు, అట్లే సహార్థమున 'రాముని తోడ సీత వచ్చె' అనుటకు మాఱుగా 'రామునిచేత సీతవచ్చె' నఁటయు, సమార్థయోగమున 'రామునితో సముఁడు లేఁడు' అనుటకు మాఱుగా 'రామునిచే సముడు లేఁడ' అనియు ప్రయోగములు సాధువులగును. కావున ఆ తృతీయా ప్రత్యయములలో ఏయే యర్థమున ఏయే ప్రత్యయము వచ్చునో దానిని చెప్పవలయును. చెప్పిన పెద్దలకు వందనము సేయువలసినదిగాని నిందింపఁగూడదు. పూర్వులు స్పష్టముగా చెప్పినారు గావున వారి వ్యాకరణములందు ఈసందేహములు లేవు. ఈ యనిష్ట ప్రయోగములును ఉపదిష్టములు గావు. మఱియు 'రామునిచే వాలి నిహతుండయ్యె' అనువాక్యము వెల్లునేర్పుతో నిర్మితము. ఇందు ప్రష్టవ్యము గలదు. ఇందు ఏది కర్త? తృతీయ వచ్చినాదున రాముడే కర్త యనుకొందము. ఏ క్రియకు కర్త? దానిని చెప్పుమి యుక్తియే. ఇట యుక్తిగా రెండువాక్యములు కలిపినారు. 'రామునిచే వాలి నిహతుండు' అనునదొకటి. 'వాలి అయ్యె' అనునది ఒకటి. జిత్తేమనఁగా, పఠించువారు రాముని కర్తనుగాఁ దలంచిన, సంతోషమే. వాలిని కర్తగాఁదలంచిన నదియు సంతోషమే. రెట్టి సంతోషమేల యనన కర్త యేదో వ్యాకర్తకు సందేహమైనందున. గ్రంథవిస్తరభయముచే నిని నిట చర్చింపను—'కరణము సాధనము' అన్నట్లే కర్తయన నిది యని ఏల చెప్ప

రాకః? 'దేవదత్తు' చేత వంటకము వండఁబడె' అని పూర్వుల యుదాహరణము. 'కోలతోడఁ గూలనేసె' యనుచో 'కోల చేతఁ గూలనేసె' అనఁ గూడదా? అది తెలియుట యెట్లు? ఎప్పుడు? 'కర్తృకరణసహార్థ తుల్యార్థములకుం దృతీయ యగు' అని వీరి సూత్రము. ఇందు 'చేత, చే, తోడ, తో,' అను నాల్గింటిలో ఏదివచ్చునో తెలియదుగదా! 'కరణసహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడ వర్ణకంబగు' అని బాలవ్యాకరణ సూత్రము. తోడ వచ్చునని దీనివలనఁగదా తెలిసికోవలసియున్నది. తెలియుచున్నది. సహార్థమునకై వీరు ఇట్లు వ్రాసినారు —"రామునితోడ సీతవచ్చెను—(సహార్థము—కూడ)" ఇందువలన 'రాముఁడుకూడ తోడ వచ్చెను' అని వీరి కవనములో కూడకుఁగదా తోడ రావలయును. ఏలయన 'కర్తృకరణసహార్థ తుల్యార్థములకు తృతీయ యగు' అని వీరి సూత్రము. ఇందలి షష్ఠీ ప్రయోగముచేత 'కూడ'కు ఈ 'తోడ' వచ్చును 'కూడ' సహార్థముగాని రాముఁడు సహార్థముగాఁడు. సహార్థమందు అని ప్రయోగించుకొనియుండిన ఇట్టి దుష్ట ప్రయోగములు రావు. అట్లే ఈవ్యాకరణమున 'తుల్యార్థములకు' అని యున్నది. అందువలన 'రాముని తోడ సముఁడు లేఁడు' అనుటకు మాఱుగా 'రాముఁడు సమునితోడ లేఁడు' అనవలసియున్నది. తుల్యార్థము 'సమ' శబ్దముగాని 'రామ' శబ్దముగాదు. మఱియు నిట నుదాహృతములు చేతోడలే. వీని స్థానమున, "చేత, తో"లు కూడ వచ్చునా, రావా?—

ర. 'హేతుగ్రహణాంబులకును తృతీయ యగు, మూఁడవ సూత్రముననే దీనినేల చేర్పలేదు? 'చేత, చే. తోడ, తో' అను నాల్గింటిలో ఏది వచ్చును? ఏవి వచ్చును? అన్నియు వచ్చునా? ఇటను అన్యవ్యాకరణములేగదా శరణము 'జనులచే కప్పములు గొనిరి' అను వాక్యమున కొనుటయన గ్రహణము. దానికి (అనఁగా తద్వాచకమునకుఁ) గదా తృతీయ రావలయును? అందువలన ఈవ్యాకరణముచే 'జనులు కప్పముం గొనెఁజేత' అనిగదా పై వాక్యము ఉండవలయును? 'హేతుగ్రహణములకుఁ దృతీయ' అని వీరిసూత్రము. అందలి కుషష్ఠికి ఈపాటి ప్రభావముండదా? 'గ్రహణమనం దీసికొనుట' అని వీరు టీక వ్రాసికొన్నారు. తీసికొనుట యను మాటకు కొన్నిజిల్లాలలో సాన్నిపాతిక విచేష్టలు అర్థము. ఆంధ్రవిద్యార్థులలో ఆజిల్లాలవారే బహుళము. 'గురునకుం దృతీయావిభక్తియగు' అని వీరి సూత్రము. పూర్వులు తోడ వర్ణకమనిరి. వీరు దానిని గుట్టుగా దాఁపనేల? మఱి 'రామకృష్ణులు సాందీపునిచేత వేదములంజదివిరి' అని చేత తృతీయం బెట్టవచ్చునా?

౬. 'సంప్రదానంబునకుం జతుర్థియగును' అని సూత్రము. 'త్యాగోద్దేశ్యంబు సంప్రదానంబు నాఁబడు' అని బాలవ్యాకరణము. దీనికి ఇచ్చుచోఁ బుచ్చుకొనువాఁడు సంప్రదానము అనఁబడునని యర్థము. కావున 'సంప్రదానంబునకు' అని షష్ఠిసరియే. వీరు గురువాక్యమును గ్రహింపక

'సంప్రదానంబన' 'ఈయం దలంచుట' అని యర్థము వ్రాసి కొన్నారు. భ్రమచేత వ్రాసికొన్నారేగాని ఆమాటకు ఆ యర్థము రాదు. 'తలంచుట' యనుట శాంతాకారపురాణము వలె నున్నది. 'తలంచుట' యనునర్థము 'ఉద్దేశ్యము' అనుటం బట్టి వ్రాసికొందురుగాక. సంప్రదానంబనఁగా భావసాధనచే చక్కఁగా ఇచ్చుట యర్థమగును. శాస్త్రకారులు ఆయర్థమున ఆ సంకేతమును కల్పించినవారుగారు. ఉద్దేశ్యమన ఎవనికి ఇత్తురో, లేక, ఈఁదలంతురో, వాఁడు సంప్రదానమనంబడును. 'సమ్యక్ప్రదీయతేఽస్మై తత్సంప్రదానమితి' అని తత్త్వబోధిని. 'వానిపేరుతోడఁ' అని వీరి ప్రయోగము. పేరు శబ్దము ఔపవిభక్తికముగాదా? 'ఎవనికొక వస్తువు ఈఁబడుచున్నదో వాని పేరు (రి) తోడ చతుర్థీవిభక్తి ప్రత్యయమగు' అని యుపన్యాసము. విభక్తి యన్నం జాలును; చతుర్థి యన్ననుం జాలును. విభక్తిప్రత్యయమనుట ఎందులకో ఊహించుకొనుఁడు. 'వానిపేరు' అన్నారు. వాఁడే సంప్రదానము. ఇచట వీరు ఆవశ్యకమైన పూర్వులుచెప్పిన-శాస్త్రసిద్ధమైన-యా యర్థమునుమాని వేఱేమో వ్రాసి తుదకు విధిలేక 'వాని పేరుతోడ' అని వివరించుకొనుట విద్యార్థుల పురాకృతము.

౭. 'తాదర్థ్యమున చతుర్థియగు' అందులకు ఉదా: 'చావునకై సీతం గోరెను'. రాముఁడు సీతం గోరలేదా? ఆ కోరుట చావునకా? కోరినందున రావణుఁడు చచ్చెను గాన

నట్లు చెప్పుట అందురు. ఋజుమార్గమున బాలబోధము చేయ వలసియుండఁగా ఈ చమత్కారమేల? పెద్దలు 'ముక్తికై హరిని సేవించుచున్నాఁడు' అని యుదాహరించిరి.

౮. 'అపాదానమునం బంచమియగు.' పంచమీ ప్రత్యయములు 'పట్టి, వలనన్, కంటెన్' అని మూఁడు. ఇందు అపాదానార్థమున నేది వచ్చును? ఏవి వచ్చును? అన్నియునా? వీరి యుదాహరణములు,—'చెట్టువలన నాకులు వ్రాలెను, 'దొంగవలనిభయము' అని. అట్లైె 'చెట్టుంబట్టి యాకులు వ్రాలెను' 'చెట్టుకంటె యాకులు రాలెను' అనియుం జెప్ప నొప్పునా? సూత్రమున వలనను నిర్దేశింపనందున 'పట్టి, కంటె' లం గూడ ప్రయోగింపవచ్చునని యేర్పడును? పూర్వులు అపాదానసూత్రములవలన వర్ణకమునే నిర్దేశించినారు. అపాదాన మననేమో వీరు చెప్పలేదు. చెప్పుటయు మానుటయు నిందు యాదృచ్ఛికముగా నున్నది. అందులయుక్తి ఇదే తెలియును. 'ధ్రువమపాయేఽపాదానమ్' అని పాణినిసూత్రము. దేనినుండి యొకటి పాయునో ఆ ధ్రువము అపాదానము. వీరు 'దొంగవలనిభయము' అనియు నుదాహరించినారు. భయమనెడి భావము దొంగనుండి ఎడఁబాసినదా? ముందు దొంగయందుండినదా? ఇటంజెప్పిన భయము 'దొంగవచ్చును, మన వస్తువులను హరించును' అని మన మనస్సులలోనున్న భయముగాని 'తన్ను పట్టుకొందురని' వానియందున్న భయముగాదు?దొంగ అపాదానము గాఁడు. 'ఒకవస్తువు దేనినుండి

విడువంబడునో అది యపాదానము'అని వీరివాక్యము. 'విడువం బడునో', దీనికి కర్త ఏది? విడుచునది ఏది? అకా చెట్టా?

౮. 'నీయొక్క దాసుఁడు' 'నా నేర్పు' 'వాని సిరి' అని ఉదాహరణములు. వీనిలో ఒకదానయొక్క విభక్తి కలదు. కడమ రెంట షష్ఠిలేదు. అని యిట షష్ఠీ ప్రయోగము నెట్లు తెలుపును? 'శేషమన తనస్వామికిం దనతోఁగల సంబంధమ'ని వీరి వాక్యము. తనకు స్వామితోఁగల సంబంధము ఏలగాదు? 'ఉ. రాజ పురుషుఁడు,' ఇట "రాజునకు వాని యాకృతికింగల (అనఁగా రూపమునకుం గల యఁట) సంబంధము 'యొక్కచేఁ' దెలుపనగు" నఁట. పురుషుఁడనగా ఆకృతి యఁట. ఏకారణముచేత శేషమనఁగా సంస్కృతవ్యాకరణమున సంబంధ మర్థమయినదో ఆ కారణము ఇందు కలదా? ఆ సంజ్ఞ ఇట నెట్లు సరిపడును? పురుషశబ్దమునకు ఆకృతి యర్థమని ఎక్కడ నున్నది? ప్రమాణమును తెలిపిన కృతజ్ఞుఁడ నయ్యెద. సంబంధార్థమునకు వీ రిచ్చిన యుదాహరణము 'రాజపురుషుఁడు' అను సమాసము. యొక్కకు ఉదాహరణము లేదు. విభక్త్యర్థములు చెప్పందొడంగి యొక్కకు అర్థము చెప్పి దానికి ఉదాహరణము చూపమివేమి? దాని నుచ్చరించినచో ప్రత్యవాయమా? మఱి ఆకృతి యనిరి కౌముది లోనగు శాస్త్రగ్రంథములందు 'రాజ్ఞః పురుషః' అని యుదాహృతము. 'రాజపురుషుఁడ'ని సమాసము బహుప్రసిద్ధము. "రాజ్ఞః పురుషో రాజపురుషః" అని కాశికావృత్తి. అందులకు శ్రీశచంద్రవసువు

గారి యనువాదము' The king's man 'దానికి 'The king's man (officer or servant)'అని కాళీ పండితుడు. ఇదియునుం గాక ఇప్పుడు మనము పోలీసుకాన్‌స్టేబిల్ అని వ్యవహరించు చున్నామే అట్టి రాజసేవకులకు పూర్వము 'రాజపురుషాః' అని సంస్కృతనాటకాదులయందు వ్యవహారము. మృచ్ఛకటి కలో చారుదత్తుని రాజపురుషులు అధికరణకుని (న్యాయాధి పతి) మ్రోల విచారణకాలములో కాచుచుండిరి.

"అధికరణకః, భో రాజపురుషాః, గృహ్యతామయం చారుదత్తః (రాజపురుషా స్తథా గృహ్ణన్తి)." "హేరాజపురు షాః". "చారుదత్తం విసృజ్యనిష్క్రాన్తాః సర్వే రాజపురు షాః" ఈయర్థమున వ్యాకరణ శాస్త్రమందును, నానాగ్రంథ ములందును ప్రసిద్ధమయిన యీ పదమునకు ఈ యర్థము నెఱుంగక లేనియర్థమును కల్పించుట చింతనీయము. రాజ సేవకులను నీ యర్థము కాశీనవద్వీపాది విద్యానిలయములయం దలి వైయాకరణమండలి యందు అతిప్రసిద్ధము.

. ౧౧. 'అధికరణమున సప్తమియగు'—ఇట 'దేని యందు నిలచునో' అని ప్రయోగము. 'నిలుచు' ధాతువు, అకారమధ్యముగాదు. ఈ 'నిలచు' రూపము ఇంతకుమున్నే వచ్చిన 'విడచు' వంటిది. దీనివంటిదే ఒకానొక నాటకమం దలి 'పిలచిన పలుకులును'. ఇచట వ్యాకర్తగారు ఆధారము యొక్క సామాన్య నిర్వచనముగా దాని మూఁడు భేదము లలో ఒకభేదంపు నిర్వచనమును వ్రాసి భేదములను వేర్కొ-

నకయే పెద్దల యుదాహరణమునే వ్రాసికొన్నారు. నేర్చికొని వ్రాసిన బాగుగా నుండును. అట్లు చేయనందున సూత్రము ఔపశ్లేషికమునకును, ఉదాహరణము వైషయికమునకునై గుట్టును బైటవైచినది. 'ధర్మమునం దిచ్ఛగలదు' అని యుదాహరణము. బాలురకు ఇది సుబోధమా? 'తోఁటలో చెట్టున్నది' 'పెట్టెలో ధనమున్నది' 'జేబులో గడియారమున్నది' ఇట్టి దేదియు పనికిరాదా?

౧౨. 'కోలం గూలనేసె'—ఈ వ్యాకరణముచేత 'కోలను' అను రూపము వచ్చునుగాని 'కోలన్' అను రూపము రాదు. ''అమహత్తుల తృతీయాసప్తములకు మాఱుగా ద్వితీయయగు'' నను నీసూత్రముచేత 'వనమందుండె' అనుట తప్పై 'వనమునుండె' అని దానికి మాఱుగ సంభవించును. ఇదియును గాక ఇట 'అయోధ్యయందు' అని వీరు ప్రయోగించినారు. వీరి వ్యాకరణముచేత 'అయోధ్యనన్' అనవలయును. శబ్ద. ౪౧. సూ. 'అమహత్తుల సప్తమ్యేకవచనమునకు నన్ వర్ణకంబును అన్యత్ర అందువర్ణకమును వచ్చును' అనుట. అయోధ్య అమహత్తుగదా?

౧౩. 'అమహద్వాచకముల ద్వితీయకు ప్రథమయగు' ననుట. ఇందువలన 'సత్యభామను పిలిచెను' అనుట తప్పు. ఆ యర్థమున 'సత్యభామపిలిచెను' అనవలయును. ఏలయన ఈ ప్రథమాదేశము వైకల్పికముగాదు. శబ్ద-౪ సూత్రముచేత 'సత్యభామ' అమహత్తు.

౧౪. 'చిలుకలు కూసెను.' 'గోవులు వచ్చెను.' 'అమహత్కర్తృకక్రియల బ. వ. నకు, ఏ. వ. అగు' అని సూత్రము. ఇందువలన 'చిలుకలు కూయుచున్నది.' 'ఆ బీటిలో దూడలు మేయుచున్నది' 'గోపికలు పాడుచున్నది' అని కవనము చేయవచ్చును.

మఱియొక విశేషము—ఇందు 'కర్తలగుచో' అని యున్నది. ఇంతకుముందు వీరు పూర్వులనే అనుసరించి కర్తకు తృతీయనే విధించినారు. అందువలన ఇట 'చిలుకలచే కూసెను' 'గోవులచే వచ్చెను' అనవలసినది. ఈప్రకరణము 3-వ సూత్రము ఉదా. 'రామునిచే వాలి నిహతుండయ్యె' అను వాక్యములో 'వాలి' కర్తయేని 'వాలిచే' అని తృతీయ రావలదా ? మఱియు 'కర్తలగుచో' అనుట సాధువుగాదు. 'కర్తలగుచో' అని తుదిని దీర్ఘ మిడవలయును. 'అలశకుంతల ముద్దిచ్చి యలసెననుచో' అను నాధునిక విద్వత్ ప్రయోగము ప్రామాదికము. 'కర్తలు' అనుటకుమాఱు 'అభిహితములు' అనవలసినది. బాలవ్యాకరణంబున 'తిర్యగ్జడంబులు వాచ్యంబు లగుచో' నని యున్నది. అందువలన నీ వ్యాకరణము వలన స్త్రీలకు కలిగిన యుపద్రవము తప్పినది. ఎట్లన దీనివలన 'నలువుర అచ్చరలు వచ్చెను' అని ప్రయోక్తమయినది బా. వ్యా. వలన 'వచ్చిరి' అనుప్రయోగమునకు భంగములేదు. అచ్చరలు వీరుచేసిన అమహత్తులు గదా ?

# సమాసము.

౧. 'రాజు+ఆజ్ఞ = రాజునాజ్ఞ'

'స్వతంత్రములగు నర్థములు గల కొన్ని పదములు' అని యారంభము. అర్థములలో స్వతంత్రములు, పరతంత్రములు అని భేదముగలదా? 'అట్టి పదములు ఒకటిగాఁజేరి ఒక యర్థమును కలిగించుట సమాసమునాఁబడు' అని వీరియుపదేశము. ఇందుఁజెప్పిన కలిగించుటయే సమాసమా? అట్లు కలిగింపఁబడిన సముదాయము సమాసమా? ఇందు "రాజు, అను మహచ్ఛబ్దమును, ఆజ్ఞయను నమహత్తునుగలిసి, ఆజ్ఞయను పదమును ప్రధానముగాఁ దోఁపఁజేయుచున్నయది" ఈ వాక్యము తుమకండన కల్పము. 'చేయుచున్నవి' అని బహువచనము వలదా! ఇందలి యుత్తరార్థమునకు ఇటఁ బ్రసక్తి యెట్లు? మహత్తులు అమహత్తులుం గలియక, కేవల మహత్తులుగాని కేవలామహత్తులుగాని కలిసిన నది సమాసము గాదా? మఱియు, ఒక అర్థమును కలిగించుట యనఁగా, ఒక పదమును ప్రధానముగా తోఁపించుట యని భావమా? అర్థసంఖ్య నెఱుంగుటకు సాధనమేమి? 'రాముఁడు వాలిని సంహరించెను.' ఇందెన్ని యర్థములు? 'రామబాణహతుఁడైన వాలి' ఇందెన్ని యర్థములు? ఈ విషయము సుబోధమా? సమాసార్థమును చెప్పు వాక్యమేగదా విగ్రహము; కావున విగ్రహమం దనేకార్థములును, సమాసమందు ఏకార్థమును అని భేద మెట్లుసరిపడును? కావున ఒకయర్థమును గలిగించుట

యనుట యెట్లు? విగ్రహవాక్య మెన్ని యర్థములను గలిగించునో సమాసంబును అన్ని యర్థములనే కలిగించును. కనుక 'ఏకపదంబగుట సమాసము' అన్న సరి. ఇందు పూర్వోక్తమయిన మహాత్త్వామహత్త్వ వివేచనము అసంబద్ధమని చూపఁబడినదిగదా? రాజను పదమును, ఆజ్ఞయను పదమును చేరి ఆజ్ఞయను పదమును ప్రధానముగాఁ దోఁపింపఁ జేయుచున్నవఁట. ఇది యసంబద్ధము. పదమునుగాదు ప్రధానముగాఁ దోఁపింపఁజేయుట. మఱి దేనివన పదార్థమును. మఱి ప్రధాన మప్రధానమని భేద మెట్లు ఏర్పడును? కిటుకు బయటఁ బడదే.

౨. ఇందు తత్పురుష ద్వంద్వ బహువ్రీహులను మూఁడు సమాసములే చెప్పఁబడినవి. ఏతద్భిన్నములుగా కర్మధారయద్విగువులు ౮-౫. సూత్రములలో చెప్పఁబడినవి. ఇది ఎంత విపరీతమో చెప్పవలయునా?

ఉక్తపదముల యర్థముంజెప్పక వానిచే నూహ్యమగు మఱియొకటిం దెల్పునది బహువ్రీహిగా నున్నది. చెప్పనిచో 'పీతాంబరుఁడు' అనుచో హరి యెట్లు తెలియును. 'చెప్పియు' అనవలయును.

''వాచ్యములగు నన్నింటి యర్థము(ను?) ప్రధానముగాఁ గలది ద్వంద్వసమాసము.'' వాచ్యమేమి? 'ఉక్తము' అనవలయును. వాచ్యమే యర్థము, శబ్దమే వాచకము.

3. (౧) 'చంద్రధరుఁడు'—ద్వితీయా తత్పురుషమఁట, ఇది 'చన్ద్రస్యధరః' అని షష్ఠీసమాసముగా విగ్రహీతవ్యము. 'నెలదాల్పు', 'తోలుదాల్పు', 'ముమ్మొనవాలు దాల్పు' ఇట్టి దానిని గాని శ్రితాతీతపతిత గతాత్యస్త ప్రాప్తాపన్న శబ్దము లలో నేదేని ఉత్తరపదముగునట్లుగాఁ గాని ఉదాహరించుకొన రాదా? సమాస కుసుమావళినైనం జదువుకొనరాదా ? మఱి ఇట సమాసములయందు విభక్తిలోప మెట్లుగలిగినది? అందు లకు ఇందు విధిలేదు. పూర్వులు 'సమాస విభక్తికి లోపం బగు; లట్టునకుఁగాదు.' అనిరి. విగ్రహవాక్యములలో 'దొంగ వలనిభయము' అని పంచమీసమాసవిగ్రహముగా ననుగ్ర హించినారు. ఇది సమాసముగదా. 'భయము దొంగవలన' అన్నట్లు 'భయము దొంగవలని' అనఁగలమా ?

4. 'గుణవాచకములును. క్రియాజన్యవిశేషణములును ము వర్ణకాంతవిశేషణములును, ఆ, ఈ, ఏ లును ముందుఁ గల సమాసము కర్మధారయము నాఁబడు.' 'ముందుఁగల'- 'పూర్వపదముగాఁ గల' అనిన అసందిగ్ధముగా నుండును. 'గుణవాచకములు'— "ఉష్ణకాలము" కర్మధారయము. సరియే. ఉష్ణాతిశయము, ఉష్ణప్రియుఁడు, పీతాంబరుఁడు ఇవి కర్మధారయములా? వీనినివారించుటకు గుణిపరములైన గుణ వాచకములు అనవలయును-అని వ్యాకర్త ఎఱుంగవలయును. 'ఉత్తర పదార్థ ప్రధానమగు విశేషణ విశేష్యముల సమా సము కర్మధారయము' అన్నమాట. అట్లేచెప్పిన మేలుగా

నుండును. రెండుమాఱులు విశేషణములు అనుటచేత కడమవి విశేషణములు కావేమోయని సంశయము కలుఁగును. విశేషణము లన నిట్టివి అని వివరించుకొనవచ్చును. ఇచట వారి సూత్రములో కలుగు ధాతువుతో మూఁడు ద్వితీయలు ప్రథమాస్థానమున ప్రయుక్తములు. వానిని ప్రథమలుగా మార్చుకొనవలసినది. వీరు కర్మధారయమును తత్పురుష భేదముగా గ్రహింపలేదు. అందులకు 'ఉత్తర పదార్థప్రధానము తత్పురుషము' అని వ్రాసికొనియు, ప్రాధాన్య మన నేమో తెలియనందున తత్పురుషసమాసమని యారంభించిన విస్తరములో వ్యధికరణతత్పురుషముం మాత్రమే తత్పురుషముగా వ్యవహరించుట అజ్ఞానము.

౫. నాల్గవసూత్రమున వీరు కర్మధారయమున పూర్వపదములనుగా గుణవాచక క్రియాజన్య విశేషణము వర్ణకాంతములను ఆ, ఈ, ఏ లను చెప్పినచోప్పున సంఖ్యావాచకములను చెప్పక మానినారు. అందువలన ద్విగువును (అనఁగా సంఖ్యాపూర్వక కర్మధారయమును) కర్మధారయభేదముగా వీరు గ్రహింపలేదని తెలియుచున్నది. 'ముచ్చిచ్చు' 'మువ్వన్నె' అని ద్విగూదాహరణములు. "ఇందు 'ముచ్, మువ్' అనునవి సంఖ్యలా? సంఖ్యాపూర్వకకర్మధారయముగదా ద్విగువు? తెనుఁగున సంఖ్యావాచకములలో ఇవిలేవు. మూఁడుశబ్దమే ముచ్, మువ్ అయినది" అని వాదింతురుగావలయు. అగుఁగాక, అట్లు మాఱకయు, ఏకవచనాంతములుగాకయు

నున్నచో అనఁగా 'మూఁడు చిచ్చులు', 'మూఁడు వన్నెలు' అనురూపములు ద్విగుసమాసములుగావా? ఈసందేహము తీర్పకయే దాఁటినారు. వీరి సూత్రముప్రకారము ఆయేకవచనాంతములు ద్విగువులుగావు. అయినను అవి ద్విగువులే. వీరి సూత్రముచేత అనంతరోక్తములయిన బహువచనాంతములే ద్విగువులగును.

౬. 'నలినాప్తుఁడు' బహువ్రీహి సమాసమఁట. ఇంతకన్న ఘోరమైన వ్యాకరణముండునా? ఏమి ఈ పాండిత్యతాండవము! 'నలినము ఆప్తము గాఁగలవాఁడు' అని విగ్రహించి ఆయొడుపుచే ఈఘోరతం దప్పించుకొందురో యనవకాశమీయక 'నలినమనఁగాఁ గమలము; ఆప్తుఁడు అనఁగా మిత్రుఁడు.' అని టీకవ్రాసికొని అందు ఆప్తుఁడు, మిత్రుఁడు అని మహద్రూపములను ప్రయోగించుకొని 'నలినముయొక్క యాప్తుఁడు' అను షష్ఠీసమాసఘటకవిగ్రహమునే సూచించుకొన్నారు. బహువ్రీహినే సాధింపఁదలఁచిన ఆప్తము అని అమహద్రూపము వ్రాసికోరా? మహాకవిసంప్రదాయము కమలమునకు సూర్యుని బంధువుంగా చెప్పుటయే ఉ. 'పద్మబంధుః' పుం. (పద్మస్య = కమలస్యబంధుః) 'సూర్యోదయే పద్మస్య ప్రకాశకతయా తథాత్వం' సూర్యః ఇతి రాధాకాన్తియే.

" 'తామరసఖుఁడు' N. S. The Lover of Lotus (i. e.) The God of the Sun" బ్రౌణ్యము. "తమ్మిచెలి" Lover of the Lotus. i. e. the Sun.—బ్రౌణ్యము.

'చాయ పెనిమిటి జముతండ్రి జగముకన్ను,
తమ్మిచుట్టము మినురతనమ్ము ప్రొద్దు,
ప్రాఁబలుకుఁ డెంటి పచ్చగుఱ్ఱములరాతు,
వేవెలుంగన సూర్యుడౌ విధువతంస' ఆం. భా.

అర్కః సహస్రాత్ ఖర ప్రభృతేరపి
ఉష్ణేభ్య శ్చాంశ వశ్చరాబ్జ
దినేభ్యోఽపి బాన్ధవః' కావ్యకల్పలత.

ఇందువలన 'అబ్జబాంధవుఁడు' అనిన సూర్యుఁడగును. అట్లే 'సూర్యబాంధవము' అనిన యబ్జముకాదా యనిన 'కవిరూఢ్యే త్యేవ. నహిభవతి యథా 'శ్రీకంఠ సఖో ధనద స్త థాధనదసఖః శ్రీకణ్ఠ ఇతి' కావ్యకల్పలత.

'సమాసమున వచించినపదములచే నూహింపఁదగిన మఱియొక వస్తువుం దెలుపునది బహువ్రీహిసమాసము' అని సూత్రభావము. ఇందునుండి ముందుగా 'ఊహింపఁదగిన', అనుభాగమును ఎత్తివేయవలయును. 'మఱియొకవస్తువుం దెలుపునది' అఁట. ఆ తెలుపునది ఏదో దానిం దెలుపునది ఏదియులేదు. సమాసమున అని యారంభమందె ఉన్నను అది సప్తమ్యంతమయి 'తెలుపునది' అన్నమాటకు విశేష్యముగా అన్వయింపకయున్నది. 'అన్యపదార్థ ప్రధానము' అనిన విద్యార్థులు సంతసింతురు. మఱియు తెలుపుటమాత్రమే బహువ్రీహిత్వఘటకము గాదు. తెలుపఁబడినట్టదాని ప్రాధాన్యము

తద్ఘటకము. తెలుపుటయే లక్షణముగా చెప్పుకొన్న చెట్టను 'నలినాప్తుఁడు' అను నుదాహరణమున వీరే బయట వైచికొన్నారు. 'నలినాప్తుఁడు' బహువ్రీహియఁట !

౯. 'సంస్కృతవిశేషణములు దేశ్యపదములతో సమసింపవు' అనుట 'అనేకగుఱ్ఱములు', 'అమితకంపు'అని యుదాహరణములు. సంస్కృతము సమసింపనిదే ప్రాకృతము సమసించునా? 'తిన్నతిండి', 'అందంపు టొడలు', 'నాటఁబడినరాడు' 'అనునట్టి యర్థములందు 'ఖాదితతిండి' 'సుందేరయొడలు' 'సంతవియరాడు' అని కూర్పవచ్చునా? సంస్కృతమనఁగా వీరి సూత్రములో సంస్కృతసమమా? లేక 'స్వౌజసమౌట్' లో నగు సంస్కృత వ్యాకరణోక్త విభక్తులతోఁ గూడుకొన్న సంస్కృతశబ్దమా ? రెండవదానికి అనుకరణమునం దక్క తెనుఁగునం బ్రవేశములేదు. తెనుఁగువిభక్తిరాని సంస్కృత ప్రాతిపదికమని ఉదాహరణములచేత ఊహ్యామగుచున్నది. మఱి యిట 'దేశ్యములతో సమసింపవు' అనియున్నది. అందువలన తత్సమతద్భవములతో సమసించును అని యర్థము లభించుచున్నది. అందువలన సుందరజడ, జ్యేష్ఠరాణి, విశాలగోడ, శోణతామర, ఇవియు దుష్టములే, కాని, ఈ వ్యాకరణముచేత సాధువులగును.

మఱియు 'విశేషణముల'ఁట! సం. విశేష్యములు సమసించునా? 'అశ్వదండు,' 'దశరథకొడుకు', 'జనకకూఁతురు' 'లక్ష్మీపడంతి' 'రమాబోటి' ('రమాబోటీధవుఁడు'అని యొకరు

ప్రయోగించియున్నారు.) ఇట్టి పదసంతర్పణ అవారియగునా? వ్యాకరణమున నిట్లుగదా యుండవలయును.

౯. దేశ్యవిశేషణములు సంస్కృత విశేష్యములతోఁ జేరి కర్మధారయములగు. ఇదేమి కర్మధారయ నిర్వచనమా? దేశ్యేతరములు చేరవనుటా? గట్టు తెలియకయున్నది. 'దేశ్య' అనుటచేత-'తీక్ష్ణమయూఖములు ఉష్ణపయోధారలు' అనుట తప్పా? ఈవ్యాకరణముచేత తప్పే అగును. 'వంకరరేఖ' అన గూడదా? ('వంకర తద్భవముగదా.') కాని ఈవ్యాకరణము చేత అనఁగూడదు. 'కూళమహీపతులు', 'కుమ్మరవంశము' ఇత్యాదులు తప్పులా? కావు; ఒప్పులే. కాని ఈవ్యాకరణము వలన తప్పులే అగును. మఱియు—'ఇట్టిసమాసములు తఱచుగా ఆఱువర్ణములకు మించక యుండనగు' అని వీరి యాదేశము. కాని ఇట వీరొసంగిన రెం డుదాహరణములయందును వర్ణములు ఆఱింటికి హెచ్చుగానే యున్నవి. ఒకటి 'వాఁడి మయూఖములు' ఇందు అరసున్నతోఁగూడ 8 వర్ణములు. అట్లే 'వే(ఁ)డిపయోధారలు' అరసున్నతో ౮ వర్ణములు. ఇట ముద్రణములో పరమానందయ్యగారి శిష్యుఁడొకఁడు ఏటిలో మునిఁగినాఁడు, వాని పేరు అరసున్నగాఁడు, వానిని వెదకి తెచ్చి కలిపి లెక్కింపఁగా అందఱును ఎనమండ్రయినారు. ఆఱింటికి మించకయుండవలయునని. సూత్రము రచించి మించిన యుదాహరణములనే ఆదిలోనె చూపినారు. లేదా, ఈ షడ్వర్ణనియమము పూర్వపదమునకు మాత్రమా? ఉత్తర

పదమునకు సూత్రమా? మొత్తమునకుఁ గాదా? సమాస మున కంతయు ఆఉవర్ణములని వీరు వ్రాసినందున ఈప్రశ్నలు అడుగవలసివచ్చినవి. ఇది "అన్త్యం షడ్వర్ణపర్యన్తం సంస్కృతేన సమస్యతి" అను కారికను వీరు నేర్చినవిధము.

౧౦. 'ముఖపద్మము, అధరబింబము అను నుపమానోత్తర పదములు గ్రంథములం గానంబడు' నఁట. ఇవి కర్మధారయ విశేషములు; శాస్త్రసిద్ధములు. గ్రంథములం గానం బడుట యా వీనికి సాధకము? ఇట్లు వీరు వ్రాసికొన్నందున ఇవి శాస్త్రసిద్ధములు కావని వీరి యభిప్రాయముగాఁ గనఁబడు చున్నది.

"ఉపమితంవ్యాఘ్రాదిభి స్సామాన్యాప్రయోగే" అని పాణినీయసూత్రము. దానికి "వ్యాఘ్రాదిరాకృతిగణః, తేన, ఘనశ్యామః, నృసోమః, ముఖపద్మమ్, ముఖకమలమ్, కరకిసలయమ్, పార్థివచన్ద్రః, ఇత్యాది సిద్ధమ్" అని తత్త్వబోధిని. 'ఉపమాన పూర్వపదకర్మధారయములు సంస్కృత లక్షణముం దొడరనివి" అని బాలవ్యాకరణము. ఆరహస్యము నిటదాఁచిన విశేష మేమి? మఱి 'చిగురుకేల'ట! ఉదాహరణ మందును సూత్రమందును ఇదే వీరు పఠించినరూపము' చిగురుఁగేలు' అని పఠించిన చిన్నయసూరి తప్పుగావించెనా? దానిని నూకి తెచ్చివైచుకొనుట కేనియు నేర్పుచాలదాయె.

౧౧. 'సంస్కృతపదములు తమ ప్రత్యయములం గలిఁగి ఆ భాషయందే సమాసములు సేయంబడి తెనుఁగునం

బడి సిద్ధసమాసము లనఁబడుచున్నవి.' ప్రత్యయములు అని ప్రథమగా మార్చుకోవలయును. సమాసములలో ప్రత్యయములు లోపించును, కావున ప్రత్యయములు కలిగి యనుట ఇంద్రజాలముగా నున్నది. 'ఇందు ప్రాతిపదికము లగు సంస్కృత సమాసములు సిద్ధసమాసము లనంబడు' అనుటకు పై యుపన్యాసము.

దీని తర్వాతి యభ్యాసము.—

''అధికరణ మనఁగా ఆధారము. సమానాధి కరణ మనగా పూర్వోత్తర పదములు రెండును ఒక్కయాధారమున (ఎడఁబాయక) ఉండఁదగినవి'' ప్రాయికముగా ఈ వ్రాఁతయందు వాక్యములు అనన్వితములుగానే యుండును. ఎడబాయనివి పదములా, అర్థములా? పదములు శబ్ద (ధ్వని) స్వరూపములు, వానికి చెవి యాధారము. వానికే వ్రాఁతరూపములో కాగితమొకయాధారము; ఇందు ఏయాధారము వీరి యభిప్రేతమో?

'సమానాధికరణమనఁగా' అని ఏ. వ. ఇది 'ఉండఁదగినవి' అను బ. వ. తో నన్వయింపవలసియున్నది. 'పదములు' అను బహువచనముతో నది యన్వయించును అందు లేని 'అధికరణము' అను పదమునకు వాక్యమున సంబంధము లేదా? పదములు రెండును ఒకయాధారమున నుండునఁట. ఆధారమున పదార్థములుండును గాని పదములుండునా? ''విశేష్యవిశేషణ మేళనముచేనయిన కర్మధారయ సమాసము సమానాధికరణ సమాస మనంబడును'' విశేషణ విశేష్యముల మేళనముచేఁ గాని కర్మధారయములు ఏవి?

# క్రియా ప్రకరణము

౧. 'క్రియ యన వ్యాపారముం దెలుపుపదము' వ్యాపారశబ్దంబును వ్యాపారముం దెలుపునదే. అదియుఁ గ్రియాపదమా ?

౨. 'సంస్కృతధాతువుల మీఁదను శబ్దములమీఁదను ఇంచు చేర్చుటచే తత్సమక్రియ లేర్పడును ?' శబ్దములన నిట సంస్కృతశబ్దములా ? తత్సమక్రియలం జెప్పు నుద్యమముగాన 'సంస్కృతశబ్దములు' అన్న మేలుగానుండును. ఈ సూత్రమున తత్సమదేశ్యక్రియలను మాత్రమే చెప్పినారు. తద్భవక్రియలు లేవా ? 'ఉజ్జగించు, తీవరించు, వాయించు,' ఇవి లేవా ?

౩. కాలములు నాలుగఁట. అందులో తద్ధర్మార్థక మొకకాలమట. తద్ధర్మము (అనఁగా దాని స్వభావము) 'కాలమనుట అసంగతముగా నున్నది. 'వారు వత్తురు'—ఇట 'వత్తురు' తద్ధర్మాద్యర్థకము. ఇటవచ్చుట స్వభావము?

౪. 'వాఁడు, వీఁడు, అది, వారు' అనుపదములు కర్తలుగాఁగల క్రియలు ప్రథమపురుషక్రియలనియు వాడంబడు' ఈ సూత్రము ప్రకారము 'దశరథుడు వచ్చెను.' అను

వాక్యమున దశరథుఁడు కర్తయయిన క్రియ ప్రథమ పురుషముగాదు.

౧౧. ధాతువునకు భవిష్యదర్థమున 'కల' అను ననుబంధమగునఁట. అగుచో చువర్ణంబు పవర్ణంబగునఁట. అయ్యైన 'రక్షించు+కల=రక్షింపకల' అగునేగాని 'రక్షింపఁగల ? కానేరదు. 'చవర్ణమునకు' అని చెప్పియుండిన 'వండఁగల' అను ప్రకారమున రక్షించఁగల' అయి ఈ సూత్రముచేత 'రక్షింపఁగల' అని సిద్ధించును.

౧౨. 'రక్షించఁబడు' అని తొలుత ఘటిల్లినది. అనంతరము 'పడు' పరమగుచో పూర్వమందున్న చకారమునకు పకారమగు అను నీ ౧౨-వ సూ. చే 'రక్షింపఁబడు' అయినది. ఈ వాగనుశాసనుల వారికి ఈ ప్రక్రియ ౧౧-వ సూత్రము రచించు నవసరమునఁ దోఁచినదిగాదు.

ఉభయకర్తృక ప్రార్థనాద్యర్థకమఁట. ఆ యుభయమేదో బయట వేయరాదా? విద్యార్థిగాండ్రు నేర్చికొనిపోవుదురని దాఁపరికమా ?

ఆనంతర్యాద్యర్థకమఁట—ఆయాదులేవి? బా. వ్యా. న ఆనంతర్యమున నెడువర్ణకముం జెప్పిరిగాని ఆద్యర్థములందుఁ జెప్పలేదు. చిన్నయసూరి గారికి తెలియని యాదులు వీరి కేవి కనఁబడెనో ?

౧౯. ఇందును చువర్ణకమునకు పకారాదేశము చెప్పఁబడినది. దాని వలన 'రక్షించు ము' 'రక్షింపు' అగును గాని 'రక్షింపుము' అని కానేరదు. కావున 'ఇంచు క్చకారమునకు' అని వచించినచో 'రక్షింపుము' అని సిద్ధించును.

౨౦. తొల్లింటి ధాతురూపములకంటె భిన్నము లగు పెక్కు రూపములను గ్రంథములం జదివి గ్రహింప వలసినదఁట. ఇతర వ్యాకరణములవలన అవలే దేమి? ఇది వ్యాకరణసర్వస్వము గాన ఇందులేనిది కతిపయ విషయ మాత్రపరామర్శకము లగు నితర వ్యాకరణములయందు ఉండదని సూచించుటకుగాను జదువుమన లేదు.

౬. 'మదనుఁ డార్వంగనీవాఁడు మంతనములు' ఇట 'ఆర్వంగ' అను ప్రయోగము ఆడుధాతువునకు ప్రేరణమున తుమున్నర్థకరూప మఁట. ఇది 'అడచునకు' రూపాంతరమైన 'ఆఱు చు' ధాతువుయొక్క రూపము. ఎట్లన,—ఇందు చకారమునకు వత్వము వచ్చియున్నది. వత్వము అగమేతరచకారమునకు వచ్చునుగాని ఆగమ చకారమునకు రాదు. ఆగమ చకారమునకు వత్వము విహితము ఏతదనంతరసూత్ర చర్చలో మదుద్ధృతమైన బాలవ్యాకరణసూత్రముం గనునది. మఱి ప్రేరణార్థక మైన యీ (ఆర్చు. ఆడించు) ధాతు వే అర్థానుగుణము. కావున 'మదనుఁడార్పంగ' అని పఠించుకొని అర్థే యుదా

హరించుకొని యుండవలసినది 'మన్మథుఁడు ఆడింపఁగా అనఁగా పలికింపగా నీవుపలికిన రహస్యములు' అని మనోహరమైన యర్థమగును.

2. 'కర్ణు తేజః స్ఫురణము నోర్వఁగఁజాలె.' ఇట ఓడు ధాతు ప్రేరణమైన యోరుచునకు తుమున్నర్థరూపము 'ఓర్వన్' అని వీరు వ్రాసినారు. అందులకు పై సోమయాజి ప్రయోగమును ప్రమాణీకరించినారు. సరిగాని ప్రేరణ చుకారమున తుమున్నంతరూపమున వత్వము రావలదా? బా. వ్యా. క్రి. 64-వ సూ. అగమాన్య చకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు పవ లగు'' అందువలన ఈప్రేరణధాతువు నకు 'ఓర్పన్' అనురూపము కలుగునుగాని 'ఓర్వన్' అను రూపము కలుగదు. ఓర్వన్' అనునది 'ఓర్చు' అను సహనార్థకధాతువుయొక్క రూపము. ఓర్వన్ = సహించుటకు, చాలెన్ =సమర్థుఁడాయెను. ఓర్పన్ అనఁగా పరాజయముపొందింపఁగా అని యర్థము. తేజఃస్ఫురణమును సహించెను. అనుటలో యోగ్యతగలదుగాని తేజఃస్ఫురణమును పరాజయమొందించుట అనుటలో యోగ్యత లేదు. కర్ణుని ఓడించుటయన యోగ్యతగలదు. కర్ణుఁడు పోరాడును, తేజఃస్ఫురణము దుస్సహమగును. ఓడుటయును చేతనధర్మమును అచేతనమైన స్ఫురణమం దారోపించుట ద్రావిడ ప్రాణాయామమైననుగాదు. వీరు భారతము చదివి ఇంత నేర్చిరి. కావున బాలురను భారి

తము చదువుకొమ్మనుట కన్న వారికై వ్రాసిన వ్యాకరణమునే-బాలవ్యాకరణమునే-చదువుకొమ్మనుట కర్తవ్యము.

## ఉపసంహారము

ఈలఘువిమర్శను విద్యాధికారులకు సమర్పించుకొనుచు నా వేఁడుకొనుట:—పుణ్యవిశేషంబున అట్టి యధికారమునకు పాత్రమైన యామహనీయులు ఆశ్రితపక్షపాతముమాని విద్యార్థిలోకముపై పక్షపాతముపూని భారతీదేవిని హృదయమునం గొని, ఈవ్యాకరణమువంటి పుస్తకములను తొలఁగించి, పఠనీయములుగా సాధుగ్రంథములను నియమించి శాశ్వతకీర్తిని మహత్తర సుకృతమునుం బడయుదురుగాక యని.

చెన్నపురి: చంద్రికాప్రెస్సు.—10-1-1950.